




ESTD: 1999
www.voodayam.com

# ఉదయం








వరంగల్ | 10-10-2026 శనివారం | సంపుటి : 11 | సంచిక : 296 SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on


## జీవో 59 దరఖాస్తుదారులకు

# ఊరట

500 గజాల లోపు పెండింగ్‌లో ఉన్న జీవో 59 దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ల్లడించారు. ఈ మేరకు కలెక్టర్లకు 'మెమో నంబర్ 48030' ద్వారా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



**హైదరాబాద్ , అక్టోబర్ 9**

హైదరాబాద్: జీవో 59 (Go 59) దరఖాస్తుదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 500 గజాల లోపు జీవో 59 పెండింగ్ దరఖాస్తులకు నెలలో పరిష్కారం చూపుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి Reddy) తెలిపారు. ఈ మేరకు మెమో నంబర్ 48030 పేరిట కలెక్టర్లకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. జీవో 59 అమలులో అక్రమాలకు తావు లేదని.. నిబంధనల మేరకు నిర్ణయాలు ఉంటాయని పొంగులేటి పేర్కొన్నారు. గతంలో జీవో 59లో అక్రమాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కన్వేయన్స్ డీడ్స్ కేసులను కూడా సమగ్రంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నివాసాలు ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ఉద్దేశించిందే జీవో 59.

ఎర్రవల్లిలో సర్వే కోసం మరోసారి నోటీసులు ఇచ్చినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అక్కడ అసైన్డ్ ల్యాండ్ ఉంటే పేదలకు పంచుతామన్నారు. భూసర్వే పురోగతిపై సచివాలయంలో అధికారులతో పొంగులేటి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఎన్నికల్లో హామీ మేరకు అమరవీరులను గుర్తించి న్యాయం చేస్తామన్నారు. రీసర్వే పేరుతో ప్రజల నుంచి వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడాదిన్నరలో సమగ్ర భూ సర్వే పూర్తి చేస్తామన్నారు. 7 జోన్లలో సర్వే పర్యవేక్షణకు 14 మంది అధికారులను నియమించినట్లు తెలిపారు. భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

## తెలంగాణ ఆడబిడ్డలకు

## బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు



**హైదరాబాద్ , అక్టోబర్ 9**

రాష్ట్రంలోని ఆడ బిడ్డలందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులపాటు ఆడబిడ్డలందరూ ఆటపాటలతో అత్యంత వైభవంగా ఈ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించడం తెలంగాణ ప్రత్యేకత.

తెలంగాణ ప్రజల సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ఐక్యతకు బతుకమ్మ పండుగ నిలువెత్తు నిదర్శనమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ప్రజల సాంస్కృతిక వైభవాన్ని, మహిళల ఐక్యతను చాటిచెప్పే ఈ పండుగలో ఎన్నో సామాజిక అంశాలు ఇమిడి ఉన్నాయన్నారు. తెలంగాణ ఆత్మగౌరవానికి, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు.

ప్రకృతిని ఆరాధించే తెలంగాణ సంస్కృతికి అనుగుణంగా పర్యావరణ పరిరక్షణకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు.బతుకమ్మ సంబురాలు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

మొత్తానికి అటు లోక్‌సభ, ఇటు అసెంబ్లీ రెండింటిలోనూ రేగిన తిరుగుబాటుతో పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఉనికి తీవ్ర సంక్షోభంలో పడింది.

# 'సమాచార దర్పణం' పత్రిక ఆవిష్కరణ



- ప్రజాస్వామ్యానికి హృదయ స్పందన – సమాచార హక్కు చట్టం.
- రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా
- ముందస్తు సమాచార వెల్లడి, సకాలంలో సమాధానాలు, పౌర కేంద్రిత పాలనతో ప్రజల్లో విశ్వాసం మరింత బలోపేతం

**హైదరాబాద్ , అక్టోబర్ 9**

సమాచార హక్కు చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, అది మన ప్రజాస్వామ్యానికి హృదయ స్పందన వంటిదని, పారదర్శకత, జవాబుదారీతనం, పాలనలో ప్రజల భాగస్వామ్యానికి బలమైన పునాది అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. అక్టోబర్ 5 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు వారోత్సవాలు 2026లో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ సమాచార కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాచార హక్కు చట్టం, 2005 అమలులోకి వచ్చి 21 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలంటే పాలన పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండాలని గవర్నర్ పేర్కొన్నారు.

2005లో అమలులోకి వచ్చిన చారిత్రాత్మక సమాచార హక్కు చట్టం ద్వారా సామాన్య పౌరులు పాలనా వ్యవస్థను ప్రశ్నించి, ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని నేరుగా కోరే అధికారం పొందారని తెలిపారు. సమాచార హక్కు కింద దాఖలయ్యే ప్రతి దరఖాస్తు కేవలం ఒక కాగితం లేదా దరఖాస్తు మాత్రమే కాదని, దాని వెనుక ఒక సమస్య, హక్కుల కోసం విన్నపం లేదా న్యాయం కోసం చేసే ప్రయత్నం ఉంటుందని గవర్నర్ పేర్కొన్నారు. అందువల్ల ఈ చట్టం విజయాన్ని కేవలం దరఖాస్తులు, అప్పీళ్ల పరిష్కార సంఖ్యతోనే కాకుండా, పరిపాలనా విధానాల్లో తీసుకువచ్చే శాశ్వతమైన, పారదర్శకమైన మార్పులతో అంచనా వేయాలని సూచించారు.సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) కింద ముందస్తు సమాచార వెల్లడి అత్యంత కీలకమని, అది ఈ చట్టానికి ఆత్మ వంటిదని గవర్నర్ అభివర్ణించారు. ప్రభుత్వ పథకాలు, విధానాలు, తద్వారా అవసరమైన సమాచారం కోసం ప్రజలు సమాచార హక్కు దరఖాస్తులు దాఖలు చేయాల్సిన అవసరం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.డిజిటల్ యుగంలో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), డేటా విశ్లేషణ, డిజిటల్ రికార్డుల నిర్వహణ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సురక్షితంగా, సమ్మిళిత పద్ధతిలో వినియోగించడం ద్వారా సమాచార వ్యవస్థలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దవచ్చని గవర్నర్ పేర్కొన్నారు. ప్రజా సమాచార అధికారులు (PIOలు), ప్రథమ అప్పీళ్ల అధికారులు ప్రతి దరఖాస్తును బాధ్యతగా పరిగణించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. నిర్ణీత గడువులోగా స్పష్టమైన, సముచిత కారణాలతో కూడిన సమాధానాలను నిష్పక్షపాతంగా, సున్నితత్వంతో అందించడం అత్యంత ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు. అదే సమయంలో పరిపాలనా పారదర్శకతకు, పౌరుల వ్యక్తిగత గోప్యత హక్కులకు మధ్య సమతుల్యతను పాటించాలని పేర్కొన్నారు. సున్నితత్వంతో విధులు నిర్వర్తించేలా పారదర్శకమైన, సాధికార తెలంగాణ నిర్మాణానికి అందరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి సమాచార వెల్లడి, ప్రతి సకాలపు సమాధానం ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. 2014 నుంచి 2023 వరకు పదేళ్ల వార్షిక నివేదికలను డిజిటల్ సాఫ్ట్ కాపీల రూపంలో శాసనసభలో ప్రవేశపెట్టడం ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నివేదికల సమస్యను పరిష్కరించామని తెలిపారు. 2024, 2025 సంవత్సరాల నివేదికలను తదుపరి ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు.ముఖ్యమంత్రి చేతుల మీుగా కమిషన్ నూతన లోగో ఆవిష్కరణ, 'సమాచార దర్పణం' వార్తాపత్రిక ప్రారంభం, హైబ్రిడ్ విధానంలో వర్చువల్ విచారణల నిర్వహణ వంటి చర్యలతో సంస్థాగత ఆధునికీకరణకు ప్రాధాన్యతనిస్తున్నట్లు వివరించారు.తక్షణ సమాచారాన్ని ఆశించే నేటి యువత, ముఖ్యంగా జెన్‌జెడ్ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ విభాగాలు సమాచారాన్ని ముందుగానే ప్రజలకు అందించాలని ఆయన పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం తప్పనిసరిగా చేపట్టాల్సిన స్వచ్ఛంద సమాచార వెల్లడి, సమర్థవంతంగా పనిచేసే ఆన్‌లైన్ సమాచార హక్కు పోర్టల్ ద్వారా ప్రజలకు సమాచారం సులభంగా అందుబాటులోకి రావాలని సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ, మున్సిపల్ పరిపాలన వంటి అధిక భారంతో పనిచేసే శాఖల్లో అనవసర వ్యాజ్యాలను తగ్గించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు, మహిళల సమాచార హక్కు వినియోగంలో భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఈ చర్యలు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాష్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వినయ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా, రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, వైష్ణవి మెర్ల, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ శాఖలకు చెందిన ప్రజా సమాచార అధికారులు, ప్రథమ అప్పీళ్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## దిల్లీలో సీజేపీ ఆందోళనల వేడి

**దిల్లీ ,అక్టోబర్ 9.(ఎఎంఎస్) :**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ సహా సర్ ప్రక్రియను రద్దు చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ శనివారం ఆందోళనలకు పిలుపునివ్వడంతో దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. రవాణా సదుపాయాలతో పాటు పౌరుల రాకపోకలపైనా నియంత్రణ చర్యలు చేపట్టారు. నగరంలో 57 మెట్రో స్టేషన్లు మూసివేయడంతోపాటు న్యూదిల్లీ, నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే పలు రైళ్లనూ అధికారులు రద్దు చేశారు. వీటితోపాటు సెంట్రల్ దిల్లీలో ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు విధిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. జంతర్ మంతర్‌కు నాలుగు కిలోమీటర్ల పరిధిలో శుక్రవారం రాత్రి 10గంటల నుంచి శనివారం రాత్రి 10 వరకు ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు అమల్లో ఉండనున్నట్లు దిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇందుకు కేంద్ర హోంశాఖ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నాయి. ఈ నిర్దేశిత ప్రాంతాలు మినహా దిల్లీ అంతటా మొబైల్ సేవలు యథాతథంగా కొనసాగుతాయని తెలిపాయి. శనివారం ఆందోళనల నేపథ్యంలో న్యూదిల్లీ జిల్లాను 20 జోన్లుగా విభజించి.. ఆందోళనల కట్టడి ప్రణాళికను అమలు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు.దిల్లీలో ఆందోళనల వేళ.. ఇండియా కూటమి ఎంపీలు సంవిధాన్ సదన్ (పాత పార్లమెంటు భవనం) సెంట్రల్ హాలులో భేటీ అయ్యారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ విషయంపై కీలకంగా చర్చించారు.

# రాష్ట్రంలో నాణ్యమైన నూతన రోడ్ల నిర్మాణం

### సెక్రటేరియట్ లో IRC ఏర్పాట్లపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సుదీర్ఘ సమీక్ష




**హైదరాబాద్ , అక్టోబర్ 9**

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22వ తేదీ వరకు హైటెక్స్‌లో నిర్వహించనున్న 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (IRC) జాతీయ సదస్సు ఏర్పాట్లపై శుక్రవారం డా.బీ.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. సుమారు నాలుగు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో IRC సెక్రటరీ జనరల్ రాహుల్ గుప్తా, IRC డైరెక్టర్ సురేందర్ గర్గ్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, MoRTH రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,ఐ అండ్ పీఆర్ కమిషనర్ ముకుంద్ రెడ్డి, ఆర్ అండ్ బీ శాఖ చీఫ్ ఇంజనీర్లు ధర్మారెడ్డి,వసంత్ నాయక్,బి.వి రావు,నర్సింగరావు పలువురు ఆర్ అండ్ బీ ఇంజనీర్లు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌ను హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 21న ముగింపు కార్యక్రమం నిర్వహించి, గవర్నర్‌ను కూడా ఆహ్వానిస్తామని తెలిపారు. నవంబర్ 22వ తేదీ మధ్యాహ్నం ప్రతినిధుల తిరుగు ప్రయాణాలు ప్రారంభమవుతాయని చెప్పారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాలు హైదరాబాద్ చుట్టూ పూర్తి రింగ్ రోడ్డు ఏర్పాటు చేయడానికి RRR దక్షిణ భాగాన్ని కూడా ఉత్తర భాగంతో సమానంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక పార్కులు, రేడియల్ రోడ్లు తదితర భవిష్యత్ మౌలిక వసతుల అభివృద్ధికి దక్షిణ RRR కీలకంగా మారుతుందని వివరించారు.



NH765పై మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్హైదరాబాద్-శ్రీశైలం NH765లోని నల్లమల అటవీ ప్రాంతంలో మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయాలని మంత్రి కోరారు. సుమారు రూ.7,600 కోట్ల అంచనా వ్యయంతో 52 కిలోమీటర్ల మేర ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధమైందని తెలిపారు.

టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో రహదారి విస్తరణకు ఎదురవుతున్న సమస్యలకు ఈ ఎలివేటెడ్ కారిడార్ పరిష్కారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. శ్రీశైలం వెళ్లే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడంతో పాటు నల్లమల అటవీ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని వివరించారు. ప్రాజెక్టుకు కేంద్ర స్థాయిలో అవసరమైన ఆమోదాలు త్వరగా లభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.గ్లోబల్ సమ్మిట్ స్థాయిలో IRC నిర్వహణఇండియన్ రోడ్ కాంగ్రెస్‌ను కేవలం ఒక సమావేశంగా కాకుండా, తెలంగాణ రహదారుల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రోడ్డు భద్రత, పెట్టుబడుల ఆకర్షణకు ఉపయోగపడే వేదికగా తీర్చిదిద్దాలని మంత్రి అధికారులకు సూచించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతినిధులకు తెలంగాణ ఆతిథ్య సంప్రదాయాన్ని చాటిచెప్పేలా ఏర్పాట్లు చేయాలని, ప్రతి విభాగం బాధ్యతతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.ఈ సదస్సు ద్వారా హైదరాబాద్‌కు జాతీయ,

అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని, తెలంగాణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కొత్త అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## టీజీవో బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్ , అక్టోబర్ 9**

ఈరోజు హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు బీసీ సంక్షేమ శాఖ మరియు రవాణా శాఖ శ్రీ పొన్నం ప్రభాకర్ గారి చేతుల మీదుగా టీజీవో హైదరాబాద్ జిల్లా 2026 బతుకమ్మ పోస్టర్ని రిలీజ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో టీజీవో హైదరాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీమతి అంజలా రెడ్డి వందన మమత జ్యోతి చంద్రజ్యోతి సరస్వతి సంధ్యారాణి మంజుల పార్వతి ఈ కార్యక్రమంలో టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు M B కృష్ణ యాదవ్. కార్యదర్శి ఎంఏ ఖాదర్ అసోసియేట్ ప్రెసిడెంట్ జి ఆశన్న. తదితరులు పాల్గొన్నారు.

## నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై స్పందించిన డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్:**

నోబెల్ శాంతి బహుమతి రాలేదనే అసంతృప్తిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పరోక్షంగా వ్యక్తం చేశారు. దక్షిణాఫ్రికాకు చెందిన నవనీతమ్ పిళ్లైకు ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి పురస్కారం దక్కడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కారు. ఈ నేపథ్యంలో అమెరికాకు చెందిన సీనియర్ అటార్నీ డేవిడ్ షాయెన్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టును ట్రూత్ సోషల్‌లో ట్రంప్ రీపోస్ట్ చేశారు.అమెరికా, ఇజ్రాయెల్‌ను వ్యతిరేకించే వారికి పురస్కారాలు ఇవ్వడంపై ఆ పోస్టులో విమర్శించారు. రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని నివారించడానికి, గాజా పునర్నిర్మాణానికి, అలాగే అబ్రహం ఒప్పందాన్ని విస్తరించడానికి తాను చేస్తున్న కృషిని నోబెల్ కమిటీ గుర్తించలేదని ట్రంప్ పరోక్షంగా అసహనం వ్యక్తం చేశారు. కాగా, ఈ ఏడాది నవనీతమ్ పిళ్లైకి నోబెల్ శాంతి బహుమతి దక్కిన విషయం తెలిసిందే.

# దౌల్తాబాద్ మండల ఎస్సీ విభాగం చైర్మన్‌గా బొర్రోళ్ల స్వామి






- రెండోసారి బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ అధిష్ఠానం

**దౌల్తాబాద్ అక్టోబర్0 9(వుదయం):**

కాంగ్రెస్ పార్టీ దౌల్తాబాద్ మండల ఎస్సీ విభాగం చైర్మన్‌గా బొర్రోళ్ల స్వామి నియమితులయ్యారు. ఆయనపై నమ్మకంతో పార్టీ అధిష్ఠానం రెండోసారి ఈ బాధ్యతలను అప్పగించింది. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి స్వామికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొర్రోళ్ల స్వామి మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి మరోసారి అవకాశం కల్పించిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంజా విజయ్‌కుమార్, సిద్దిపేట జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ తప్పెట శంకర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తానని స్వామి పేర్కొన్నారు. ఎస్సీ వర్గాల సంక్షేమానికి, పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య, వైస్ చైర్మన్ మద్దెల స్వామి, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్‌పంచమి, యూత్ కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలశేఖర్‌రెడ్డి, మంత్రి మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**జహీరాబాద్, అక్టోబర్ 9 (వుదయం ):** జహీరాబాద్ పట్టణంలోని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో శుక్రవారం (అక్టోబర్ 9) కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బిరాదర్ శాంతకుమార్ మాట్లాడుతూ, ప్రపంచంలో ఎక్కడా లేని ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రకృతిని ఆరాధించడం తెలంగాణ ఆడపడుచుల ప్రత్యేకత అని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు రావన్న, సిద్ధన్న, గోపాల్, నర్సింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మజ్జిగ మహేశ్వర్, పి. నాగరాజు, చి. కృష్ణ చైతన్య, మహేష్‌తో పాటు అధ్యాపకులు సంగీతలక్ష్మి, సరస్వతి, జ్యోతి, పద్మ, సాయిచరణ్, వెంకట్, పి. శివకుమార్, కె. శివకుమార్, పి. బైసింగ్, పి. అనిల్, టి. సంతోష్‌కుమార్, విఠల్, సంతోష్‌రెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# పప్పుధాన్యాల సాగుపై కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన



- తాండూరులో కంది పంటల పరిశీలన.. మహిళా రైతులకు ప్రాసెసింగ్‌పై అవగాహన

**తాండూరు, అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి)**

ఆత్మనిర్భరత కోసం పప్పుధాన్యాల మిషన్ ( ఎం ఏ ఎన్ పి ) 2026-27 కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం శుక్రవారం వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలో పర్యటించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ పల్స్ డెవలప్‌మెంట్ అర్జున్ కుమార్ శివహరి తాండూరు లో కంది పంట సాగు చేసిన రైతుల పొలాలను సందర్శించి పంటల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం తాండూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో మహిళా రైతు సంఘాలకు దాల్ మిల్లు పై ఉత్పత్తిదారుల కంపెనీ (FPO) సభ్యులతో సమావేశం నిర్వహించారు ఎం ఏ ఎన్ పి పథకం కింద పప్పుధాన్యాల మిల్లు కోసం దరఖాస్తు చేసుకున్న మహిళా రైతులతో చర్చించి, పప్పుధాన్యాలను ప్రాసెసింగ్ చేసి విక్రయించడం ద్వారా స్థిరమైన ఆదాయం పొందే అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి కె. కవిత, తాండూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కె. అరుణ, డిపిఎం శేఖర్ ఏపీఎం బాలయ్య వ్యవసాయ విస్తరణ అధికారులు, మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్ నియోజకవర్గంలో తీవ్ర విషాదం

**వుదయం మనూరు అక్టోబర్:9**



సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గ మనూరు మండల్ మనూరు గ్రామం చెందిన,బట్టలు అన్ని ఉతకడానికి అని మనూరు గ్రామానికి చెందిన మాటూరి నరసింహారెడ్డి, అతని భార్య కృష్ణవేణి, అతని తమ్ముడు సంగారెడ్డి, అతని చిన్న కొడుకు హర్షవర్ధన్ రెడ్డిలు కలిసి మానూర్ గ్రామ శివారులోని సంగమేశ్వరకుంట వద్దకు వెళ్లి బట్టలు ఉతుకుతుండగా అందాజ 1130 గంటలకి మొదట సంగారెడ్డి కాలుజారి నీటిలో పడిపోగా అతనికి చేయి అందించే క్రమంలో హర్షవర్ధన్ రెడ్డి కూడా నీటిలో పడిపోగా, వీరిద్దరిని కాపాడేందుకు నరసింహారెడ్డి అతని భార్య కృష్ణవేణిలు నీటిలోకి దిగి మునిగిపోయినారు. వెంటనే నీటి అంచున ఉన్న చెట్టు కొమ్మలను పట్టుకొని హర్షవర్ధన్ రెడ్డి ఒడ్డుకు చేరి ఇదే విషయాన్ని గ్రామంలోకి వెళ్ళి గ్రామస్తులకు చెప్పగా గ్రామస్తులు, పోలీస్ వారు వెళ్లి నీటిలో మునిగిపోయిన ముగ్గురి కోసం గాలించగా మునిగిపోయిన వారి శవాలు దొరికినాయి. ఇట్టి సంఘటన మీద నరసింహారెడ్డి పెద్ద కొడుకు అయిన విష్ణువర్ధన్ రెడ్డి యొక్క స్టేట్మెంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగింది.

# ప్రజల చేతిలో సమాచార హక్కు అస్త్రం!

- పారదర్శక పాలనకు ఆర్టీఐ కీలకం.. కోహీర్ తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన సదస్సు
- ప్రభుత్వ సమాచారాన్ని తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికీ సొంతం

**కోహీర్, అక్టోబరు 9 (వుదయం ప్రతినిధి):**



ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కీలకమని అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుప్రియ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన సదస్సు నిర్వహించారు.

**ప్రభుత్వ సమాచారాన్ని తెలుసుకునే హక్కు**

సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారిక సమాచారాన్ని నిబంధనల ప్రకారం పొందవచ్చని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తదితర ప్రజా సంస్థలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు కోరవచ్చని తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై అవగాహన పెంచుకోవడంతో పాటు పాలనలో పారదర్శకతను సాధించేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**దరఖాస్తు విధానంపై అవగాహన**

ప్రజలు తమకు అవసరమైన సమాచారాన్ని పొందేందుకు సంబంధిత ప్రజా సమాచార అధికారి (పీఐఓ)కు దరఖాస్తు సమర్పించాలని సూచించారు. సాధారణంగా దరఖాస్తు రుసుము రూ.10 ఉంటుందని, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) అర్హులైన దరఖాస్తుదారులకు నిబంధనల ప్రకారం రుసుము మినహాయింపు ఉంటుందని వివరించారు. దరఖాస్తులో కోరుతున్న సమాచారాన్ని స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు.

**నిర్ణీత గడువులో సమాచారం**

సమాచార హక్కు చట్టం ప్రకారం సాధారణంగా దరఖాస్తు అందిన 30 రోజుల్లోగా సమాచారం అందించాల్సి ఉంటుందని వివరించారు. ఒక వ్యక్తి జీవితం లేదా స్వేచ్ఛకు సంబంధించిన సమాచారాన్ని కోరినప్పుడు 48 గంటల్లోగా అందించాల్సిన నిబంధన ఉందని పేర్కొన్నారు. నిర్ణీత గడువులో సమాచారం అందకపోతే చట్టప్రకారం మొదటి అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా**

సమాచారం ఇవ్వడంలో అనవసర జాప్యం చేయడం లేదా చట్ట నిబంధనలను ఉల్లంఘించడం వంటి సందర్భాల్లో సంబంధిత అధికారిపై చట్టప్రకారం జరిమానా విధించే అవకాశం ఉందని వివరించారు. సమాచారం ఇవ్వడంలో ఉద్దేశపూర్వక జాప్యం జరిగినట్లు నిర్ధారణ అయితే రోజుకు రూ.250 చొప్పున గరిష్ఠంగా రూ.25,000 వరకు జరిమానా విధించే నిబంధన ఉందని తెలిపారు.

**ప్రజల్లో చైతన్యం పెంపొందించాలి**

ప్రజలు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకుని తమకు అవసరమైన ప్రభుత్వ వివరాలను చట్టబద్ధంగా పొందాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సేవలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడంలో ఈ చట్టం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగినప్పుడే ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం మరింత బలోపేతం అవుతాయని తెలిపారు.

ఈ అవగాహన సదస్సులో సమాచార హక్కు చట్టంలోని ముఖ్యమైన అంశాలు, దరఖాస్తు విధానం, సమాచారాన్ని పొందేందుకు అనుసరించాల్సిన ప్రక్రియపై పలు విషయాలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమం లో నాయబ్ తహసీల్దార్ మల్లయ్య . తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు

# కుళ్ళిన రాజకీయ వ్యవస్థపై తిరుగుబాటు సమరభేరి

- విలువలతో కూడిన నూతన శకానికి ఆరంభం!

**సిద్దిపేట , అక్టోబర్ 09 (వుదయం బ్యూరో)**

సమాజ హితం మర్చి... స్వార్థ రాజకీయాల ముసుగులో దేశ భవిష్యత్తునే బలిపీఠం ఎక్కిస్తున్న రాజకీయ రాబందులకు కనువిప్పు కలిగించేలా సామాజిక వేదికల నుంచి పుట్టుకొస్తున్న తిరుగుబాటు గాత్రం ఇది!

ప్రజల పక్షాన నిలబడి వారి కష్టసుఖాలు తీర్చాల్సిన రాజకీయం, ఈనాడు కొందరి స్వార్థ ప్రయోజనాలకు, శవాల మీద పేలాలు ఏరుకునే నీచ సంస్కృతికి చిరునామాగా మారిపోయింది. ఒకప్పుడు రాజకీయం అంటే త్యాగం, సేవా నిరతి, ప్రజా సంక్షేమం! కానీ నేడు? అధర్మం, కుళ్ళు, కుతంత్రాలు, వెన్నుపోట్లు, తెర వెనుక రాక్షస క్రీడల కలబోతగా మారి విలువల రహితమైన 'బురద కుంట'ను తలపిస్తోంది.

**యువతను పక్కదారి పట్టిస్తూ... కులాల మధ్య కార్చిచ్చు!**

తమ ఆస్తులను, వ్యాపార సామ్రాజ్యాలను కాపాడుకోవడానికి పీఠాలపై కూర్చున్న నాయకులు... తమ పబ్బం గడుపుకోవడానికి అమాయక యువతను బలిపశువులను చేస్తున్నారు. యువతరం ప్రగతి బాట పట్టకుండా, మద్యం, డబ్బు మత్తులో ముంచెత్తుతూ తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వారిని మందుగుండు లాగా వాడుకుంటున్నారు. సమాజాన్ని ఐకమత్యంగా ఉంచాల్సిన రాజకీయం, కులాల మధ్య విషబీజాలు నాటుతూ, విడగొట్టి పాలించే నీచమైన ఎత్తుగడలకు పాల్పడుతోంది.

**డబ్బు మదంతో ప్రజాస్వామ్యం తాకట్టు!**




పదవుల వేలంలో డబ్బున్న రాబందులే రాజ్యమేలుతున్నాయి. దశాబ్దాలుగా ప్రజాసేవలో నలిగిపోయిన సీనియర్ల కష్టాన్ని, నిబద్ధతను బేఖాతరు చేస్తూ... నోట్ల సంచులతో వచ్చే బడా నేతలే పైచేయి సాధిస్తున్నారు. నిజాయితీ, నిబద్ధత అనే పదాలకు అసలు రాజకీయ నిఘంటువులోనే స్థానం లేకుండా పోయింది. ఎన్నికల వేళ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను వంచించడం, ఆ తర్వాత వారి రక్తాన్ని పిండడమే పనిగా పెట్టుకున్న ఇటువంటి నాయకులకు కాలం చెల్లబోతోంది!

**చెంపపెట్టులాంటి హెచ్చరిక... క్రొత్త విప్లవానికి శంఖారావం!**

అధికార మదంతో ఊగిపోతున్న రాజకీయ నాయకులకు సమాజం స్పష్టమైన సూచన చేస్తోంది. నిజాయితీని తాకట్టు పెట్టి చేసే ఈ కమిట్‌మెంట్ లేని నీచ రాజకీయాలకు స్వస్తి చెప్పే సమయం ఆసన్నమైంది! రాబోయే భవిష్యత్తు తరాలకు అవినీతి రహిత, విలువల తో కూడిన 'వ్యక్తిత్వ వికాస రాజకీయాలను' పరిచయం చేయడానికి ప్రజా విప్లవం సిద్ధమవుతోంది. ప్రజల కోసం, ప్రజల చేత నడిచే నూతన రాజకీయ వ్యవస్థ కోసం సమర శంఖం పూరిస్తున్నాం. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు, స్వార్థ నాయకుల చెంప పగిలేలా ప్రజలే గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

**నారాయణపేట అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి)**




జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల వద్ద అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక అధ్యక్షతన పత్తి కొనుగోళ్ల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో పత్తి కొనుగోళ్ల సమయంలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పత్తి విక్రయానికి వచ్చే రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాలు, జిన్నింగ్ మిల్లుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. యాప్ ద్వారా బుకింగ్ చేసుకునే సమయంలో నిర్ణీత సమయ పరిమితిని అమలు చేసినప్పటికీ, పత్తి స్వీకరణ, చెల్లింపుల ప్రక్రియకు అవసరమైన సమయాన్ని పొడిగించే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. పత్తి లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను పరిగణనలోకి తీసుకుని కొనుగోళ్ల నిర్వహణలో సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కొనుగోళ్లకు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పత్తి రైతుల వివరాలు, వ్యవసాయ సంబంధిత సమాచారాన్ని ఆన్‌లైన్ వ్యవస్థల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, డేటా అందుబాటులో లేకపోవడం వల్ల రైతుల రిజిస్ట్రేషన్, చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు.

ప్రతి జిన్నింగ్ మిల్లుకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, రైతులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. మిల్లులకు వచ్చిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో లేకపోయినా, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని రిజిస్ట్రేషన్ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి రవాణాలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు రవాణా శాఖ, సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పత్తి కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి బాలమణి, తూనికలు, కొలతల శాఖ అధికారి సత్యనారాయణ, సీసీఐ జిల్లా అసిస్టెంట్ మేనేజర్ దిలీప్, సీసీఐ ఇన్‌చార్జీలు అనూష, సంజీవ్ యాదవ్, అనిల్ మిశ్రా, సీఐ శివ శంకర్, స్థానిక మార్కెట్ యార్డ్ కార్యదర్శి భారతీ, సూపర్‌వైజర్ లక్ష్మణ్, జిన్నింగ్ మిల్లుల యజమానులు శ్రీనివాస్, పవన్ లాహోటి తదితరులు పాల్గొన్నారు.

# పూల పండుగొచ్చింది....!

- రేపటి నుంచి బతుకమ్మ సంబురాలు
- తెలంగాణలో ఆడ పడుచుల ఆటపాటలు
- తొమ్మిది రోజుల పాటు వేడుకలు
- నేడు ఎంగిలి పూలతో మొదలు...18న సద్దుల బతుకమ్మతో ముగింపు

**అచ్చంపేట అక్టోబర్ 9: (వుదయం ప్రతినిధి )**



తెలంగాణలో ఆడపడుచుల ఆటపాటలతో తొమ్మిది రోజుల సంబరాలు మొదలుకానున్నాయి. రేపటి నుంచి ఈ నెల 18వ తేదీ వరకు జరగనున్న బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మను తొమ్మి ది రకాల పేర్లతో పిలుస్తారు. ప్రకృతి సిద్ధమైన తం గేడు, గునుగు, చామంతి పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒక దగ్గర వుంచి మహిళలు బతుకమ్మ ఆడుతారు.

బతుకమ్మ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 10 కోట్ల రూపాయలను కేటాయించింది. ప్రతి జిల్లాకు 30 లక్షల చొప్పున నిధులు విడుదల కానున్నాయి. దీనితో బతుకమ్మ పండుగ ప్రారంభంతోపాటు నిమజ్జనం సందర్భంగా చెరువుల వద్ద కార్యక్రమాలను నిర్వహిస్తారు.

9 రోజులు 9 రూపాల్లో బతుకమ్మలు : ఒక్కోరోజు ఒక్కో విశిష్టత

**మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ**

ప్రకృతి స్వరూపిణిగా ఆరాధించే బతుకమ్మ వేడుకల్లో మొదటి రోజు ఆశ్వయుజ శుద్ధ అమావాస్య రోజు శక్తి స్వరూపిణీ అయిన గౌరమ్మను ఎంగిలి పూల బతుకమ్మ గా ఆరాధిస్తారు. ఈ రోజు వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, బతుకమ్మపై గౌరమ్మను ఉందుతారు. ఈ రోజు నైవేద్యం పెరుగన్నం

**రెండో రోజు అటుకుల బతుకమ్మ**

ప్రకృతి స్వరూపిణిగా తెలంగాణ ప్రజలు ఆరాధించే బతుకమ్మ వేడుకల్లో రెండో రోజైన అశ్వముల శుద్ధ పాడ్యమి నాడు ఆదివారం రోజు శక్తి స్వరూపిణీ అయిన గౌరమ్మను అటుకుల బతుకమ్మగా ఆరాధి స్తారు. ఈ రోజు ప్రధానంగా వి చెందించేవి అటుకులు కాబట్టి అట కుల బతుకమ్మ అని పిలుస్తారు. వివిధ రకాల పూలతో రెండు ఎక్క ఆలో గౌరమ్మను పేరుస్తారు. ఆటపాటలతో వేడుక చేసుకుంటారు. ఈ రోజు నైవేద్యంగా సప్పిడి పప్పు, బెల్లం అటుకులు సమర్పిస్తారు.

**మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ**

బతుకమ్మ వేడుకల్లో మూడో రోజైనా సోమవారం మూడు ఎత్తుల్లో పూలను పేర్చి శిఖరం మీద గౌరమ్మను ఉంచుతారు. ఇందులో బామంతి, మందార తదితర పూలను ఉపయోగిస్తారు. ప్రధానంగా ముద్దపప్పును నివేదిస్తారు. అందుకే ముద్దపప్పు బతుకమ్మగా బతుకమ్మగా పిలుస్తారు. ఈ రోజు నైవేద్యం ముద్దపప్పు, పాలు, బెల్లంతో చేసిన వంటకాలు పెడతారు.

**నాలుగో రోజు నానే బియ్యం బతుకమ్మ**

నాలుగో రోజైన ఆశ్వయుజ శుద్ధ తదియ మంగళవారం నాడు నానబోసిన బియ్యాన్ని గౌరమ్మకు ప్రధానంగా నివేదిస్తారు. అందుకు నానే బియ్యం బతుకమ్మగా పిలుస్తారు. తంగేడు, గునుగు, తదితర పూలను నాలుగు ఎత్తుల్లో పేర్చి గౌర మ్మను వాటిపై పెడతారు. ఈ రోజు నైవేద్యం నానవేసిన బియ్యం. పాలు, బెల్లం కలిపిన వంటకాలు చేస్తారు.

**ఐదో రోజు అట్ల బతుకమ్మ**

ఈ రోజు బియ్యాన్ని నానబెట్టి దంచి చేసిన అట్లను గౌరమ్మడు నివేదిస్తారు. కాబట్టి అట్ల బతుకమ్మ అని పిలుస్తారు. ఇందులో చామంతి, మందార, బీర, తంగేడు, గునుగు, గుమ్మడి తదితర పూలతో అయిదు ఎత్తుల్లో బతుకమ్మను పేరుస్తారు. ఈ రోజ నైవేద్యం బియ్యం పిండితో చేసిన అట్లు పెడతారు.

**ఆరో రోజు అలిగిన బతుకమ్మ**

బతుకమ్మ వేడుకల్లో ఆరో రోజున గురువారం గౌరమ్మను అలిగిన బతుకమ్మగా పిలుస్తారు. పూర్వ కాలంలో బతుకమ్మలను పేర్చేసమయంలో మాంసం ముద్ద తగిలి ఆపచారం జరిగింది. దీంతో ఈరోజు గౌరమ్మ ఏమి తినకుండా పస్తులు ఉంటుంది.

అందువల్ల ఈ రోజు పూలతో బతుకమ్మలను తయారు చేయకపోవడంతో పాటు నైవేద్యం కూడా ఏదీ సమర్పించరు.

**ఏడో రోజు వేపకాయల బతుకమ్మ**

బతుకమ్మ వేడుకల్లో ఏడో రోజు బియ్య పిండిని వేయించి, బెల్లం కలిపి వేపకాయ ఆకారంలో చేసిన పిండి వంటను గౌరమ్మకు నివేదిస్తారు కాబట్టి వేపకాయల బతుకమ్మ అంటారు. ఛామంతి, గునుగు, రుద్రక తదితర పూలను ఎత్తుల్లో పేర్చి, గౌరమ్మను వాటిపై పెడతారు. నైవేద్యం వేయించిన బియ్యం పిండి, బెల్లం కలిపి చేసిన వంటకం పెడతారు.

**ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ**

బతుకమ్మ వేడుకల్లో ఎనిమిదో రోజు శనివారం పూలతో ఎని మీది ఎత్తుల్లో పేర్చి గౌరమ్మను వాటిపై పెడతారు, నెవైద్యం కొబ్బరి, బెల్లం కలిపి చేసిన వంటకం పెడతారు.

**తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ**

బతుకమ్మ వేడుకల్లో చివరి రోజైన ఆదివారం పెద్ద ఎత్తున బతుక మ్మలను పేర్చి అడతాడు. నైవేద్యం బెల్లంతో చేసిన మహీళలు ఒకరికొకరు వాయినంగా ఇచ్చిపుచ్చుకుంటారు. దీనిని సద్దుల బతుకమ్మ అంటారు. అందరికీ ఎక్కువగా 9వ రోజు శుద్దుల బతుకమ్మ గురించి తెలుసు. ఈ బతుకమ్మతో 9 రోజుల సంబరాలు ముగుస్తాయి.



# ఘనంగా సేవా సంకల్ప్ అభియాన్

**సదాశివపేట అక్టోబర్ 09 (వుద మం):**

భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు కర్ణం ఆదిత్య, యువమోర్చా అధ్యక్షుడు కాశీనాథ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా సదాశివపేట మండలంలోని నందికంది గ్రామంలో రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ రాజకీయంలో 25 సంవత్సరాలుగా రాణించడం, నిరంతరం ప్రజాసేవ కార్యక్రమంలో ముందుండే వ్యక్తి నరేంద్ర మోడీ అని అన్నారు. అనంతరం మండలాధ్యక్షుడు కరణం ఆదిత్య మాట్లాడుతూ ఈ రక్త దాన కార్యక్రమంలో సుమారుగా 80 మంది రక్తము ఇవ్వడం జరిగిందన్నారు.

**అన్ని దానాల కన్నా రక్తదానమే మిన్న అని తెలిపారు.**

ఈ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొవూరి సంగమేశ్వర్, జిల్లా జనరల్ సెక్రటరీలు మాణిక్ రావు, రాజశేఖర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రెసిడెంట్ బొర్రా ప్రవీణ్, బీజేవైఎం స్టేట్ ట్రెజరర్ నరేన్ దేశ్‌పాండే, మండల్ ఇంచార్జ్ ద్వారక రవి, జనరల్ సెక్రటరీలు భరత్, హరీష్, నాయకులు శ్రీకాంత్, సుభాష్, జగన్నాథ్ రెడ్డి, నాగరాజ్, దుర్గారాజ్, వేణు, శ్రీశైలం, ప్రసాద్, పాండు, శేఖర్, మధు, పవన్, ముకేష్, శ్రీకృష్ణ, బూత్ అధ్యక్షులు రాజ్‌కుమార్, రవికృష్ణలతో పాటు నందికంది గ్రామస్థులు, బిజెపి మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్ చలువతోనే గద్వాలకు జిల్లా హోదా!



- జిల్లా దశాబ్ది సందర్భంగా బీఆర్ఎస్ 5కే రన్
- కేటీఆర్ పిలుపుతో పట్టణంలో పరుగు
- కలెక్టరేట్, వైద్య కళాశాలల ఏర్పాటును గుర్తుచేసిన బాసు హనుమంతు నాయుడు

**గద్వాల, అక్టోబర్ 09 (వుదయం బ్యూరో)**

గద్వాల జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 5కే రన్ నిర్వహిం చారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ప్రారంభించారు. పాత బస్టాండ్ నుంచి మొదలైన పరుగు కృష్ణవేణి చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా వైఎస్సార్ చౌక్ వరకు సాగింది. జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ.. కేసీఆర్ చొరవతోనే గద్వాల జిల్లా ఏర్పాటైందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంగా గద్వాల అభివృద్ధికి కలెక్టరేట్, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, ఎస్పీ కార్యాలయం వంటి కీలక సంస్థలు దోహదపడ్డాయని గుర్తుచే శారు. జిల్లా ఏర్పాటు ప్రజలకు పాలనాపర మైన సౌకర్యాలను చేరువ చేసిందని తెలిపారు. యువత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి యువత శారీరక దృఢత్వానికి ప్రాధాన్యమివ్వాలని, నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకో వాలని హనుమంతు నాయుడు సూచించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్ల గౌరవ జీవనానికి పోలీస్ శాఖ పూర్తి మద్దతు



- సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్

**సిద్దిపేట, అక్టోబర్ 9 (వుదయం బ్యూరో)**

ఇటీవల వెలుగులోకి వచ్చిన పరిణామాల నేపథ్యంలో, ట్రాన్స్‌జెండర్లు సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు మరియు వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ట్రాన్స్‌జెండర్లతో నేరుగా ముచ్చటించి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకుంటూ, జిల్లాలోని చదువుకున్న ట్రాన్స్‌జెండర్లకు సేత్విన్ సంస్థ ప్రతినిధులతో చర్చించి తగిన ఉద్యోగావకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే ఉన్నత విద్య కోసం దూరవిద్య, అంతర్జాల శిక్షణల ద్వారా నైపుణ్యాలు పెంచుకునేలా పోలీస్ శాఖ అన్ని రకాలుగా తోడ్పాటునందిస్తుందని వెల్లడించారు. ఈ ఆధునిక యుగంలో మంచి ఉపాధి మార్గాలను ఎంచుకుని సమాజంలో అందరికీ ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చిన ఈ సమావేశంలో అదనపు రక్షణ అధికారులు కుశాల్కర్, సుభాష్‌చంద్రబోస్, సహాయ కమిషనర్లు రవీందర్ రెడ్డి, నరసింహులు, సేత్విన్ ప్రతినిధి అమీనా భాను మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగాల ఉచిత కోచింగ్ ఎలిజిబిలిటీ టెస్ట్ కు 574 మంది దరఖాస్తు

- ఈ నెల 11న నారాయణపేటలో ఎలిజిబిలిటీ టెస్ట్

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 9(వుదయం ప్రతినిధి)**



జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువతకు అందిస్తున్న ఉచిత కోచింగ్‌కు సంబంధించి నిర్వహించే ఎలిజిబిలిటీ టెస్ట్‌కు జిల్లా వ్యాప్తంగా 574 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అక్టోబర్ 10 తేదీలలో తమకు సంబంధించిన స్థానిక పోలీస్ స్టేషన్‌లో హాల్ టికెట్లు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ సూచించారు. అక్టోబర్ 11వ తేదీన ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఎలిజిబిలిటీ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9:00 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఎలిజిబిలిటీ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి మెరిట్ సాధించిన 100 మంది నిరుద్యోగ యువతను ఎంపిక చేసి, వారికి పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల సాధనకు అవసరమైన ఉచిత కోచింగ్‌తో పాటు స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు ఎస్పీ తెలిపారు. పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు ఈ ఉచిత శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క అభ్యర్థి తప్పనిసరిగా ఎలిజిబిలిటీ టెస్ట్‌కు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. అభ్యర్థులు హాల్ టికెట్ తీసుకోవడం, పరీక్ష సమయానికి కేంద్రానికి చేరుకోవడం వంటి విషయాల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.



# గ్రేటర్ హైదరాబాద్



# షాద్ నగర్ చీలిపోతుందా..?

**షాద్ నగర్**

ఆరు మండలాలతో పటిష్టమైన నియోజకవర్గంగా పేరుగాంచిన షాద్ నగర్ అసెంబ్లీ రెండుగా చీలబోతుందా..? నియోజకవర్గంలోని మూడు మండలాలు కొత్తగా ఏర్పడబోయే శంషాబాద్ లేదా ఆమన్ గల్ కలవబోతున్నాయా..? కొత్తూరు మండలానికి ప్రత్యేక ఏసీపీ కార్యాలయం ఏర్పాటు కావడం మారనున్న రాజకీయ పరిణామాలకు సంకేతమా..? అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఆనాటి హైదరాబాద్ స్టేట్ కు తొలి ముఖ్యమంత్రిని ఇచ్చిన ఈ నియోజకవర్గం రూపురేఖలు త్వరలోనే మారబోతున్నాయని, ఊహించని మార్పులు చోటు చేసుకునే ప్రమాదం కనిపిస్తుందని ప్రచారం జరుగుతుంది. షికార్లు చేస్తున్న ఈ పుకార్లలో వాస్తవాలు ఎలా ఉన్నా, ప్రస్తుతం నియోజకవర్గంలో ఇది చర్చనీయాంశంగా మారింది. ఒక్కసారి వివరంగా ముందుకు వెళితే..

**నేటి అసెంబ్లీ ఇలా..**

షాద్ నగర్ నియోజకవర్గ 1952 లోని ఏర్పడింది. మొదటి ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు ఇక్కడ నుంచే పోటీ చేయడం ఈ నియోజకవర్గ ప్రత్యేకతను చాటే అంశం. గతంలో ఫరూక్ నగర్, కొందుర్గు, కేశంపేట, కొత్తూరు మండలాలతో కలిపి నియోజకవర్గ కేంద్రంగా ఉన్న షాద్ నగర్ అసెంబ్లీలో తెలంగాణ వచ్చాక అప్పటి కెసిఆర్ ప్రభుత్వం మరో రెండు ఆరు మండలాలతో మండలాలను కొత్తగా చేర్చింది. కొత్తూరు నుంచి విడిపోయిన నందిగామ, కొందుర్గు నుంచి విడిపోయిన జిల్లేడు చౌదరి గూడ నూతన మండలాలుగా ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఆరు మండలాలతో ప్రతిష్టాత్మకంగా ఉన్న షాద్ నగర్ నియోజకవర్గం 2017 వరకు మహబూబ్ నగర్ జిల్లాలో ఉండగా, తరువాత ఈ నియోజకవర్గాన్ని రంగారెడ్డి జిల్లాలో కలిపారు. ఇక ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో గురించి వస్తున్న వార్తలను ఒకసారి పరిశీలిస్తే..

**అసెంబ్లీ రూపు మారనుందా..**

ప్రస్తుతం నూతన నియోజకవర్గాలను ఏర్పాటు చేసే క్రమంలో షాద్ నగర్ నియోజకవర్గాన్ని రెండు ముక్కలు చేయనున్నట్లుగా ప్రచారాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం షాద్ నగర్ కు మాత్రమే పరిమితమైన ఏసీపి కార్యాలయాన్ని కొత్తూరులో కూడా ఏర్పాటు చేయడంతో అనుమానాలు పెరుగుతున్నాయి. నియోజక వర్గాల పునర్విభజన అంశం ఎప్పుడైనా సరే హోంశాఖ క్లియరెన్స్ ఉండాలి. ఆ దిశగా శాంతి పద్ధతుల పరిపాలన సౌలభ్యం చేసుకొని ఉంటుంది. రాష్ట్ర విభజన సమయంలో కూడా తెలంగాణ బిల్లు పరిశీలన హోంశాఖ చూసిన అంశం విధితమే. ఈ క్రమంలో నియోజకవర్గాల పునవిభజన జరిగితే నూతనంగా నియోజకవర్గాలు ఏర్పడతాయనే వార్తలు వినిపిస్తున్నాయి. శంషాబాద్ లేదా ఆమన్ గల్ (ఎస్టి) లోకి ఇక్కడి కొత్తూరు, నందిగామ, కేశంపేట మండలాలను కలిపేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇక ఇదే జరిగితే షాద్ నగర్ నియోజకవర్గానికి మిగిలేది ఫరూక్ నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగుడా మండలాలు మాత్రమే. అయితే కొత్తగా ఎప్పటి నుంచో డిమాండ్లో ఉన్న మొగిలిగిద్ద గ్రామాన్ని కూడా మండలంగా మార్చే అవకాశం కనిపిస్తుంది. ఫరూక్ నగర్ మండలంలో 47 గ్రామపంచాయతీలో ఉన్న నేపథ్యంలో ఇక్కడి మొగిలిగిద్దం మండల కేంద్రంగా మార్చి సగం గ్రామాలను ఈ మండలన్ని కలిపే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. దీనితో నాలుగు మండలాలతో షాద్ నగర్ నియోజకవర్గం మిగిలిపోనుందనే వాదన వినిపిస్తుంది.




**వీళ్ళు ఇక నాన్ లోకల్..!?**

ఈ ప్రచారం అన్ని పార్టీల్లోనూ ప్రస్తుతం అగ్రశ్రేణి నాయకత్వంలో భయాందోళనలు కలిగిస్తుంది. ఎందుకంటే ఇదే జరిగితే ప్రస్తుతం రేస్ లో ఉన్న నాయకులంతా నాన్ లోకల్ గా మారిపోయి శంషాబాద్ లేదా ఆమన్ గల్ నుంచి గట్టి పోటీ ఎదుర్కొనే అవకాశం ఎక్కువగా ఉంది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ (నందిగామ మండలం వీర్లపల్లి), ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి (నందిగామ మండలం మొదల్లగుడ), బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ (కేశంపేట మండలం ఎక్లాస్ ఖాన్ పేట), పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి (కేశంపేట మండలం సుందరాపురం), తదితర అగ్రనేతలు కొత్త నియోజకవర్గ పరిధి లోకి వెళ్ళిపోతారనే చర్చ మొదలైంది. ఇక షాద్ నగర్ నియోజకవర్గంలో ఒక్క చౌలపల్లి ప్రతాప్ రెడ్డి (ఫరూక్ నగర్ మండలం దూసకల్), నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ ప్రాంత వాస్తవ్యులు ప్రస్తుతం ఆయన హైదరాబాద్, షాద్ నగర్ రెండు చోట్ల ఉంటున్నారు. అదేవిధంగా అందే బాబయ్య మినహాయిస్తే అసెంబ్లీ పోటీలో అత్యధికంగా నిలబడే స్థాయి నాయకులు లేకపోవడం గమనార్హం. ఇదే పరిస్థితి వస్తే ప్రస్తుతం షాద్ నగర్ నియోజకవర్గపైనే ఆశలు పెట్టుకున్న మిగతా నేతలు కూడా తమ సొంత గ్రామాలు వదులుకొని ఇక్కడికే వస్తారా? లేక తమ సొంత నియోజకవర్గాల్లోనే ఉండిపోతారా? ఏది ఏమైనా ఈ "వార్త" ప్రస్తుతం నాయకులను కలవరపెడుతుంది అన్నది మాత్రం వాస్తవం..

# పీర్జాదిగూడలో దోమల దండయాత్ర

**మేడిపల్లి**
**వుదయం ప్రతినిధి అక్టోబర్ 09.**



బోడుప్పల్ సర్కిల్ లోని పీర్జాదిగూడ డివిజన్ లో దోమల తీవ్రత రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతుంది, చీకటి పడితే చాలు ఆరు బయట కూర్చోవాలంటే ప్రజలు జంకుతున్నారు, అది ఎలా మారిందంటే ఆరుబయట కుదురుగా రెండు నిమిషాలు నిలబడితే చాలు దోమలు మూకుమ్మడిగా దాడి చేసి రక్తాన్ని పీల్చే అంతగా.... అసలే ప్రజలు వాతావరణ మార్పులతో విష జ్వరాల బారిన పడుతూ.... హాస్పిటల్లో అప్పులు చేసి మరి ఆరోగ్యాన్ని బాగు చేసుకుంటున్నారు... ఆ విష జ్వరాలకు తోడుగా ఇప్పుడు దోమల వల్ల డెంగ్యూ మలేరియా వ్యాధులు సోకే అవకాశం ఎక్కువగా ఉంది, మున్సిపల్ అధికారులు మాత్రం దోమల వ్యవహారం తమకు పట్టనట్టుగా వ్యవహరించడం ప్రజలలో తీవ్ర అసహనం వ్యక్తమౌతుంది.

**నో ఫాగింగ్ నో స్ప్రేయింగ్**

తోమలు విపరీతంగా పెరుగుతున్న గాని బోడుప్పల్ సర్కిల్ అధికారులు మాత్రం ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయడం లేదనే విమర్శలు బహిరంగంగానే వ్యక్తం అవుతున్నాయి, ఇప్పుడు పీర్జాదిగూడలో అతిపెద్ద ముఖ్యమైన సమస్యగా దోమల సమస్య మారింది, ఇప్పటికైనా అధికారులు దోమల నివారణ కొరకు పాగింగ్, స్ప్రేయింగ్ చేసి దోమలను నివారించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని స్థానికులు కోరుకుంటున్నారు,

**డిప్యూటీ కమిషనర్ దృష్టి సారించాలి**

ఈ మధ్యకాలంలో విపరీతంగా పెరిగిన దోమలను నివారించేందుకు బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుకుంటూ.... క్రమం తప్పకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించి, జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలలో చెట్ల పొదలను తొలగించాలని, తద్వారా దోమల వ్యాప్తి తగ్గే అవకాశం ఉందని దీనిపై డిప్యూటీ కమిషనర్ చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

# కాన్షిరాం వర్ధంతి: బంజారాహిల్స్‌లో వేడుకలు

**గండిపేట్**
**అక్టోబర్ 09 (వుదయం):**




బహుజన సూర్యుడు, సామాజిక ఉద్యమ మహానేత మాన్యవర్ కాన్షిరాం గారి వర్ధంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవితమ్మ గారితో పాటు తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన నీరుడు సర్వేష్ ముదిరాజ్ పాల్గొని కాన్షిరాం గారి బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.మాన్యవర్ కాన్షిరాం భారతదేశంలో బహుజన ఉద్యమానికి విశేషమైన ఉద్యమ నాయకుడు. సమాజంలోని అణగారిన వర్గాలకు రాజకీయ చైతన్యం కల్పించి, వారి హక్కుల సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. దళితులు, వెనుకబడిన తరగతులు, ఆదివాసీలు తదితర అణగారిన వర్గాలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించి అవకాశాలు లభించాలనే ఆయన ఆశయాలు నేటికీ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని నాయకులు తెలిపారు. రాజకీయ అధికారంలో బహుజనులకు తగిన ప్రాతినిధ్యం ఉండాలనే లక్ష్యంతో ఆయన చేపట్టిన ఉద్యమాలు దేశవ్యాప్తంగా ఎంతోమందికి స్ఫూర్తినిచ్చాయి. ఆయన చూపిన మార్గం బహుజన సమాజానికి ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి తోడ్పడటం, మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కాన్షిరాం గారి పోరాట స్ఫూర్తి యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ వర్ధంతి కార్యక్రమంలో మాన్యవర్ కాన్షిరాం గారికి ఘన నివాళులర్పిస్తూ, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నీరుడు సర్వేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. బహుజన సమాజం ఐక్యంగా ముందుకు సాగి విద్యా, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కాన్షిరాం గారి పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడం, సమానత్వం మరియు సామాజిక న్యాయం కోసం కృషి చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జై తెలంగాణ.. జై కవితమ్మ.. మాన్యవర్ కాన్షిరాం గారికి ఘన నివాళులు అంటూ నినాదాలు చేశారు.

# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆటా పాట
- షాద్‌నగర్‌లో ఘనంగా ఎస్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ బతుకమ్మ
- బుగ్గారెడ్డి గార్డెన్ లో మారుమోగిన బతుకమ్మ ఆటా పాట

**రంగారెడ్డి జిల్లా**

షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని బుగ్గారెడ్డి గార్డెన్స్‌లో ఎస్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఘనంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ హాజరయ్యారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. బతుకమ్మ పాటలు, మహిళల సందడి, పండుగ కోలాహలం మధ్య కి, ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విశాల శ్రావణ్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, గిరిజన ఆదివాసీ రాష్ట్ర సమన్వయకర్త రఘు నాయక్, కౌన్సిలర్ సి. పెంటయ్య, మురళీమోహన్, కొప్పునూరి ప్రవీణ్, దిలీప్, రాజు నాయక్, ముబారక్ అలీ ఖాన్, చందులాల్, బాలరాజు గౌడ్, కేకే కృష్ణ, కత్తి చంద్రశేఖరప్ప, గుట్ట రాజు, మధువులు యాదవ్, కరుణాకర్, మంగ మధు, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నరేందర్ తదితరులు పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు..

# రామచంద్రాపురంలో జోనల్ కమిషనర్ పర్యటన

**కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం...కమిషనర్**

**రామచంద్రాపురం, అక్టోబర్ 9(వుదయం)**



రామచంద్రాపురం డివిజన్‌లోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ యాదవ్ చేసిన విజ్ఞప్తి మేరకు వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ శుక్రవారం పర్యటించారు .కాకతీయనగర్, శ్రీ సాయినగర్ కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు చేసి, పనులు చేపట్టాలని పుష్పనగేష్ కోరారు.అనంతరం కాకతీయనగర్‌లో హెచ్ఎండీఏ నిర్మించిన థీమ్ పార్కును పరిశీలించారు. పార్కును హెచ్ఎండీఏ నుంచి సీఎంసీకి అప్పగించే ప్రక్రియలో భాగంగా అభివృద్ధి పనులను సమీక్షించారు. పార్కును సుందరంగా తీర్చిదిద్దడంపై పుష్పనగేష్ యాదవ్‌ను అభినందించారు. కాలనీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్, ఈఈ వెంకటరమణ, ఏఈ శివ, వివిధ శాఖల అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

# రసాయన శాస్త్రంలో ముదిరెడ్డి రామిరెడ్డికి పీహెచ్.డీ.

**పటాన్చెరు (వుదయం):**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి రామిరెడ్డి ముదిరెడ్డి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'కొత్త ఆల్ఫా గ్లూకోసిడేస్ నిరోధకాలుగా బెంజిసోక్సాజోల్, సిన్నమోహైడ్రాజైడ్ ఉత్పన్నాల రూపకల్పన, సంశ్లేషణ, జీవసంబంధ మూల్యాంకనం'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ రామిరెడ్డి డాక్టరేట్ పరిశోధన, సంభావ్య మధుమేహ నిరోధక ఏజెంట్లుగా కొత్త బెంజిసోక్సజోల్‌ట్రైజోల్, సిన్నమోహైడ్రజైడ్ ఉత్పన్నాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించినట్టు తెలియజేశారు. సంశ్లేషణ చేసిన సమ్మేళనాలు ఆశాజనకమైన ఆల్ఫాగ్లూకోసిడేస్ నిరోధక క్రియాశీలతను ప్రదర్శించాయని, వీటిలో అనేక అభ్యర్థులు ప్రామాణిక ఔషధమైన అకార్బోస్ కంటే గణనీయంగా బలమైన క్రియాశీలతను కనబరిచాయన్నారు. మాలిక్యులర్ డాకింగ్, ఇన్‌సిలికో ADME/Tox అధ్యయనాలు వాటి అనుకూలమైన బంధన పరస్పర చర్యలు, ఫార్మకోకైనటిక్ లక్షణాలు, ఔషధ వంటి లక్షణాలను మరింత బలపరిచనట్టు తెలిపారు .ఈ పరిశోధన ఫలితాలు, మధుమేహ నిర్వహణకు చికిత్సా అభ్యర్థులుగా ఈ నూతన మాలిక్యులర్ స్కాఫోల్డ్ లను మరింత అభివృద్ధి చేసే సామర్థ్యాన్ని నొక్కి చెబుతున్నాయని వివరించారు. డాక్టర్ రామిరెడ్డి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ.పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా, రసాయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు తెలిపారు. డాక్టరేట్ పరిశోధన అంతటా అంకిత భావంతో మార్గనిర్దేశనం చేయడంతో పాటు సలహాలు అందించినందుకు ప్రొఫెసర్ రాంబాబును కూడా ప్రశంసించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# గీతా భూపాల్‌రెడ్డి కళాశాలలో బతుకమ్మ సంబరాలు



- విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిన మాజీ కార్పొరేటర్లు..

**రామచంద్రాపురం, అక్టోబర్ 9(వుదయం)**

రామచంద్రాపురం పరిధిలోని గీతా భూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్‌రెడ్డి హాజరై విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు.రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ విద్యార్థినులు సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని సింధు ఆదర్శ్‌రెడ్డి పేర్కొన్నారు. భావితరాలకు మన సంస్కృతిని అందించడంలో ఇలాంటి వేడుకలు కీలకమని తెలిపారు.కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ పుష్పనగేష్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# విద్యా, వైద్యానికే తొలి ప్రాధాన్యం

**మేడ్చల్**



శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ (IDOC) సమావేశ మందిరంలో ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ DISHA) సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి (మేడ్చల్), మర్రి రాజశేఖర్ రెడ్డి (మల్కాజిగిరి), బండారి లక్ష్మారెడ్డి (ఉప్పల్), మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి IAS, సైబరాబాదు మున్సిపల్ కమిషనర్ సృజన IAS, అడిషనల్ కలెక్టర్ (ACLB) ఫైజాన్ అహ్మద్ IAS, జోనల్ కమీషనర్ పింకేష్ కుమార్ తో పాటు మున్సిపల్ చైర్మన్లు, అన్ని శాఖల కేంద్ర మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ శాఖల వారీగా సమీక్ష జరుపుతూ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. మల్కాజిగిరి, సైబరాబాద్ కమీషనరేట్ ల పరిధులలో నీడలేని పేదవారికి ఆశ్రయం కల్పించే విధంగా హోమ్ లెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సెల్ఫ్ హెల్ప్ చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన మౌళిక వసతులు కల్పిస్తూ అందించడంలో రాజీ పడకూడదని సూచించారు. నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, పిఆర్ ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులు మానసికంగా, శారీరకంగా బలోపేతం అవుతారన్నారు. డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులలో పారదర్శకంగా ఏంపిక చేస్తూ కడునిరుపేద ప్రజలకు ప్రాధాన్యత నిస్తూ ఇళ్లు కేటాయించాలన్నారు. ఎలినినో ప్రభావం భారీన పడకుండా అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులు, రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిభ స్కూల్లో బతుకమ్మ సంబరాలు



**జిన్నారం**
**అక్టోబర్ 9(వుదయం ప్రతినిధి)**

మండల కేంద్రమైన జిన్నారంలో స్థానిక ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్లో బతుకమ్మ సంబరాలు ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూల పండుగ నేపథ్యాన్ని పురస్కరించుకొని బతుకమ్మను సాంప్రదాయబద్ధంగా తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించడం పట్ల విద్యార్థులను ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపల్ శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఆటపాటలతో విద్యార్థులు అలరించారు. సంబరాల తదనంతరం స్థానిక అక్కమ్మ చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# గీతా భూపాల్ రెడ్డి కళాశాలలో బతుకమ్మ సంబరాలు

**రామచంద్రాపురం (వుదయం):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వి. గీతా భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్ రెడ్డి గారు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులతో కలిసి సింధు ఆదర్శ్ రెడ్డి గారు బతుకమ్మ** పాటలకు ఉత్సాహంగా నృత్యం చేస్తూ వేడుకల్లో సందడి చేశారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు, విద్యార్థినులు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు.

**బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.**

మన సంస్కృతిని, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

**ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్ యాదవ్ గారు,**

కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి గారు, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

---

**IN COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE CUM VI ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL MALKAJGIRI DISTRICT : AT : MEDIPALLY**
**O.S.NO. 404 OF 2026**

**Between :**
K. Shyam Kumar S/o. K. Satyam, Aged about 41 years, Occ: Pvt. Employee, R/o.H.No.14-79, Swaroop Nagar Colony, Uppal, erstwhile R.R.District, M.M. District.
**..Plaintiffs**

**AND**

1. K. Praveen Kumar, S/o. Late K. Satyam, Aged about 37 years, Occ: Pvt. Employee, R/o.H.No.50/32, Raghavan Colony, Chennai, Presently residing at C/o. Kukkaduvvu Srinivasa Mudiraj, Vanniguda Village, Kesara Mandal, Ranga Reddy District, Telangana.
2. The Tahsildar, Medipally Mandal, M.M. District.
3. All Concerned

**..Defendants**

To
3. All Concerned
**..Defendants**

Whereas the plaintiffs have instituted the above suit to declare them as only surviving legal heirs of Late K. Satyam S/o. K. Mankaiah who died on 14-12-2015 and K. Shantha Bai W/o. K. Satyam who died on 12-08-2011. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to suit or who shall be accompanied by some person able to answer all such questions on the 20-10-2026, at 10:30 a.m. in the to answer claim and of your defense and to produce on said day all documents in your possession or power upon which you base your defence. Take notice that in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence as exparte

**// BY ORDER OF THE COURT //**
**Sd/-**
**M/s. D.RAVALI**
**Advocates**
**#H.No. 13-117, Sriari Nagar Colony, Near Spark Concept School, Uppal, Hyderabad-39.**
**Mobile No.94920 51742 Counsel for the Petitioner/Plaintiff**

---

**IN THE COURT OF THE HON'BLE Vth ADDITIONAL JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD**
**OS.NO. 3069 2026**

**Between :**
Mr. Rahul Vishwanathan
**Plaintiff**

**AND**

1) The Tahsildar, Khairatabad Mandal
2) All Concerned
**Defendants**

To All concerned ...
**Defendant No.2**

1. The plaintiff has instituted above suit for the relief of Declaration of Legal Heir to declare plaintiff as the only Legal Heir of deceased L.N.Vishwanathan father of plaintiff died intestate on 01-04-1993 and Late Smt. V.Vijalakshmi mother of the Plaintiff who died intestate on 23-10-2001 leaving behind their only son Mr. Rahul Vishwanathan as their legal heir
2. The above case stands posted to **29-10-2026** for the appearance of the defendants. If any person is having any right, claim or objection if any may appear before the above court at 10.30 A.M. either in person or through their counsel on the date, month and year above mentioned failing which the court shall proceed with the case as per law.

Secunderabad.
Secunderabad.
Date :- 10 -10-2026

**(BY ORDER OF COURT)**
**Sd/-**
**K.S. KUMAR**
**K.SRINIVASAN**
**Advocates**
**10-1-626/A, West Marredpally Secunderabad-500026, Mobile No. 9966971155**

---

**IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM XXIV ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD**
**MVOP. NO. 742 OF 2026**

**Between :**
Gunipudi Kishore.
**Petitioner**

**AND**

Mente Siva Balakrishna and Others
**Respondents**

To,
1. Mente Siva Balakrishna, S/o. Venkata Subbarao (As per Policy), Occ: Owner of car bearing No. AP 39-BP 6869,, R/o. H.No. 1-147, Brabala Eidi, Atreyapuram, Lolla, Kona Seema, East Godavari District, Andhra Pradesh.
**....Respondent 1**

Please take Notice that the above named Petitioner has filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on 16-10-2025 at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

**(BY ORDER OF COURT)**
**Sd/-**
**M/s. D Raju, Advocate**
**R/o. H.No. 17-1-12, Saidabad, Hyderabad.**

---

**IN THE COURT OF THE HON'BLE BEFORE THE COURT OF THE CHAIRMAN MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL - CUM - XXIV ADDL CHIEF JUDGE; CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.P.NO. 2634 OF 2025**

**Between :**
1. Gudala Jangaiah S/o Gudala Kistaiah
2. Gudala Laxmamma W/o Gudala Jangaiah Both are R/o H. No.12-44, Kodanda Ram Nagar, P and T Colony, Dilsukh Nagar, Hyderabad, Telangana 500036. Both are Temporarily come down Hyderabad at H.NO.16-2-20, Saidabad colony, Hyderabad.T.S

**Petitioner**

**AND**

1. Edigani Gopal S/o Not kwon the petitioners Aged about Major Occ Business R/o H. No. 1-124, Kuntloor Village, Abdullapurmet mandal, Rangareddy district, Telangana -501505 Owner of Vehicle Bearing No.TS08UJ4557
3. Jelapati Nagaraju S/o J Narasimha Aged above 29 years Occ Driver, R/o H. No. 1-55, Kuntloor Village, Abdullapurmet mandal, Rangareddy district, Telangana -501505 Derive of Vehicle Bearing No. TS08UJ4557.

Sirs, Whereas the above-named petitioners have filed the above MVOP for seeking the compensation amount of Rs.45,00,000/- against respondent No.1 to 3. Therefore, the respondent No. 1 and 2 above named are hereby requested to appear before the Hon'ble court at 10.30 A.M. on 15-10-2026 either in person or through Counsel duly instructed if you have any objection. Otherwise, the matter will be heard and decided exparte in your absence.

**(By order of the court)**
**Sd/-**
**Bumanandham Ganji**
**ADVOCATE,**
**Hayathnagar, Hyd.**
**Ph: 9392552949**



"నేను చాలా స్పష్టంగా చెబుతున్నాను. భారతదేశం ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని అనుమతించదు. శాట్‌కామ్ విషయంలో కూడా, కేవలం ఒకే ఒక్క సంస్థను లైసెన్స్ కోసం ఎంపిక చేయలేదు. ఈ సేవలను అందించాలనుకునే వారందరికీ లైసెన్స్‌లు జారీ చేయబడ్డాయి. ప్రస్తుతం మడు సంస్థలకు లైసెన్స్‌లు ఉన్నాయి. ఒక నిర్దిష్ట సంస్థ గురించి చాలా చర్చ జరుగుతోంది. కానీ వాస్తవానికి మడు సంస్థలు లైసెన్స్‌లు పొందాయి. అవి రిలయన్స్ జియో, వన్‌వెబ్, స్టార్‌లింక్. అలాగే, లైసెన్స్ పొందడానికి ఆసక్తి చూపిస్తున్న మరో సంస్థ కూడా ఉంది."

-జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర మంత్రి

వంపుకట్ల కాల్చి వంపు దీర్చగవచ్చు
కొండలన్ని పిండి గొట్టవచ్చు
కఠినచిత్తు మనసు కరిగింపగారాదు
విశ్వదాభిరామ వినురవేమ



# సంపాదకీయం

## పెట్టుబడులకు కేంద్రంగా తెలంగాణ

అభివృద్ధి అంటే ఆర్భాటపు ప్రకటనలు కాదు.. ఆచరణలో కనిపించే ఫలితాలు. పెట్టుబడులు పరిశ్రమలుగా మారి, ఉద్యోగాలు సృష్టించి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచినప్పుడే ప్రగతికి నిజమైన అర్థం ఉంటుంది. ఈ దిశగా తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులు, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, పన్ను వసూళ్లలో పెరుగుదల ఆశాజనక సంకేతాలిస్తున్నాయి. ఐటీ, ఐటీఈఎస్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్ల వంటి రంగాల్లో అవకాశాలు విస్తరిస్తుండటం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తోంది. అయితే ఈ పరిణామాలు ప్రకటనలకే పరిమితం కాకుండా ఉత్పత్తి, ఉపాధి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడాలి.తెలంగాణ వాణిజ్య పన్నుల ఆదాయం 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 16 శాతం పెరిగి రూ.44,372 కోట్లకు చేరడం గమనార్హం. గత ఏడాది ఇదే కాలంలో రూ.38,269 కోట్లుగా ఉన్న ఆదాయం గణనీయంగా పెరిగింది. ఇందులో జీఎస్టీ వసూళ్లది కీలక పాత్ర. జీఎస్టీ ఆదాయం 19 శాతం వృద్ధితో రూ.21,061 కోట్ల నుంచి రూ.25,049 కోట్లకు చేరింది. ఒక్క సెప్టెంబరులోనే జీఎస్టీ వసూళ్లు సుమారు 15 శాతం పెరిగి రూ.4,164 కోట్లకు చేరగా, మొత్తం వాణిజ్య పన్నుల ఆదాయం రూ.7,303 కోట్లుగా నమోదైంది. ఈ గణాంకాలు రాష్ట్రంలో వ్యాపార లావాదేవీలు, సేవల రంగం, వినియోగ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయనే సంకేతాలిస్తున్నాయి. అయితే పన్ను ఆదాయం పెరిగినంత మాత్రాన ఆర్థిక వ్యవస్థ పూర్తిస్థాయిలో బలోపేతమైనట్లు భావించలేం. ధరల మార్పులు, వినియోగం, పన్నుల పరిధి విస్తరణ, వ్యాపార లావాదేవీలు వంటి అనేక అంశాలు వసూళ్లపై ప్రభావం చూపుతాయి. అందువల్ల జీఎస్టీ వృద్ధిని పారిశ్రామిక ఉత్పత్తి, వాస్తవ పెట్టుబడులు, ఎగుమతులు, ఉద్యోగాల కల్పన వంటి ఇతర సూచికలతో కలిపి పరిశీలించాలి. తెలంగాణలో జీఎస్టీ నమోదులు 2025-26లో 2.64 లక్షల నుంచి 2026 సెప్టెంబరు నాటికి 3.28 లక్షలకు పెరగడం పన్నుల పరిధి విస్తరిస్తున్నదనే సంకేతం. ఈ వృద్ధి స్థిరంగా కొనసాగితే ప్రభుత్వానికి ఆదాయ భద్రత పెరగడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు మరిన్ని వనరులు సమకూరుతాయి.పారిశ్రామిక రంగంలోనూ పెట్టుబడుల విస్తరణ రాష్ట్రానికి సానుకూల పరిణామం. 2026-27లో ఇప్పటి వరకు 1,172 పారిశ్రామిక యూనిట్లకు అనుమతులు లభించగా, వాటి ప్రతిపాదిత పెట్టుబడుల విలువ రూ.16,384.5 కోట్లుగా ఉంది. అయితే అనుమతులు, పెట్టుబడి ఒప్పందాల సంఖ్యే అభివృద్ధికి కొలమానం కాదు. అవి వాస్తవ పెట్టుబడులుగా మారి, పరిశ్రమలు ప్రారంభమై, స్థానిక యువతకు ఉపాధి కల్పించినప్పుడే ఆశించిన ప్రయోజనాలు నెరవేరుతాయి.

నిరంతర విద్యుత్ సరఫరా, వేగవంతమైన అనుమతులు, సమర్థవంతమైన పాలన, నమ్మకమైన మౌలిక సదుపాయాలు ఉన్నప్పుడే దీర్ఘకాలిక పెట్టుబడులకు మార్గం సుగమమవుతుంది. తెలంగాణలో ప్రస్తుతం సుమారు 300 మెగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యం కార్యకలాపాల్లో ఉండగా, మరో రెండు గిగావాట్ల సామర్థ్యం అభివృద్ధి దశలో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. 2029 నాటికి ఐదు గిగావాట్ల సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యం రాష్ట్రం ముందున్న అవకాశాల విస్తృతిని తెలియజేస్తోంది. ఏఐ, డిజిటల్ మౌలిక వసతుల రంగంలో భారీ పెట్టుబడులు వస్తే డేటా సెంటర్లతో పాటు విద్యుత్, నిర్మాణం, రియల్ ఎస్టేట్, టెలికమ్యూనికేషన్లు, నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ, ఇంజినీరింగ్ వంటి అనుబంధ రంగాలూ విస్తరించే అవకాశముంది. అయితే ఈ కేంద్రాలకు అధికంగా విద్యుత్, నీరు అవసరమవుతాయి. కాబట్టి పునరుత్పాదక ఇంధన వినియోగం, నీటి సమర్థ నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి. అభివృద్ధి వేగం పెరిగినా సహజ వనరులపై ఒత్తిడి పెరగకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత. తెలంగాణ ఆర్థిక ప్రగతిని కేవలం పెట్టుబడుల ప్రకటనలతోనో,

పన్ను వసూళ్ల పెరుగుదలతోనో అంచనా వేయడం సరికాదు. పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల అమలు, ఉత్పత్తి, ఉద్యోగాల కల్పన, వ్యాపార లావాదేవీలు, ప్రజల కొనుగోలు శక్తి, ప్రభుత్వ ఆదాయం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలి. పెట్టుబడులు ఉత్పత్తి, ఉపాధి, ఆదాయంగా మారినప్పుడే వాటి అసలు విలువ వెల్లడవుతుంది. పెరిగిన పన్ను ఆదాయాన్ని విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సమర్థంగా వినియోగించినప్పుడే ఆర్థిక వృద్ధి ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులకు దారితీస్తుంది.తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా నిలబెట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలంటే పారదర్శక పాలన, విధానాల స్థిరత్వం, పెట్టుబడుల సకాల అమలు, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సమతుల్య ప్రాంతీయ ప్రగతికి ప్రాధాన్యమివ్వాలి. పెట్టుబడుల ఊపు పరిశ్రమల విస్తరణకు దారితీసి, పన్ను ఆదాయానికి ఊతమిచ్చి, ఆర్థిక వృద్ధి ప్రజల సంక్షేమంలో ప్రతిబింబించినప్పుడే తెలంగాణ అభివృద్ధి ప్రయాణం సార్థకమవుతుంది.



### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పేజీకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020



## శక్తి స్వరూపిణి బతుకమ్మ

ప్రతి పండుగ పరంపరానుగతంగా ప్రత్యేక శైలిలో, విశిష్ట పద్ధతిలో జరుపుకునే ధార్మిక కార్యాచరణాసక్తుల నిలయమైన తెలంగాణలో ఆపురూప సోదరీమణులైన జేష్టాదేవి, లక్ష్మీ దేవిలను కొలుస్తూ, బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలను భక్తి శ్రద్ధలతో, పిల్లా పాపలతో కలిసి మహిళలు జంట పండు గలుగా పక్షం రోజుల తేడాతో నిర్వహించడం అనాదిగా ఆచరిస్తున్న సనాతన

సాంప్రదాయం. బతుకునిచ్చే తల్లిని లక్ష్మీ గౌరి దేవిలను అభేదిస్తూ, శక్తి రూపంగా ఆటపాటల ద్వారా పూజిస్తూ, ఉన్నంతలో రకరకాల పదార్థాలను నివేదిస్తూ, కొత్త బట్టలు నగలు ధరిస్తూ, ఆడ బిడ్డలను ఆహ్వానిస్తూ, కలిసి జరుపుకునే పండుగ బతుకమ్మ. బతుకమ్మను పేర్చే విధానం, పూజించే తీరును బట్టి, తనను ఆరాధించడానికే శక్తిమాత ఆ రూపాన్ని కోరిందా అని అనిపిస్తుంది. శ్రీ చక్ర ఉపాసన సర్వోత్కృష్టమైన శక్తి ఆరాధనవిధానాలలో ఒకటి. బతుకమ్మను పేర్చేటప్పుడు, కమలం షట్చక్షికం/ అష్టదళ పద్మాన్ని వేసి పేర్చడంఆనవాయితీ. శ్రీచక్రం లోని మేరు ప్రస్తానం బతుకమ్మ ఆకారాన్ని పోలి ఉంటుంది. శ్రీచక్రం లోని కుండలినీ యోగ విశేష శక్తిగా బతుకమ్మలో గౌరమ్మను నిలపడం చేస్తారు. ప్రధానంగా తెలంగాణస్త్రీలు గౌరమ్మను,గౌరీ, లక్ష్మి సరస్వతులుగా త్రిగుణాత్మ స్వరూపిణిగా భావించి పూజిస్తారు. "శ్రీలక్ష్మి నీమహిమలూ గౌరమ్మ భారతి సతివయ్యి బ్రహ్మకిల్లాలిపై పార్వతి దేవివై పరమేశు రాణివై, భార్యవైతివి హరునకు గౌరమ్మా అంటూ పాడుకోడవడం విశేషం". భాద్రపద అమావాస్య మహాలయ అమావాస్య లేక ఎంగిలిపూల బతుకమ్మ అని పిలుస్తూ, ఆనాటితో ప్రారంభించి మహర్నవమి తో ముగించ బడే బతుకమ్మ పండుగ, ఆట పాటలతో నిర్వహించి, పిల్లా పాపలతో మహిళలు తన్మయత్వం పొందుతారు. ప్రతిరోజు వివిధ పిండి వంటలను ఆరగించడం చేత అనారోగ్యం పాలు కాకుండా ఉండేందుకు అర్రెమి పేరుతో ఆరవ

రోజు సెలవు తీసుకుంటారు. ఇళ్లలో ప్రతిరోజు ఒకరిని మించి మరొకరు పోటీలు పడుతూ గ్రామ పొలి

మేరలో, పంట చేలలో, ఇళ్ళల్లో, పరిసర ప్రాంతాలలో లభ్యమయ్యే తంగేడు, గునుగు, బంతి, గన్నేరు, కట్ల, గోరింట, గుమ్మడి తదితర పూలతో పసుపు గౌరమ్మ

దేవతా విగ్రహాన్ని పళ్ళెములో అందంగా, ఆకర్షణీయంగా పేర్చుతారు. నిత్య నూతన వస్త్ర దారులై, సాయంత్రం వేళ, బృందాలుగా పలు రకాల

పిండి వంటలతో ఊరి బయటకు, జలాశయాల వద్దకు వెళతారు. మధ్యలో బతుకమ్మలను ఉంచి వృత్తాకారంలో ఆడుతూ, పాడుతూ లయబద్ధంగా అడుగులేస్తూ, పదానికి పదం కలుపుతూ, శాస్త్రీయంగా నృత్యం చేస్తారు. వెంట తెచ్చుకున్న తిను బండారాలను ముందుగా నైవేద్యం పెట్టి, బతుకమ్మను నీటిలో నిమజ్జనం గావిస్తారు. అనంతరం పిండి వంటలను తోటివారికి పంచుతూ, పిల్లలతో ఒకేస్థలంలో కూర్చుండి ముత్తయిదులు సామూహికంగా ఆరగిస్తారు. సాయంత్ర మంతా ఆహ్లాదకర వాతావరణంలో గడిపి, చీకటి పడ్డాక ఇళ్లకు చేరుకుంటారు. "చేమంతి వనములో భామలు చెలి కుంటలో భామలు, ఓలలా డినారు" అంటూ గొల్ల భామలు శ్రీకృష్ణుడు పాటలు; "రాత్రి వచ్చిన సాంబ శివుడు ఎంతటి మాయల వాడే అమ్మ, "చిత్తూ చిత్తుల బొమ్మ శివుడీ ముద్దుల గుమ్మ బంగారు బొమ్మ దొరికెనమ్మ ఈ వాడ లోన"అంటూ శివ పార్వతుల గురించి; బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ

ఉయ్యాలో.. ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ

బతుకమ్మ గూర్చి; "జనకునింటి ఉయ్యాలో" అంటూ భూజాత యైన మహాసాధ్వి సీతాదేవి గురించే గాక "కలవారి కోడలు కలికి కామాక్షి"అంటూ సామాజిక అంశాల సమస్యలపై సైతం జాన పద బాణీలో బృందగానం చేసే సాంప్రదాయ గీతాలు మంత్ర ముగ్ధులను గావిస్తాయి. అన్ని వర్గాలు కలిసి ఆడడంలో మానవ సంబంధాలు, సమిష్టి భావనలు పెంపొందడంతో పాటు భారత దేశ ఔన్నత్యాన్ని తెలంగాణ ప్రాశస్త్యాన్ని తెలిపే సాంస్కృతిక వారసత్వం తరతరాలు గా కొన సాగుతున్నది. కౌటుంబిక, చారిత్రక, పౌరాణిక, సంబంధ బాంధవ్యాల, సామాజిక అంశాలతో ఉన్న జానపద పాటల వల్ల అపురూప సాహిత్యాన్ని, వారసత్వాన్ని భావి తరాలకు అందించడం జరుగు తున్నది. కుల, మత, వర్గ, పేద, ధనిక భేదాలు లేకుండా, సమిష్టిగా, సామూహికంగా ప్రకృతి ఆరాధన భాగంగా జరుపుకునే బతుకమ్మ పండుగ చర్విత చర్వణంగా సాగుతున్న నిత్య లౌకిక జీవనంలో ఒకింత మార్పు తెస్తూ, నూతనోత్సాహం, సోదర భావాన్ని అలౌకిక ఆనందాన్ని అన్నింటిని మించి సామూహిక భాగ స్వామ్యాన్ని పెంపొందించ గలదనే పరిపూర్ణ విశ్వాసంతో, బతుకమ్మ వేడుకలను మహిళలు ఆనందోత్సవాలతో ఏ యేటి కాయేడు పాల్గొంటున్నారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

## బతుకమ్మ పాట

తెలంగాణ లోన
ఉయ్యాలో
బతుకమ్మ పండుగ
ఉయ్యాలో
సంబరాల నడుమ
ఉయ్యాలో
సందడి చేయంగా
ఉయ్యాలో
పెత్ర మాసనాడు
ఉయ్యాలో
మొదలు పెట్టినాము
ఉయ్యాలో
సద్దుల బతుకమ్మతో
ఉయ్యాలో
పూర్తి పండుగ ఏ
ఉయ్యాలో
రకరకాల పూలు
ఉయ్యాలో
గునుగు గుమ్మడి పూలు
ఉయ్యాలో
అక్కా చెల్లెళ్ల వోలే
ఉయ్యాలో
బంతి చామంతులు
ఉయ్యాలో
అన్నదమ్ముల వోలే
ఉయ్యాలో
పోక బంతి పూలు
ఉయ్యాలో
పుట్టింటికి చేరే
ఉయ్యాలో
ఆడబిడ్డలంతా
ఉయ్యాలో
తల్లిదండ్రులతోటి
ఉయ్యాలో
తమ కష్టసుఖములు
ఉయ్యాలో
చెప్పుకుంటున్నారు
ఉయ్యాలో
బతుకమ్మ పేర్చంగ
ఉయ్యాలో
పువ్వు పైన పువ్వు
ఉయ్యాలో
తీరొక్క పువ్వులు
ఉయ్యాలో
ఆఖరికి ఆ పైన
ఉయ్యాలో
గౌరమ్మ నే నిలిపి
ఉయ్యాలో
పసుపు కుంకుమలు వేసి
ఉయ్యాలో
వస్త్రం జత చేసి
ఉయ్యాలో
అక్షంతల తోటి
ఉయ్యాలో
అమ్మనే పూజించి
ఉయ్యాలో
బతుకమ్మ మా ఇంట
ఉయ్యాలో
సిరులు చే తల్లి
ఉయ్యాలో
చింతలన్నీ తీర్చే
ఉయ్యాలో
చిరునవ్వులతోటి
ఉయ్యాలో
బాధలను తీర్చు
ఉయ్యాలో
బంగారు బతుకమ్మ
ఉయ్యాలో
సర్కారు సెలవులు ఇచ్చే
ఉయ్యాలో
పిల్లలకు ఉత్సాహం
ఉయ్యాలో
విజయదశమి వరకు
ఉయ్యాలో
పిల్లలు పెద్దలు
ఉయ్యాలో
పండుగలా సంతోషం
ఉయ్యాలో
ప్రతి నిమిషం పొందగా
ఉయ్యాలో
9 రోజులు ఉయ్యాలో
నవరాత్రుల పండుగ
ఉయ్యాలో
నడి రాత్రి వరకు
ఉయ్యాలో
అమ్మలక్క అంతా
ఉయ్యాలో
ఆటపాటలతోటి
ఉయ్యాలో
ఆనందమే పొందంగ
ఉయ్యాలో
బతుకమ్మ పండుగ



బొమ్మిదేని రాజేశ్వరి, పెద్దపల్లి
9052744215

# మానసిక ఆరోగ్యం ప్రభావాలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం జ్వరం లేకపోవడం మాత్రమే ఆరోగ్యం కాదని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక, సామాజిక కుశలత ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం అవుతుందని వివరిస్తున్నారు. మానసిక ఆరోగ్యం అనగా మన శక్తి సామర్థ్యాలపై మనకు పూర్తి నమ్మకం ఉండడం, ఆ శక్తిని గరిష్టంగా వినియోగించడం, నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడం, పౌర సంబంధాలను కొనసాగించం, సామాజిక బాధ్యతలను నిర్వహించడం లాంటి లక్ష్యాలు మానసిక ఆరోగ్యాన్ని సూచిస్తాయి. మన ఆలోచనలు, భావనలు, ప్రవర్తనలు, సామాజిక సంబంధాల్లో ప్రతికూల ప్రభావాలను మానసిక రుగ్మతలుగా పేర్కొనాలి. మానసిక ఆరోగ్యంతో పిల్లల మానసిక రుగ్మతలు, మాదకద్రవ్యాల వినియోగం, ఆత్మహత్యలు, ఇతర వ్యాధులు సోకడం, పనిలో ఉత్పాదకత, ఆర్థిక అస్థిరత, కుటుంబ సభ్యుల వేదనలు ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉంటాయి. మానసిక అనారోగ్యం ఫలితంగా పిల్లల్లో విద్యలో వెనుకబాటు, మానవ సంబంధాల్లో తేడాలు కనిపిస్తాయి. మానసిక రుగ్మతలను తొలి దశలో గుర్తించడం వల్ల చికిత్సతో నయం చేసుకోవచ్చు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం:

ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌజన్యంతో ప్రతియేటా 10 అక్టోబర్ రోజున 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం' పాటించడం ఆనవాయితీ వస్తున్నది. 1992లో ప్రారంభమైన ప్రపంచ మానసిక ఆరోగ్య దినం వేడుకల్లో భాగంగా విశ్వ మానవాళికి మానసిక ఆరోగ్య ప్రాధాన్యతను తెలపడం, మానసిక రుగ్మతలతో బాధ పడుతున్న వారికి చికిత్స అందించడం, మానసిక వికాసానికి పాటించాల్సిన జాగ్రత్తలను వివరించడం జరుగుతుంది. మానసిక దృఢత్వం కలిగిన వారు ఆరోగ్యవంతులుగా ఉంటారని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మానసిక వ్యాధికి మందు లేదనే నానుడి మనందరికి తెలుసు. జీవనోపాధికి బజారుకు వెళ్ళి కాయకష్టం చేసుకునే వారు కూడా నిత్యం విపత్తుల భయం గుప్పిట్లో జీవిస్తూ, మానసిక ఆందోళనకు గురౌతున్నారు. శారీరక అనారోగ్యంగా ఉండే వారు మానసిక దృఢత్వంతో ఉన్నట్లయితే తొందరగా కోలుకున్నారు. ఔషధాలతో నయం కాని రోగాలు మానసిక ధైర్యంతో నయం అవుతాయి. వ్యాధి కన్న భయం ప్రమాదకరమైందని గమనించాలి. 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినం2026' ఇతివృత్తంగా "మానసిక




రుగ్మతల నుంచి బయట పడిన వారి అనుభవాలను వినడం : వాస్తవ గళాలు, వాస్తవ మార్పులు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తేనే ఆరోగ్య అసమానతలు తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. మానసిక రోగుల్లో పేద, మధ్య ఆదాయ దేశాల ప్రజలు మాత్రమే 75 95 శాతం ఉన్నారని అంచనా. శారీరక ఆరోగ్యానికి మానసిక దృఢత్వం తప్పనిసరి అని అందరం గమనించాలి.

ప్రపంచ సమస్యగా మానసిక అనారోగ్యం:

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మానసిక ఆరోగ్య సాధనపై దృష్టిసారించి, పలు జాగ్రత్తలు తీసుకోవలసిన సమయం ఆసన్నమైందని అర్థం చేసుకోవాలి. భయం, ఒత్తిడి, ఉద్రేకం, నిరాశ, అధిక పని ఒత్తిడి, ఒంటరితనం, భావోద్వేగ ఆందోళనలు, నిద్రలేమి, మాదకద్రవ్యాలు, పర్యావరణం, కుటుంబ చరిత్ర, శారీరక ఆరోగ్యం, ఆహారం, ఆర్థిక అభద్రత, సామాజిక సంబంధాలు, పేదరికం, వివక్ష, అపోహలు, దురలవాట్లు, మెదడు గాయాలు, అప్పులు, లాంటివి మానసిక ఆరోగ్యానికి ప్రతిబంధకాలు అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 450 మిలియన్లకు పైగా ప్రజలు మానసిక రుగ్మతలతో సతమతమవుతున్నారని అంచనా. విశ్వవ్యాప్తంగా 13 శాతం అనారోగ్యాలు మానసిక సంబంధమైనవిగా గుర్తించారు. ప్రపంచ పిల్లలు, కౌమార యువతలో 20 శాతం మంది మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని తెలుస్తోంది. ప్రపంచ స్థాయిలో మానసిక ఆందోళనలతో ఏడాదికి 8 లక్షల ఆత్మహత్యలు జరుగుతున్నాయని, అసంఖ్యాకులు ఆత్మహత్యాయత్నం చేస్తున్నారని తేలింది. మానసిక రుగ్మతలు 14 ఏండ్ల లోపు పిల్లల్లో ప్రారంభం అవుతాయని గమనించాలి. మానసిక బలహీనతలతో 79 శాతం ఆత్మహత్యలు దిగువ, మధ్య తరగతి కుటుంబాలలో నమోదవుతున్నాయి. ప్రపంచ ఆర్థిక సమాఖ్య అంచనాల ప్రకారం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మానసిక సంక్షోభం స్థితి వచ్చిందని, అన్ని దేశాల్లో మానసిక రుగ్మతలు పెరుగుతున్నాయని, విశ్వ ఆరోగ్య స్థాపనకు బహుముఖీన మానసిక ఆరోగ్య వికాస చర్యలు అవసరం అవుతాయని గుర్తించారు.

మానసిక ఆరోగ్య రహస్యాలు:

మానసిక ఆరోగ్యం ఒక రోజులో సాధించేది కాదని, మన జీవనశైలి, ఆలోచనా విధానంతో దీర్ఘకాలిక జాగ్రత్తలు తీసుకోవడంతోనే సత్ఫలితాలు కనిపిస్తాయి.. మనసు విప్పి గలగల మాట్లాడడం, చలాకీగా ఉండడం, ప్రతి విషయాన్ని తేలికగా తీసుకోవడం, నవ్వటంతో పాటు నవ్వించడం, ఒత్తిడిని జయించడం, ప్రశాంతంగా నిద్ర పోవడం, ఆరోగ్యకర ఆహారం తీసుకోవడం, సమయపాలన పాటించడం, శారీరక వ్యాయామానికి సమయం ఇవ్వడం, మిత్రులతో సమస్యలను చర్చించడం, ధైర్యంగా సమస్యల్ని ఎదుర్కోవడం లాంటి అలవాట్లతో మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని నమ్మాలి. మానసిక ఆరోగ్య పరిరక్షణకు సకారాత్మక అవగాహన కల్పించడం, కుటుంబ సభ్యులు పలు అంశాల్లో మనసు విప్పి మాట్లాడుకోవడం తప్పనిసరి. సమస్యలు లేని జీవితం లేదు. వైఫల్యం రుచి చూడని వీరుడు లేడు. కష్టాలు మనకు మాత్రమే రాలేదు. కష్టసుఖాల సంగమమే జీవితం. విజయంతో విర్రవీగక, అపజయంలో ఆందోళన పడక, మానసిక పరిపక్వతతో అడుగులు వేసిన వారిని మానసిక ఆరోగ్యం వరిస్తుంది.

మానసిక ఆరోగ్యంతోనే పనిలో సఫలత సిద్ధిస్తుందని, అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ, మానసిక ఆందోళన ప్రతికూల ఫలితాలను ఇస్తుంది. మానసిక ఆందోళనతో శారీరక సామర్థ్యం తగ్గుతుంది. మానసిక ఆరోగ్యం పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుంటూ తమ తమ విధులను నిర్వహిస్తూ మానసిక, సామాజిక, శారీరక ఆరోగ్యాన్ని పొంది దేశాభివృద్ధిలో పాలు పంచుకుందాం. శారీరక, మానసిక ఆరోగ్యమే మనిషి ప్రగతికి తొలి మెట్టు అవుతుందని గట్టిగా నమ్ముదాం. మానసిక ఆరోగ్యమే మహాభాగ్యమని నినదిద్దాం.



# జాతీయం-అంతర్జాతీయం

## అక్రమాలను అడ్డుకోవడం నా తప్పా?

**దిల్లీ:**

మొబైల్‌తో అనుసంధానం ఉన్న బ్యాంకు ఖాతాలకు రూ.50 లక్షల కోట్ల మొత్తాన్ని ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా పంపించి, దళారుల చేతుల్లోకి రూ.5 లక్షల కోట్లు వెళ్లకుండా ఆపగలిగామని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. గురువారం దిల్లీలో టెలికాం శాఖ, సెల్యులార్

**ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఏర్పాటుచేసిన 'ఇండియా**

మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ)2026'ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. "తప్పుడు పద్ధతుల్ని అడ్డుకోవాలనేది నా కృత నిశ్చయం. పాత విధానంలోనైతే లీకేజీల ద్వారా ప్రజల డబ్బు కొందరి జేబుల్లోకి వెళ్లిపోయేది. మేం ఒక్క పీఎంకిసాన్ సమ్మాన్ నిధి కిందే రూ.4 లక్షల కోట్లకు పైగా డబ్బును రైతులకు బదలాయించాం. నాలుగు నెలలకోసారి వారికి డబ్బు జమ అయి ఆ మేరకు మొబైల్ ఫోన్లకు సందేశం వస్తుంది.

**ఇప్పుడు చెప్పండి.. ఎవరి అక్రమ ఆదాయం ఆగిపోయింది?**

వారు నన్ను ప్రేమిస్తారా? నేను చేసింది తప్పా..ఒప్పా? అది నేను చేయాలా, వద్దా? తప్పుడు విధానాలను ఆపాలా, వద్దా? వారు ఎంత అరిచి గీ పెట్టినా నేను ఒకసారి అనుకున్నది చేసి తీరుతాను" అని ప్రధాని తేల్చిచెప్పారు.

**అనుభవాలు పంచుకునేందుకు సిద్ధం**

దేశాల సరిహద్దులు దాటుతున్న సైబర్ నేరాలు, డీప్‌ఫేక్ ముప్పు వంటివి కట్టడి చేయడానికి ప్రభుత్వాలు, టెలికం కంపెనీలు (టెల్కోలు), ఆర్థిక సేవల



సంస్థలు ఉమ్మడిగా పనిచేయాలని మోదీ పిలుపునిచ్చారు.

**ఇలాంటి నేరాలు, మోసాల బారిన ప్రజలు పడకుండా ముందే కట్టడిచేసే ఒక యంత్రాంగాన్ని**

అందరూ కలిసి సిద్ధం చేయాలని కోరారు. సైబర్ నేరాలకు కళ్లెం వేయడంలో తగినంత అనుభవాన్ని మన

**దేశం సొంతం చేసుకుందని, దానిని ప్రపంచంతో పంచుకునేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు.**

"సైబర్ నేరాలకు దేశాల సరిహద్దులేవీ ఉండవు.

**విశ్వాసాన్ని పొందగలిగినప్పుడే సాంకేతికతకు సార్థకత. నేరగాళ్లకు కళ్లెం పడాలి.**

ఇప్పుడు మొబైల్ ఫోన్లు కేవలం సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకే కాకుండా పాలనకు, సేవల అందజేతకు ముఖ్య సాధనంగా వ్యవస్థ విస్తరిస్తున్న తరుణంలో సైబర్ ముప్పు నుంచి రక్షణనూ బలోపేతం చేసుకోవాలి.

**టెలికం రంగంలో సంస్కరణల ఎక్స్‌ప్రెస్ పరుగులు తీస్తోంది.**

భారత్‌కే కాకుండా ప్రపంచ మొబైల్ మార్కెట్‌కు రాబోయే దశాబ్దిని తీర్చిదిద్దడంలో మార్గసూచీని రూపొందించడంలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ కీలకపాత్ర పోషిస్తుంది" అని మోదీ చెప్పారు.

## బ్రెజిల్‌లో రోడ్డెక్కిన విద్యార్థులు

- బోల్సోనారోకు వ్యతిరేకంగా వేలాది మంది నిరసన
- వామపక్ష అభ్యర్థి లులాను గెలిపించాలని పిలుపు

**రియో డి జనైరో :**



బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల తొలి దశ ఫలితాలు వివాదాన్ని రేపాయి. అమెరికా అనుకూల మితవాద పార్టీ అభ్యర్థి ఫ్లావియో బోల్సోనారోను వ్యతిరేకిస్తూ బుధవారం రియో డి జనైరో నగర కేంద్రంలో వేలాది మంది విద్యార్థుల భారీ ప్రదర్శన నిర్వహించారు.

**ఎప్పటికీ బోల్సోనారో వద్దు అంటూ విద్యార్థులు నినదించారు.**

అలాగే, వామపక్ష అభ్యర్థి లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వాకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

**2019 నుంచి 2022 వరకు అధికారంలో ఉన్న జైర్ బోల్సోనారో ఆరాచకాలను నిరసనకారులు**

ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కొవిడ్ మహమ్మారిని ఆయన "చిన్న జలుబు"గా అభివర్ణించి నిర్లక్ష్యం చేశారని,

**దీంతో ఆ మహమ్మారికి 7 లక్షలకు పైగా మంది బలయ్యారని విద్యార్థులు తెలిపారు.**

తన తండ్రికి క్షమాభిక్ష (అమ్నెస్టీ) ఇప్పించేందుకు ఫ్లావియో చేస్తున్న ప్రయత్నాలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. 2022 ఎన్నికల్లో ఓటమి తర్వాత తిరుగుబాటుకు యత్నించిన కేసులో జైర్ బోల్సోనారోకు 27 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, అర్జెంటీనా అధ్యక్షుడు, మితవాది హావియర్ మిలేను అనుకరిస్తూ, ఫ్లావియో బోల్సోనారో భారీ బడ్జెట్ కోతలు చేస్తానని ప్రకటించారు. మిలే ఆర్థిక సంస్కరణలను ఆయన ప్రశంసించడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.

**రన్‌ఆఫ్‌కు సిద్ధమయ్యేందుకు ఫ్లావియో బోల్సోనారో,**

లులా ఇద్దరూ తమ ప్రచార వ్యూహాలను మార్చుకుంటున్నారు.

**దాదాపు 81 ఏళ్ల వయసులో నాలుగోసారి పోటీ పడుతున్న**

లులా, ప్రచారాన్ని కొత్తగా ప్రారంభించారు. ఇంతవరకు మితవాదులదే పైచేయిగా ఉన్న సామాజిక మాధ్యమాలపై ఆయన ప్రధానంగా దృష్టి పెట్టారు.

## అమెరికా శాంతి ప్రతిపాదనపై త్వరలో స్పందిస్తాం : ఇరాన్

**టెహ్రాన్ :**

అమెరికా శాంతి ప్రతిపాదనకు ఇరాన్ త్వరలోనే స్పందిస్తుందని ఆ దేశ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి గురువారం తెలిపారు. ఇరాన్‌పై అమెరికా సైనిక దాడులకు సిద్ధమవుతుందన్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గురువారం ఇరాన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అరాగ్చీ పాల్గొని మాట్లాడారు.

**ఇరాన్, అమెరికాల మధ్య చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని, మధ్యవర్తుల ద్వారా సందేశాల మార్పిడి కొనసాగుతోందని చెప్పారు.**

"ఏడు రోజుల ప్రణాళిక"ను ప్రస్తావిస్తూ టెహ్రాన్ గత నెలలోనే తమ ప్రతిపాదనను సమర్పించిందని, దానిపై అమెరికా అభిప్రాయాలను కూడా స్వీకరించిందని అన్నారు. తాము ప్రస్తుతం అమెరికా అభిప్రాయాలను సమీక్షిస్తున్నామని, రాబోయే కొద్ది రోజుల్లోనే తమ స్పందనను తెలుపుతామని అన్నారు.

**అమెరికా ఈ ప్రణాళికను అంగీకరిస్తే, ఆ ఏడు రోజులు రేపటి నుంచే ప్రారంభం కావచ్చని అరాఘ్చి అన్నారు.**

అవసరమైన చర్యలు ఇప్పటికే ఒక అవగాహన ఒప్పందంలో భాగంగా ఉన్నాయని, వాటిని అమలు చేయడం కష్టం కాదని ఆయన చెప్పారు. అమెరికా షరతులను నెరవేరిస్తే, ఆరవ రోజున



హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవవచ్చని, ఆ తర్వాత ఏడవ రోజున ఇరాన్,

**అమెరికాల మధ్య చర్చలు పునఃప్రారంభించవచ్చని ఆయన అన్నారు.**

ఇరాన్ పై దాడులను పునఃప్రారంభించడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని,

**అయితే, సాధ్యమయ్యే కొత్త దాడులకు సిద్ధంగా ఉండాలని పెంటగాన్‌కు**

ఆదేశాలు జారీ చేయబడ్డాయని స్థానిక మీడియా ప్రకటించిన సంగతి తెలిసిందే.

**నవంబర్ 3న జరగనున్న అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు,**

అంటే ఒక వారం ముందుగా జరగనున్న ఇజ్రాయెల్ ఎన్నికలకు ముందే దాడులు తిరిగి ప్రారంభం కావచ్చని అమెరికా, ఇజ్రాయెల్ అధికారులు స్థానిక మీడియాకు తెలిపారు. యుద్ధం తిరిగి ప్రారంభమైతే ఇరాన్ ఇంధన, మౌలిక సదుపాయాలు, అణు లక్ష్యాలపై విస్తృతమైన దాడులు ఉంటాయని మీడియానుద్దేశించి సంబంధిత వర్గాలు తెలిపాయి.

## ట్రంప్ కొత్త వివాదాస్పద వ్యాఖ్యలు

కృత్రిమ మేధ (AI)ను 'సూపర్ ఇంటెలిజెన్స్' లేక ఎస్ఐ అని పిలవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్తున్నారు. అలా పిలవని వారిని దేశద్రోహులుగా పరిగణిస్తామని హెచ్చరించారు.

**"ఎంతగానో ఆమోదం పొందిన సూపర్ ఇంటెలిజెన్స్ బదులుగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పదాన్ని వాడేవారిని వైట్‌హౌస్ శత్రువులుగా పరిగణిస్తుంది"**

అని ట్రంప్ తన సోషల్ మీడియా ట్రూత్‌లో రాసుకొచ్చారు.సత్య నాదెళ్లకు ట్రంప్ సన్మానంఏఐ పట్ల ప్రజల్లో



భయం పెరుగుతుండటంతో పాటు, ఈ సరికొత్త సాంకేతికతపై కఠిన నియంత్రణ అవసరమని డిమాండ్లు వినిపిస్తోన్న తరుణంలో ట్రంప్

**'సూపర్ ఇంటెలిజెన్స్' పేరును ప్రతిపాదించారు.**

కృత్రిమ మేధ రంగంలో తమ దేశ ఆధిపత్యాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్' కూడా ప్రకటించారు.

**ఇదిలా ఉంటే.. ను గా మారుస్తారా..?**

అని ఎలాన్ మస్క్‌కు ఇటీవల ప్రశ్న ఎదురైంది.

**అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. అవును మారుస్తామన్నారు.**

## సౌదీపై క్షిపణి హౌతీ దాడి ఇంటి నుండి పని



**రియాద్ :**

సౌదీ అరేబియాలోని రెండు అంతర్జాతీయ విమానాశ్రయాలపై హౌతీ మిలీషియా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఈ ఘటన తర్వాత అధికారులు భద్రతను పెంచారు. రియాద్‌లోని పలు అంతర్జాతీయ కంపెనీలు తమ ఉద్యోగులను ఇంటి నుంచే పనిచేయాలని సూచించినట్లు తెలిసింది.

**రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయం,**

అసిర్ ప్రావిన్స్‌లోని అభా విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. ఈ ఘటనల్లో ముగ్గురు మరణించగా, 36 మంది గాయపడ్డారు. అభా విమానాశ్రయంలో మొరాకో, అల్జీరియాకు చెందిన ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు.

**అక్కడ 28 మంది గాయపడ్డారు. రియాద్ విమానాశ్రయంలో సూడాన్‌కు చెందిన ఒక వ్యక్తి మరణించగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు.**

గత 24 గంటల్లో యెమెన్‌పై సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు 60 వైమానిక దాడులు చేశాయని, వాటికి ప్రతీకారంగా తాము ఈ దాడులు జరిపినట్లు హౌతీ సైనిక ప్రతినిధి యాహ్యా సరి తెలిపారు .ఈ దాడుల కారణంగా విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గురువారం రియాద్ నుంచి బయలుదేరాల్సిన 100కు పైగా విమానాలు రద్దయ్యాయి. మరికొన్ని విమానాలు ఆలస్యంగా నడిచాయి. విమానయాన విశ్లేషణల సంస్థ సిరియాట్ వివరాల ప్రకారం, స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 4.25 గంటల సమయానికి రియాద్ నుంచి బయలుదేరాల్సిన 378 విమానాల్లో 169 విమానాలు, రియాద్‌కు రావాల్సిన 369 విమానాల్లో 124 విమానాలు రద్దయ్యాయి లేదా ఆలస్యమయ్యాయి. సౌదీ జాతీయ విమానయాన సంస్థ సౌదియాపై ఈ ప్రభావం ఎక్కువగా కనిపించింది.

**రియాద్ నుంచి బయలుదేరాల్సిన 140 విమానాల్లో 97, రియాద్‌కు రావాల్సిన 136 విమానాల్లో 87 విమానాలకు అంతరాయం ఏర్పడింది.**

కొచ్చి నుంచి రియాద్‌కు వెళ్లే విమానాలతో పాటు కొన్ని ఆకాష్ ఎయిర్ విమానాలు కూడా రద్దయ్యాయి.ప్రయాణికులు విమానాశ్రయానికి బయలుదేరే ముందు తమ విమానయాన సంస్థలను సంప్రదించి విమాన సమయాలు, సర్వీసుల స్థితిని తెలుసుకోవాలని అధికారులు సూచించారు.

## నిరసనలను అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసుల యత్నం

**న్యూఢిల్లీ :**

ఓట్ల చోరీపై అక్టోబర్ 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టనున్న నిరసనలను అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు యత్నిస్తున్నారు. ఢిల్లీలోని సుమారు 57 మెట్రో స్టేషన్లలో ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను మూసివేయడంతోపాటు, ఆయా స్టేషన్లలో రైళ్ల రాకపోకలను తగ్గించాలని ఢిల్లీ పోలీసులు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ)కి ప్రతిపాదించినట్లు అధికారిక సమాచారం వెల్లడించింది. ఈ మేరకు గురువారం రవాణా శాఖ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డీఎంఆర్‌సీకి లేఖ రాశారు. జంతర్‌మంతర్‌తోపాటు న్యూఢిల్లీలోని ఇతర ప్రాంతాల్లో నిరసనలు జరగనున్న నేపథ్యంలో, పెద్ద సంఖ్యలో జనసమూహాలు కదిలే అవకాశం ఉందని లేఖలో పేర్కొన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గుర్తించిన మెట్రో స్టేషన్లలో అవసరమైన ఆంక్షలు విధించాలని కోరారు. ఈ ప్రతిపాదిత ఆంక్షలు శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి ప్రారంభమై, శనివారం రాత్రి వరకు కొనసాగనున్నాయి. మూసివేయనున్న 57 మెట్రో స్టేషన్లలో రాజీవ్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్, పటేల్ చౌక్, జనపథ్, న్యూఢిల్లీ, మండి హౌస్, ఐటీఓ, సుప్రీంకోర్టు, ఇంద్రప్రస్థ, కాశ్మీరీ గేట్, కరోల్‌బాగ్, ఐఎన్ఏ, హౌజ్‌ఖాస్,



లజ్‌పత్‌నగర్, జామియా మిలియా ఇస్లామియా, సీలంపూర్, వెల్‌కమ్, షాహదారా, రిథాలా, రోహిణి ఈస్ట్, రోహిణి వెస్ట్ తదితర స్టేషన్లు ఉన్నాయి. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా అక్టోబర్ 10న యువత ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ప్రకటించింది. ఈ ఆందోళనకు ముందు దేశవ్యాప్తంగా పలువురు కార్యకర్తలను నిర్బంధించారని సిజెపి కార్యకర్త అభిజీత్ దీప్కే ఎక్స్‌లో పేర్కొన్నారు. పోలీసుల చర్యలు, బెదిరింపులకు తాము వెనుకడుగు వేయబోమని ఆయన స్పష్టం చేశారు.

శుక్రవారం ఢిల్లీకి చేరుకుని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా జంతర్‌మంతర్ వరకు ర్యాలీ చేపడతామని స్పష్టం చేశారు.మెట్రో స్టేషన్లపై ఆంక్షలు విధించడం, కార్యకర్తలను నిర్బంధించడంపై సిజెపి ఆగ్రహం వ్యక్తం చేసింది. జంతర్‌మంతర్‌కు చేరుకోకుండా యువతను అడ్డుకునేందుకే పోలీసులు ఇటువంటి చర్యలు చేపడుతున్నాయని మండిపడింది.

## ఎల్‌నినో అతి తీవ్రం కాబోతోందా?



**దిల్లీ:**

ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న ఎల్‌నినో వేగంగా బలపడుతోంది. దీనివల్ల చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయి.

**ఈ మేరకు ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) గురువారం తెలిపింది.**

డిసెంబరులో ఎల్‌నినో గరిష్ఠ స్థాయికి చేరుకోనుందని తెలిపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ ఈ వాతావరణ పోకడ కొనసాగడానికి 100 శాతం అవకాశాలు ఉన్నాయని వివరించింది. దీంతో 1950 తర్వాత అత్యంత బలమైన ఎల్‌నినోగా ఇది నిలిచిపోయే అవకాశం ఉందని వివరించింది. మానవ చర్యలతో కలుగుతున్న వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఇది తీవ్రం చేస్తుందని తెలిపింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య కాలంలో.. ఎల్‌నినోకు కేంద్ర బిందువుగా ఉన్న మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో..

**సాధారణం కన్నా 3.7 డిగ్రీల సెల్సియస్ మేర పెరగొచ్చని పేర్కొంది.**

తాజా పరిణామాలపై ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు కూడా ఆందోళన వ్యక్తంచేశారు. నానాటికీ తీవ్రమవుతున్న ఎల్‌నినో వల్ల పసిఫిక్ మహా సముద్రంలో నిక్షిప్తమైన ఉష్ణం బయటకు విడుదలవుతుందని పేర్కొన్నారు. దీనివల్ల పుడమిలో చాలా భాగం తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడుతుందని పేర్కొన్నారు. "భూమి దాదాపు 'ఎర్రగా' మారింది. శీతాకాలంలో గరిష్ఠ శక్తిని సంతరించుకునే దిశగా ఎల్‌నినో సాగుతోంది" అని వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మవీ పేర్కొన్నారు. ఈ వాతావరణ పోకడ కొత్త ప్రాంతాలకూ విస్తరిస్తోందని జెకీ హాస్‌ఫాదర్ అనే శాస్త్రవేత్త వివరించారు.

**పసిఫిక్‌లోని నినో 3.4 అనే ప్రాంతంలో ఉష్ణోగ్రతల్లో వైరుధ్యాలు సాధారణం కన్నా 3.4 డిగ్రీల సెల్సియస్ మేర ఉన్నాయని వివరించారు.**

గతంలో నమోదైన ఏ ఎల్‌నినోలోనూ ఇలాంటి పరిస్థితి లేదని చెప్పారు. మరోవైపు ఇది 'సూపర్ డూపర్ ఎల్‌నినో'గా మారనుందని వాతావరణ నిపుణుడు లియోన్ సైమన్స్ పేర్కొన్నారు.

**ఎల్‌నినో వల్ల జూన్-సెప్టెంబరు మధ్య భారత్‌లో దీర్ఘకాల సరాసరి వర్షపాతంతో పోలిస్తే 87.4 శాతం మేర మాత్రమే వానలు పడ్డాయి.**

ఈ వాతావరణ పోకడ బలపడుతున్న నేపథ్యంలో దేశ ప్రజలు, పర్యావరణంపై ప్రభావం పడుతుంది. కరవు, అసాధారణ వేడి పరిస్థితులకు ఆస్కారం పెరుగుతుంది.

## ఢిల్లీ ఆంక్షలపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన సీపీఐ(ఎం)



**న్యూఢిల్లీ :**

అక్టోబర్ 10 నిరసనను అడ్డుకునేందుకు ఢిల్లీలో విధించిన తీవ్రమైన ఆంక్షలను సవాలు చేస్తూ సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న ఢిల్లీలో ఆందోళన చేపట్టనున్న సంగతి తెలిసిందే.

**ఢిల్లీకి వచ్చే రైలు సర్వీసుల రద్దుచేయడంతో పాటు 57 మెట్రో స్టేషన్ల మూసివేత,**

ఇంటర్నెట్ నిలిపివేత వంటి ఆంక్షలు పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో ఎంఏ బేబి తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ శుక్రవారం సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు.

**అక్టోబర్ 10న సిఇసికి వ్యతిరేకంగా జరగనున్న నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో రైళ్లు,**

మెట్రో సేవలను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఈ రోజే విచారణ జరపాలని కోరుతూ, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ భారత ప్రధాన న్యాయమూర్తి ముందు అత్యవసరంగా ఈ అంశాన్ని ప్రస్తావించారు.

**దేశ రాజధానిని పూర్తిగా లాక్‌డౌన్ చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.**

పౌరులకు శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కు ఉందని అన్నారు. "నా దేశానికి ఏమైపోతోంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి,**

జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. నిరసన తెలపడం ప్రాథమిక హక్కే అయినప్పటికీ, అనుమతి లేని నిరసనలను చట్టవిరుద్ధంగా పరిగణించాల్సి వస్తుందని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు.

**జంతర్ మంతర్ వద్ద ప్రదర్శనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని** నిరసనకారులు ఎందుకు సవాలు చేయలేదని ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై పూర్తి వివరాలను సమర్పించాలని కోర్టు న్యాయవాదులను ఆదేశించింది.

## అమెరికా శాంతి ప్రతిపాదనపై త్వరలో స్పందిస్తాం : ఇరాన్



- అమెరికా శాంతి ప్రతిపాదనపై ఇరాన్ స్పందన
- రెండు దేశాల మధ్య కొనసాగుతున్న చర్చలు, సందేశాల మార్పిడి
- "ఏడు రోజుల ప్రణాళిక" - అమలు విధానం
- హోర్ముజ్ జలసంధి పునఃప్రారంభం & చర్చలు
- పెంటగాన్‌కు ఆదేశాలు - ఇరాన్‌పై దాడుల ఊహాగానాలు

**టెహ్రాన్ :**

అమెరికా శాంతి ప్రతిపాదనకు ఇరాన్ త్వరలోనే స్పందిస్తుందని ఆ దేశ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి గురువారం తెలిపారు.

**ఇరాన్‌పై అమెరికా సైనిక దాడులకు సిద్ధమవుతుందన్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.**

గురువారం ఇరాన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో అరాగ్చీ పాల్గొని మాట్లాడారు. ఇరాన్, అమెరికాల మధ్య చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని, మధ్యవర్తుల ద్వారా సందేశాల మార్పిడి కొనసాగుతోందని చెప్పారు.

**"ఏడు రోజుల ప్రణాళిక"ను ప్రస్తావిస్తూ టెహ్రాన్ గత నెలలోనే తమ ప్రతిపాదనను సమర్పించిందని,**

దానిపై అమెరికా అభిప్రాయాలను కూడా స్వీకరించిందని అన్నారు. తాము ప్రస్తుతం అమెరికా అభిప్రాయాలను సమీక్షిస్తున్నామని, రాబోయే కొద్ది రోజుల్లోనే తమ స్పందనను తెలుపుతామని అన్నారు. అమెరికా

**ఈ ప్రణాళికను అంగీకరిస్తే, ఆ ఏడు రోజులు రేపటి నుంచే ప్రారంభం కావచ్చని అరాఘ్చి అన్నారు.**

అవసరమైన చర్యలు ఇప్పటికే ఒక అవగాహన ఒప్పందంలో భాగంగా ఉన్నాయని, వాటిని అమలు చేయడం కష్టం కాదని ఆయన చెప్పారు. అమెరికా షరతులను నెరవేరిస్తే, ఆరవ రోజున హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవవచ్చని,

**ఆ తర్వాత ఏడవ రోజున ఇరాన్, అమెరికాల మధ్య చర్చలు పునఃప్రారంభించవచ్చని ఆయన అన్నారు.**

ఇరాన్ పై దాడులను పునఃప్రారంభించడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇంకా చేయబడ్డాయని స్థానిక మీడియా ప్రకటించిన సంగతి తెలిసిందే. నవంబర్ 3న జరగనున్న

**అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు, అంటే ఒక వారం ముందుగా జరగనున్న ఇజ్రాయెల్ ఎన్నికలకు ముందే దాడులు తిరిగి ప్రారంభం**

కావచ్చని అమెరికా, ఇజ్రాయెల్ అధికారులు స్థానిక మీడియాకు తెలిపారు. యుద్ధం తిరిగి ప్రారంభమైతే ఇరాన్ ఇంధన, మౌలిక సదుపాయాలు, అణు లక్ష్యాలపై విస్తృతమైన దాడులు ఉంటాయని మీడియానుద్దేశించి సంబంధిత వర్గాలు తెలిపాయి.

## సిఇసి రాజీనామాకు జాన్ బ్రిట్టాస్ డిమాండ్

**న్యూఢిల్లీ :**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సిపిఎం రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిట్టాస్ స్పష్టం చేశారు.ఓట్ల చోరీపై ఇండియా బ్లాక్ ఎంపిలు గత కొన్ని రోజులుగా ఢిల్లీలో నిరసన చేపడుతున్నారని అన్నారు. ఈ ఆందోళనను మరింత ఉధృతం చేసేందుకు భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా మని వెల్లడించారు. తాము లేవనెత్తిన అంశాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి తీసుకెళ్లేందుకు కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, శనివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు, యువత నిరసనకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, వారు రాజధానికి చేరుకోకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని బ్రిట్టాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనల్లో పాల్గొనవద్దంటూ ఢిల్లీ పోలీసులు మసీదులకు వెళ్లి మరీ కోరుతున్నారని, ఇది ముస్లిం సమాజానికి పరోక్ష హెచ్చరికగా ఉందని విమర్శించారు. అయినప్పటికీ తమ ఆందోళనను విరమించబోమని స్పష్టం చేశారు. తాము లేవనెత్తిన సమస్యలు, డిమాండ్ల ప్రాధాన్యతను వివరించేందుకు రాష్ట్రపతిని కలవాలని భావిస్తున్నామని, ఆమె తమ వాదనలను వింటారని ఆశిస్తున్నామని బ్రిట్టాస్ పేర్కొన్నారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## జవాబుదారీతనాన్ని బలోపేతం చేసేలా సమాచార హక్కు చట్టాను అమలు చేయాలి



**రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల**

**జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 09(వుదయం జిల్లా ప్రతినిధి):**

ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంపొందిస్తూ, ప్రభుత్వ శాఖల పనితీరులో జవాబుదారీతనాన్ని బలోపేతం చేసేలా సమాచార హక్కు చట్టం-2005ను పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సూచించారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలు-2026ను పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ఐడీఓసీ సమావేశపు హాలు నుండి అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పాలనకు సంబంధించిన సమాచారాన్ని అందించడం ద్వారా పరిపాలనలో పారదర్శకత, అధికారుల పనితీరులో జవాబుదారీతనం పెరుగుతాయని పేర్కొన్నారు. చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, పౌర సమాజంపై ఉందన్నారు.చట్ట నిబంధనలకు అనుగుణంగా సమాచార దరఖాస్తులకు నిర్ణీత గడువులోగా సమాధానాలు అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం సమాచార హక్కు చట్టం-2005ను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా అమలు చేస్తూ, ప్రజలకు చట్టబద్ధంగా అందించాల్సిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అందిస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ శాఖల్లో సమాచార నిర్వహణను మెరుగుపరచడం, ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సులభంగా అందుబాటులో ఉంచడం, చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషన్ సేవలు, సమాచార హక్కు చట్టం అమలుకు సంబంధించిన అంశాలను వివరించే సమాచార దర్పణం బ్రోచర్‌ను ఆవిష్కరించారు.రాష్ట్రవ్యాప్తంగా సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ...

పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంతో పాటు ప్రభుత్వ శాఖల కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో సమాచార హక్కు చట్టం-2005. .సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అమలు చేయడం ద్వారా ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి శాఖ కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతీ యువకులకు డిజిటల్ లైబ్రరీ ఎంతో ఉపయోగం



**రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**భూపాలపల్లి: అక్టోబర్ 09 (వుదయం విలేకరి)**

వివిధ ప్రభుత్వ ఉద్యోగాల సాధన పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు డిజిటల్ లైబ్రరీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన డిజిటల్ లైబ్రరీలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులతో మంత్రి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ గ్రంథాలయాల్లో అందుబాటులో లేని పుస్తకాలను సైతం ఈ లైబ్రరీ ద్వారా ఆన్‌లైన్‌లో చదివే అవకాశం ఉంటుందని తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమైన నాణ్యమైన అధ్యయన సామగ్రిని డిజిటల్ రూపంలో పొందవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం వివిధ శాఖల్లో ఉద్యోగ నియామకాలు చేపడుతున్న నేపథ్యంలో నిరుద్యోగ యువతకు డిజిటల్ లైబ్రరీ ఎంతగానో తోడ్పడుతుందని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. జిల్లాలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకొని, 10 కంప్యూటర్లు, అవసరమైన ఫర్నిచర్ సమకూర్చిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మంత్రి అభినందించారు. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, గ్రంథాలయ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, లైబ్రేరియన్ శారద, ప్రజాప్రతినిధులు, పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 13న జిల్లాలో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ పర్యటన

**భూపాలపల్లి: అక్టోబర్ 09 (వుదయం విలేకరి):**



జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ ఈ నెల 13వ తేదీన జిల్లాలో పర్యటించనున్నందున అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలను సమగ్రంగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శుక్రవారం అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన వివరాల కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమాచారాన్ని సిద్ధం చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని నిర్ణీత ఫార్మాట్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారికి సమర్పించాలని ఆదేశించారు. వివిధ శాఖల నుంచి అందిన సమాచారాన్ని క్రోడీకరించి, జిల్లా స్థాయి సమగ్ర నివేదికను రూపొందించాలని గిరిజన సంక్షేమశాఖ అధికారిని ఆదేశించారు. ఎస్‌టీ కమిషన్ సభ్యుల పర్యటనకు సంబంధించిన అంశం అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, అధికారులు అత్యవసరంగా పరిగణించి నిర్ణీత సమయంలో సమాచారాన్ని అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, ఎస్సీ నరేశ్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువత నైపుణ్యాలను పెంపొందించుకొని ఉద్యోగాలు సాధించాలి

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

**జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 09(వుదయం ప్రతినిధి):**

యువత చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత వేతనాలతో కూడిన ఉద్యోగాలు సాధించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు.నిరుద్యోగ యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్‌లో శుక్రవారం టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై న మంత్రి అన్ని స్టాళ్లు పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 142కి పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొని యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ప్రారంభంలో రూ.10 వేల నుంచి రూ.20 వేల వేతనంతో ఉద్యోగంలో చేరినా, అనుభవం, నైపుణ్యాలను పెంచుకుంటే రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు వేతనం పొందే అవకాశాలు ఉంటాయన్నారు.వ్యవసాయం, కూలీ పనులు, చిన్న వ్యాపారాలు చేస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలను చదివిస్తున్నారని, వారి కష్టాన్ని గుర్తించి యువత పప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించేందుకు ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీతో పాటు టాస్క్ ద్వారా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి తెలిపారు. అర్హతలతో పాటు నైపుణ్యాలు ఉన్నప్పుడే మెరుగైన ఉద్యోగాలు, పదోన్నతులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. గ్రూప్1, 2, 3, 4 పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తూ అర్హులకు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ తదితర విద్యార్హతలు కలిగిన యువత ప్రైవేటు రంగంలోనూ ఉద్యోగాలు సాధించేలా జాబ్‌మేళాలు దోహదపడతాయని పేర్కొన్నారు. జాబ్‌మేళా ప్రారంభమైన రెండు గంటల్లోనే 600 మందికి పైగా యువత ప్రాథమికంగా ఎంపికైనట్లు మంత్రి వెల్లడించారు. కొన్ని కంపెనీలు ఒక్కొక్కటి 100 నుంచి 400 మందికి పైగా అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆసక్తి చూపినట్లు తెలిపారు. యువత ఉద్యోగాల కోసం ప్రాంతీయ పరిమితులు విధించుకోకుండా, ఎక్కడ అవకాశం వచ్చినా అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ భూపాలపల్లి నిరుద్యోగ యువతకు మెగా జాబ్‌మేళా గొప్ప అవకాశమన్నారు.సుమారు 10 వేల నుంచి 12 వేల వరకు ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాకు 142కు పైగా కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సంకీర్త్, టాస్క్ సీఈఓ ప్రదీప్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, రాష్ట్ర ఉపాధి హామీ పథకం డైరెక్టర్ దండు రమేష్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ ఉదయ్ కుమార్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.



## ఆర్టీఐ అమలులో రాష్ట్రంలోనే ఉత్తమ జిల్లాగా సూర్యాపేట ఎంపిక




**సూర్యాపేట, అక్టోబర్ 09: (వుదయం ప్రతినిధి):**

సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలులో సూర్యాపేట జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్రంలోనే 'ఉత్తమ జిల్లా' గా ఎంపికైంది. పారదర్శక పాలన, వేగవంతమైన సమాచార సేవలు అందించడంలో ప్రతిభ కనబరిచినందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పురస్కారాన్ని అందుకున్నారు.

పారదర్శక పాలనకు దక్కిన గుర్తింపు

ప్రజాస్వామ్యంలో పౌరులకు ఆర్టీఐ చట్టం ద్వారా వేగవంతమైన, ఖచ్చితమైన సేవలు అందిస్తూ, వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో సూర్యాపేట జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపింది. ఆర్టీఐ దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా, సమర్థవంతంగా పరిష్కరించడం వల్లే ఈ అరుదైన గుర్తింపు సాధ్యమైందని అధికారులు తెలిపారు.

అభినందనల వెల్లువ

అత్యుత్తమ జిల్లాగా ఎంపికై అవార్డు అందుకున్న కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కు జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, సిపిఓ కిషన్, సిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, ఆర్డీవో పురుషోత్తం రెడ్డి, డిపిఆర్ఓ వల్లొజి శ్రీనివాసరావు, డిడి అడల్ట్ ఎడ్యుకేషన్ సిహెచ్. అనిల్ కుమార్, ఇడి ఎస్సీ కార్పొరేషన్ ఉపేందర్, డిఎస్డీఓ వెంకట్ రెడ్డి, డిఐఇఓ సులోచన రాణి, జిఎం ఇండస్ట్రీస్ భారతి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారత్ భారతి హైస్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు




**విద్యార్థినుల ఆటపాటలతో సందడిగా పాఠశాల ప్రాంగణం**

**పాఠశాల రెస్పాండెంట్ మోదుగు జ్యోతి ప్రిన్సిపాల్ సత్తిరెడ్డి**

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 09**

నల్గొండ పట్టణ కేంద్రంలో పానగల్ రోడ్డు వైపు ఉన్న భారత్ భవిత హైస్కూల్లో నేడు ఎంగిలిపు బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం లో పాఠశాల కరస్పాండెంట్ మెదుగు జ్యోతి మాట్లాడుతూ...తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను భారత్ భారతి హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, పూల పండుగ వైభవానికి ప్రతీక బతుకమ్మ అని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడంతో పాటు ఐకమత్యం, సృజనాత్మకత, సామాజిక స్పృహ పెరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన పండుగలు, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలుసుకోవాలని సూచించారు. బతుకమ్మ పాటలు, కోలాటాలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కే నాగయ్య నరసింహ డాక్టర్ సుధాకర్ శ్రీకాంతు బెంజిమెన్ అనుపమ హుస్సేన్ నాయక్ విజయలక్ష్మి అనిత ఇందు మమత సఫియా డ్రైవర్ నాగయ్య ఆశలు రేణుక అభినవ మౌనిక గౌతమి విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## శ్రీ విద్యా పాఠశాలలో ఘనంగా విజయదశమి వేడుకలు

**విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యం**

**విద్యార్థులకు దసరా శుభాకాంక్షలు**

**పాఠశాల సీఈఓ ఎం. చైతన్య కృష్ణ**

**భద్రాచలం,అక్టోబర్10 (వుదయం ప్రతినిధి) :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని శ్రీ విద్యా పాఠశాలలో విజయదశమి పర్వదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో, అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దసరా పండుగను పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో పండుగ సందడి నెలకొంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని పండుగ శోభను మరింత పెంచారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం, అన్యాయంపై న్యాయం సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగ నిలుస్తుందని ఈ సందర్భంగా వివరించారు. భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగల నిర్వహణకు ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. . ఈ సందర్భంగా శ్రీ విద్యా పాఠశాల సీఈఓ ఎం. చైతన్య కృష్ణ విద్యార్థులకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, ఆనందం, ఆరోగ్యం, శాంతి, సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, మానవతా విలువలను అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. పాఠశాల జనరల్ మేనేజర్ వై. నరేష్, ప్రిన్సిపాల్ టి. శ్రీనివాస్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ చి. సాయి కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ఈ వేడుకల్లో పాల్గొని విద్యార్థులకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగలు మన జీవితాల్లో ఆనందాన్ని నింపడమే కాకుండా, మన పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేస్తాయని వారు తెలిపారు. ఇలాంటి వేడుకల ద్వారా విద్యార్థుల్లో ఐక్యతా భావం, పరస్పర గౌరవం, సహకారం, సోదరభావం పెంపొందుతాయని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిలో ప్రతి పండుగ వెనుక ఒక గొప్ప సందేశం, విలువైన జీవన సూత్రం దాగి ఉంటుందని, వాటిని అర్థం చేసుకొని ఆచరణలో పెట్టడం ద్వారా విద్యార్థులు మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించుకోగలరని వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు విద్యా సంస్థలు విద్యాబోధనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా తెలిపారు. శ్రీ విద్యా పాఠశాల యాజమాన్యం విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని విద్యా ప్రమాణాలతో పాటు క్రమశిక్షణ, సంస్కారం, సామాజిక స్పృహకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు, సహకరించిన సిబ్బంది, ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. చెడుపై మంచి సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి విద్యార్థి తనలోని బలహీనతలను అధిగమిస్తూ, చదువులోనూ, క్రీడల్లోనూ, ఇతర రంగాల్లోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. . విద్యార్థుల్లో ఐక్యత, స్నేహభావం, పరస్పర సహకారం, నైతిక విలువలను పెంపొందిస్తూ, భారతీయ సంస్కృతి మరియు సంప్రదాయాలను

భావితరాలకు అందించే దిశగా శ్రీ విద్యా పాఠశాల, భద్రాచలం నిరంతరం కృషి చేస్తోందన్నారు. విజయదశమి పండుగ ప్రతి విద్యార్థి జీవితంలో కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలు, విజయాలకు నాంది కావాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

## పదవులకోసం కాదు పనిచేసే వారికే ఓటు వేయండి

**మరోసారి ఎమ్మెల్సీ బరిలో అశోక్ సార్**

**గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫలితాలు తారుమారు చేసిన పాలకూరి అశోక్**

**ఖమ్మం వుదయం బ్యూరోఅక్టోబర్ 9:**




పదవులకోసం కాదు పనిచేసే వారికే ఓటు వేయాలని,ఈసారి ఎన్నికల్లో విజయం నాదేనని వరంగల్‌ఖమ్మంనల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్ సార్ అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొంతమంది రాత్రికి రాత్రే ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పుట్టుక వస్తున్నారని, అటువంటి తగిన గుణపాఠం చెప్పాలని, నిత్యం జనం కోసం పనిచేసే వారికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత 12 సంవత్సరాలుగా నిరుద్యోగులకు నిధులు లేవు, నియామకాలు లేవు. ఇంటికో ఉద్యోగం లేదు, ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు లేవు. ఊక దంపుడు ఉపన్యాసాలు, 420 హామీలు తప్ప నిరుద్యోగులకు మిగిలింది శూన్యం అని అన్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో నాన్ లోకల్ కబ్జా అత్తెసరు ప్రభుత్వ ఉద్యోగాలు తెలంగాణలో నిరుద్యోగ భారతం. ప్రమాదపుటంచున ప్రభుత్వ విద్య నెలకొని ఉందని అన్నారు.గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 వేల మొదటి ప్రాధాన్యత ఓటు 90 వేల రెండో ప్రాధాన్యత ఓటు సాధించి బిఆర్ఎస్ ఓడిపోవడానికి తానే కారణమయ్యానని, ప్రధాన పార్టీలకు ముచ్చమటలు పట్టించానని అన్నారు. 90శాతం పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలను కాదని కాంగ్రెస్ పార్టీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించి తెలంగాణ పిసిసి రెడ్డి కాంగ్రెస్ గా మారిందని అన్నారు. బిఆర్ఎస్ సైతం ఓసీలకే టికెట్లు కేటాయించడానికి ప్రయత్నం చేస్తుందని అదే జరిగితే ఆ రెండు పార్టీలను, బీసీలు 100 శాతం బొంద పెట్టడం ఖాయమని అన్నారు. ఓట్లు మావి సీట్లు మీవా అని ప్రశ్నించారు. రెండు పార్టీలు హైబ్రిడ్ మొక్కలను తెర మీదకి తెస్తున్నాయన్నారు, . కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో 42 శాతం స్థానాలు బీసీలకు కేటాయిస్తామని హామీ ఇచ్చి అసెంబ్లీలో కోర్టుల్లో నాటకలాడి బీసీలను నిండా ముంచిందని, ఆరోపించారు. 10 శాతం కూడా లేని ఓసీలు 70 శాతం అసెంబ్లీని కబ్జా పెట్టారని అన్నారు. ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కేవలం 13 వేల ఉద్యోగాలు ఇచ్చి 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధాలు చెబుతుందని, నిరుద్యోగులను నిండా ముంచిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఉద్యోగాల ప్రకటన ఇచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. పవర్ సెక్టార్ లో 5300 ఉద్యోగాలతో ఆర్థిక శాఖ ఆమోదం పొందిన ఇంతవరకు నోటిఫికేషన్ ఇవ్వలేదని అన్నారు. 25 వేల ఉద్యోగాలతో మెగా డిఎస్సిని ఉద్యోగ క్యాలెండర్లో ప్రకటించినా ఇప్పటివరకు దిక్కు లేదన్నారు. సర్కారు బడిని బాగు చేస్తామని రేవంత్ రెడ్డి ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఏమీ లేదన్నారు.

ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.వి గౌడ్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర నాయకులు బానోతు భద్రు నాయక్ , నాగరాజు, జి. వెంకటనారాయణ, ప్రణీత్, కృష్ణ,బి రమేష్,డి ఉదయ్ సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 'లో యశికకు చోటు

**హన్మకొండ చిన్నారి అరుదైన రికార్డు**

**ఒక్క నిమిషంలో 110 మానవ శరీర భాగాల పేర్లు చెప్పిన**

**ప్రోగ్రెస్ స్కూల్ విద్యార్థిని**

**హనుమకొండ, అక్టోబర్ 09 (వుదయం ప్రతినిధి) :**




హన్మకొండలోని ప్రోగ్రెస్ హైస్కూల్‌కు చెందిన 8 సంవత్సరాల విద్యార్థిని బోయిని యశిక అసాధారణ జ్ఞాపకశక్తితో జాతీయ స్థాయిలో సత్తా చాటింది. కేవలం 8 సంవత్సరాల 4 నెలల 15 రోజుల వయసులోనే

మానవ శరీరంలోని 9 ప్రధాన వ్యవస్థలకు సంబంధించిన 110 భాగాల పేర్లను ఒక్క నిమిషంలో చెప్పి 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్-2026'లో స్థానం సంపాదించింది.

ఈ సందర్భంగా ప్రోగ్రెస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో యశికను పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ మల్లాది ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హన్మకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నేరెళ్ల వెంకట హైమ పూజిత, కాకతీయ విశ్వవిద్యాలయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ కె. అనితారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రెక్టర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రత్యేక ఆహ్వానితుడిగా పాల్గొని చిన్నారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.... "ఇంత చిన్న వయసులోనే యశిక జాతీయ స్థాయి రికార్డు సాధించడం ఎంతో అభినందనీయం. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి విజయాలు ఎంతో స్ఫూర్తినిస్తాయి" అని పేర్కొన్నారు. యశిక సాధించిన ఈ విజయం పాఠశాలకు, తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణమని, చిన్నారి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు.

## శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**హనుమకొండ సిటీ, అక్టోబర్ 09 (వుదయం ప్రతినిధి) :**



స్థానిక పద్మాక్షి కొండపై వేంచేసియున్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవస్థాన శరన్నవరాత్రి మహోత్సవాల శుభ ఆహ్వాన పత్రికను శుక్రవారం బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేవాలయ ప్రతినిధులు ఆవిష్కరించారు.ఈ నెల 11వ తేదీ (ఆదివారం) నుండి 22వ తేదీ (గురువారం) వరకు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 9:00 గంటలకు హనుమకొండ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి నీలిమ దంపతులు, 'కుడా' చైర్‌పర్సన్ గుండు సుధారాణి ప్రభాకర్ మరియు ఆలయ కమిటీ సభ్యులచే జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు సుప్రభాతం, అభిషేకాలు, చండీ సప్తశతి హవనం, నవగ్రహ రుద్ర హవనం, సాయంత్రం లలితా సహస్రనామ పారాయణ, చతుర్వేద స్వస్తి, హారతి మరియు మంత్రపుష్పం వంటి ధార్మిక కార్యక్రమాలు జరుగుతాయి.అమ్మవారి అలంకారాల వివరాలు ఇలా ఉన్నాయి. 1వ రోజు శైలపుత్రి, 2వ రోజు బ్రహ్మచారిణి, 3వ రోజు చంద్రఘంట, 4వ రోజు కూష్మాండ, 5వ రోజు స్కందమాత (ఉపాంగ లలితా వ్రతం, లక్ష పుష్పార్చన),6వ రోజు కాత్యాయని,7వ రోజు కాళరాత్రి, 8వ రోజు మహాగౌరి (దుర్గాష్టమి, సద్దుల బతుకమ్మ రాత్రి 12:00 గంటలకు కాలరాత్రి హవనం), 9వ రోజు సిద్ధిదాత్రి (మహార్నవమి, సుహాసిని పూజ, మహా పూర్ణాహుతి, రుత్విక్ సన్మానం),10వ రోజు: అపరాజితా దేవి (విజయదశమి / దసరా, ఆయుధపూజ), ప్రత్యేక ఉత్సవాలు,

ఈ నెల 21 (బుధవారం) సాయంత్రం 6:00 గంటలకు మహా స్నపనం, ఉత్సవమూర్తి రథోత్సవం (ఊరేగింపు). ఈ నెల 22 (గురువారం) ఉదయం 10:30 గంటలకు శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవి శాంతి కల్యాణోత్సవం, సాయంత్రం పద్మాక్షి తటాకంలో ఘనంగా తెప్పోత్సవం.ఈ ఉత్సవాలన్నీ బ్రహ్మశ్రీ నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని గారి పర్యవేక్షణలో జరగనున్నాయి. ఈ విలేకరుల సమావేశంలో నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని, ఆలయ అభివృద్ధి కార్యకర్తలు నీలారపు రాజ్‌కుమార్, మునుగోటి రమేష్, ప్రచార కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, గోవర్ధన వెంకటరమణాచారి తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంతో పారదర్శకత ప్రజా భాగస్వామ్యంతో సుపరిపాలన



**సమాచార హక్కుపై ప్రజల్లో అవగాహన పెంచాలి.**

**చట్టం అమలులో అధికారులు బాధ్యతగా పనిచేయాలి.**

**జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్**

**మహబూబాబాద్,అక్టోబర్.9 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

సమాచార హక్కు చట్టంతో పాలనలో పారదర్శకత పెరుగుతుందని, ప్రజా భాగస్వామ్యంతో సుపరిపాలన సాధ్యమవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్* అన్నారు. సమాచార హక్కు వారోత్సవాలు-2026లో భాగంగా శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం-2005 జిల్లా స్థాయి వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ సమాచార కమిషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొన్న సమాచార హక్కు వారోత్సవాలు-2026 రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ప్రధాన సమావేశ మందిరం నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, డి.ఆర్.ఓ నాగలక్ష్మి , అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టాన్ని గౌరవిస్తూ, పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో అందిస్తామని, విధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలని సూచించారు. అక్టోబర్ 5 నుంచి 12 వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారాన్ని కోరే విధానాన్ని ప్రజలకు వివరించాలని, ప్రజాప్రతినిధులు, పౌరులు, పౌరసమాజ సంస్థల భాగస్వామ్యంతో కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు.ప్రజలు కోరిన సమాచారాన్ని సకాలంలో అందించాలని, సెక్షన్ 4(1) (బి) ప్రకారం స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. నోటీసులను స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉంచడం ద్వారా పాలనపై విశ్వాసం పెరుగుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం (RTI Act, 2005) లోని సెక్షన్ 4(1) ప్రకారం సమాచారాన్ని స్వచ్ఛందంగా తెలిపినందుకు గాను గవర్నర్ గారి చేతుల మీదుగా మహబూబాబాద్ మునిసిపల్ కమీషనర్ బి.వినోద్ కుమార్ ప్రశంసా పత్రం మరియు అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ ఓ పవన్ కుమార్, జిల్లా అధికారులు, పిఐఓ లు, అసిస్టెంట్ పిఐఓలు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్ |ఆదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## వృద్ధుల హక్కులకు రక్షణ.. సంరక్షణ చట్టం పక్కాగా అమలు- కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 09 (ఉదయం ప్రతినిధి):**

వయోవృద్ధులు, తల్లిదండ్రుల సంరక్షణకు సంబంధించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. వృద్ధులు తమ జీవితకాల కష్టార్జితంతో సంపాదించిన ఆస్తులను పిల్లలకు బదిలీ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యతను విస్మరిస్తే ఆస్తిని తిరిగి పొందేలా నిబంధనలు పెట్టుకోవాలని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులను సన్మానించి, వారి సంక్షేమానికి అమలవుతున్న చట్టాలు, పథకాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధుల నుంచి నేటి తరం గౌరవం, మర్యాద, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు జీవితానుభవాలను నేర్చుకోవాలని సూచించారు. మనుమలు, మనుమరాళ్లకు నీతి కథలు చెప్పడంతోపాటు మంచి అలవాట్లు నేర్పించాలని కోరారు.

వృద్ధ మహిళలు సంఘటితంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లాలో 469 వృద్ధ మహిళా సంఘాలు ఏర్పాటైనట్లు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉన్న డే కేర్ సెంటర్ సేవలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాజ సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వృద్ధులు తమకు ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులను పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. బాధిత వృద్ధులకు పోలీసులు అందుబాటులో ఉంటారని, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తారని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి వృద్ధుల సంరక్షణకు సంబంధించిన చట్టాలు, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, డీఆర్డీవో లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సౌమ్య, వృద్ధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల అభివృద్ధి సంక్షేమమే తన ప్రధాన లక్ష్యం

**జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే స్థాయి తగ్గించుకొని మాట్లాడుతున్న సీనియర్ నాయకులు**

**ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య**



**జగిత్యాల అక్టోబర్ 09 (ఉదయం ప్రతినిధి)**

జగిత్యాల పట్టణ అభివృద్ధి సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుంటే అది చూసి ఓర్వలేని సీనియర్ నాయకులు స్థాయి తగ్గించుకొని మాట్లాడుతున్నారనని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల పట్టణంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలని భూమిపూజ చేసిన సీనియర్ నాయకులు దానికి రహదారి లేదు పేపర్ కూడా లేకపోవడం విడ్డూరంగా ఉందని కాలని లో డ్రైనేజీ వెళ్ళే పరిస్థితి లేదన్నారు నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలని స్థల సేకరణ ఒక స్కాం అని స్థలం నిరుపయోగంగా మారిందని మాజీ ఎంపీ కవిత సహకారంతో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కు భూమిపూజ చేయటం జరిగిందని జీవన్ రెడ్డి రెచ్చగొట్టే మాటలతో జగిత్యాల అభివృద్ధి పనులకు అడ్డం పడుతున్నారన్నారు. కేంద్రం జిఎస్ టి పెంచడం వల్ల 8 కోట్ల అదనంగా మెడికల్ కాలేజీ పనుల పై భారం పడిందన్నారు జీవన్ రెడ్డి ఎమ్మెల్సీ గా ఉండి ప్రభుత్వంతో ఉన్న 7 నెలల సమయంలో మెడికల్ కాలేజీ అర్బన్ హౌసింగ్ కాలని పనులు ఎందుకు పట్టించుకోలేదని ఎమ్మెల్యే సంజయ్ ప్రశ్నించారు. ప్రభుత్వంతో కలసి పని చేస్తున్న అవసరం అయితే సభ్యత్వం తీసుకుంటానని మెడికల్ కాలేజీ కి పాత బకాయిలు 40 కోట్లు మంజూరు చేయటం జరిగిందని జగిత్యాల పట్టణ నలువైపులా డబల్ రోడ్డు మంజూరు చేసి పనులు కూడా జరుగుతున్నాయని అన్నారు. సంజయ్ కుమార్ జీవితం జగిత్యాల ప్రజలకు తెరచిన పుస్తకం అని నాకు పేరు వస్తుందనే అనవసర ఆరోపణలు సీనియర్ నాయకులు చేస్తున్నారన్నారు. రోల్లవాగు ప్రాజెక్ట్ అటవీ అనుమతుల కారణంగా ఆలస్యం అవుతున్నాయని ముంపు కు గురవుతున్న అటవీ భూమి 827 ఎకరాలకు రెవెన్యూ భూమి ఇవ్వడం ద్వారా అటవీ అనుమతుల ప్రక్రియ ప్రారంభం అయిందని అటవీ శాఖ కు ఇంకా కొంత రెవెన్యూ భూమి కోసం సర్వే కూడా అవుతుందని మెడికల్ కాలేజీ పనులు కొంత అలస్యం అయ్యాయని వైద్య విద్యార్థులు వారి ఆవేదన నిరసన తెలిపారని నేను కలెక్టర్ వెళ్ళి మాట్లాడగా వారు మాకు సన్మానం చేశారు త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేపడతామన్నారు ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వేజ్ నాన్ వెజ్ మార్కెట్ త్వరలోనే ప్రారంభిస్తామన్నారు అభివృద్ధికి అడ్డంపడాలని అజెండాగా సీనియర్ నాయకులు పెట్టుకొని విమర్శలు చేస్తున్నారన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ గిరి నాగభూషణం బండ శంకర్ కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుసరి అనిల్ సభ్యులు కత్రోజ్ గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం రాజేష్ కాంగ్రెస్ సేవాదళ్ స్టేట్ సెక్రటరీ ముకేష్ ఖన్నా టౌన్ యూత్ అధ్యక్షులు దయల శరత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్



**జగిత్యాల అక్టోబర్ 09 (ఉదయం ప్రతినిధి)**

విబిజిరాంజీ కింద జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి నిర్మాణ పనులు (గ్రామ పంచాయతీ భవనాలు విలేజ్ ఆర్గనైజేషన్ (విఓ) భవనాలు వంటశాలల నిర్మాణాలు పాఠశాలల మరుగుదొడ్ల) నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ భవనాలు విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు పాఠశాలల్లో వంటశాలలు మరుగుదొడ్ల నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులు ఇప్పటివరకు పూర్తయిన పనులు ఇంకా పూర్తి కావాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు ప్రజలకు విద్యార్థులకు ఉపయోగపడే ఈ నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిర్మాణాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపట్టిన పనులు ప్రజలకు త్వరగా అందుబాటులోకి వచ్చేలా చూడాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో వంటశాలలు మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే గ్రామ పంచాయతీ విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు ఈ సమావేశంలో ఈఈ పీఆర్ లక్ష్మణరావు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం

**ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణారావు**



**పెద్దపల్లి, అక్టోబర్ 09 (ఉదయం ప్రతినిధి)**

సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లిలోని డాక్టర్ విజయ ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులతో ఆయన ప్రత్యేక ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు జర్నలిస్టులు తమ చిరకాల వాంఛ అయిన ఇళ్లస్థలాలు, ఇండ్ల మంజూరు అంశంపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసి తమ సమస్యలను వివరించగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. స మాజానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలులేకుండా పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు యూనియన్లు, సంఘాలతో సంబంధం లేకుండా ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారమే ధ్యేయంగా జర్నలిస్టులంతా కలిసి ఒక ఐదుగురు సభ్యులతో కూడిన సమన్వయ కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.ఆ కమిటీ ముందుకు వస్తే అధికారులతో మాట్లాడి అవసరమైన పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. సుల్తానాబాద్,ఓదెల మండలాలతో పోలిస్తే పెద్దపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో స్థల లభ్యత కొంత క్లిష్టంగా ఉన్నప్పటికీ,అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల జాడను గుర్తించేందుకు అధికారులు అన్వేషిస్తున్నారని వివరించారు.నియోజకవర్గ పరిధి లో ఎక్కడైనా అనువైన ప్రభుత్వస్థలాలు అందుబాటులో ఉంటే, సంబంధిత సర్వే నంబర్లను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని జర్నలిస్టులకు సూచిస్తూ,అధికారులతో కలిసి సమష్టిగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఆయన పూర్తి భరోసా ఇచ్చారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు,నియోజకవర్గంలోని వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నిజ నిర్ధారణ తర్వాతే వార్తను ప్రచారం చేయాలి- కలెక్టర్



**ఆదిలాబాద్:**

మీడియా ప్రతినిధులు వార్తలను ప్రచురించే ముందు వాస్తవాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిజ నిర్ధారణ చేసిన తర్వాతే ప్రజలకు అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీసీ హాల్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల జర్నలిస్టుల శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా, డిజిటల్ మీడియా విస్తరిస్తున్న నేపథ్యంలో ఫేక్ న్యూస్, తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. ఏఐ సాంకేతికతపై అవగాహన పెంచుకుంటూ, ధ్రువీకరించని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. వార్తల్లో వేగం కంటే వాస్తవికత, విశ్వసనీయతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలును వెలుగులోకి తీసుకురావడంలో స్థానిక విలేకరుల పాత్ర కీలకమన్నారు. జర్నలిస్టులకు శిక్షణ అందించడంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి మీడియా అకాడమీ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ రాజర్షి షాలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వేంకటేశ్వరరావు, డీపీఆర్వో విష్ణు వర్ధన్, రచన కళాశాల ప్రిన్సిపాల్ ఉమ మహేశ్వర్ రావు, మీడియా అసోసియేషన్ ప్రతినిధులు రాజేశ్వర్, దేవేందర్, బేత రమేష్, వినోద్, సురేష్, పీ. గజానన్, ఆకుల కార్తిక్, షాహిద్, వెంకట్, కిరణ్ తదితరులతో పాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మేధో వైకల్య విద్యార్థుల హక్కులకు భరోసా:సీనియర్ సివిల్ న్యాయమూర్తి యశ్వంత్ సింగ్




**కరీంనగర్ అక్టోబర్ 09, (ఉదయం ప్రతినిధి):**

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ యస్. శివకుమార్ అనుమతితో కరీంనగర్‌లోని మనోవికాస్ కేంద్రంలో శుక్రవారం రోజున ముందస్తు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీ యశ్వంత్ సింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వైద్య పరీక్షలు, తల్లిదండ్రులకు న్యాయ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీ యశ్వంత్ సింగ్ మాట్లాడుతూ మేధో వైకల్యం కలిగిన విద్యార్థుల హక్కులు, సంక్షేమం, భవిష్యత్తు కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని అన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్య, శిక్షణ, సంరక్షణ అందించేందుకు పెమన్ క్యాంపు సంస్థ ద్వారా మనోవికాస్ కేంద్రంలో అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మేధో వైకల్యం ఉన్నంత మాత్రాన ప్రతిభకు పరిమితులు ఉండవని అన్నారు. సరైన విద్య, శిక్షణ, కుటుంబ ప్రోత్సాహం, సమాజ సహకారం అందితే వారు కూడా విద్య, ఉద్యోగాలు, క్రీడలు, కళలు తదితర రంగాల్లో ఉన్నత విజయాలు సాధించగలరని అన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. వైకల్యం ఒక అడ్డంకి కాదని, సరైన అవకాశం లభిస్తే అది విజయానికి మార్గం అని యశ్వంత్ సింగ్ తెలిపారు. పిల్లల పట్ల జాలి కంటే గౌరవం, సమానత్వం, ప్రోత్సాహం ఎంతో అవసరమని అన్నారు. వైద్య శిబిరంలో విద్యార్థులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు సూచనలు అందించారు. అనంతరం నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల చట్టం-2016, విద్యా హక్కులు, సమానత్వం, వివక్షకు వ్యతిరేకంగా చట్టపరమైన రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత న్యాయ సహాయం వంటి అంశాలపై సంస్థ సభ్యులు, న్యాయవాదులు అవగాహన కల్పించారు. మేధో వైకల్యం కలిగిన విద్యార్థుల హక్కుల పరిరక్షణ, గౌరవప్రదమైన జీవనం, సాధికారత కోసం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ తన వంతు సహకారం అందిస్తుందని శ్రీ యశ్వంత్ సింగ్ స్పష్టం చేశారు. మనోవికాస్ వ్యవస్థాపకులు కే.బాలకిషన్ రావు మరణానికి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు ఏ. కిరణ్ కుమార్, సీహెచ్. చంద్ర ప్రకాష్ రెడ్డి, పి. రంగయ్య, బి. సమతా రాణి, కే. మౌనిక, వైద్యులు యం. భరత్ రాజ్, మహమ్మద్ హారిస్, వేణు మాధవ్, యం. సహనా రెడ్డి, మనోవికాస్ సంస్థ బాధ్యులు ప్రిన్సిపల్ డి. ఉమారాణి, కోశాధికారి బి. పరమేశ్వర్, ఉపాధ్యక్షులు సిహెచ్. రామారావు, ఈసీ సభ్యులు యండి. అబ్దుల్ కరీమ్, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ గాలిపెల్లి నాగేశ్వర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం..

**కరీంనగర్ బస్టాండ్‌లో ఘటన**

**వృద్ధుడి కాలిపై నుంచి వెళ్లిన బస్సు చక్రాలు**

**108 వాహనంలో ఆసుపత్రికి తరలింపు**




**కరీంనగర్, అక్టోబర్09 (ఉదయం ప్రతినిధి):**

కరీంనగర్ బస్టాండ్‌లో చోటు చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం ఒక వృద్ధుడి ప్రాణాల మీదికి తెచ్చింది. బస్సు డ్రైవర్ అజాగ్రత్త కారణంగా వృద్ధుడి కాలిపై నుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. బాధిత కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా, ఎల్కతుర్తి మండలం, దండేపల్లి గ్రామానికి చెందిన కనకయ్య (65) తన భార్యతో కలిసి వ్యక్తిగత పని నిమిత్తం కరీంనగర్ బస్టాండ్‌కు వచ్చారు. బస్టాండ్ పరిసరాల్లో ప్రయాణికులు నడుచుకుంటు వస్తున్న సమయంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ శ్రీనివాస్, హుజురాబాద్ డిపో, బస్సు నెంబర్ టీఎస్02యుసి 5942 బస్సును తీవ్ర నిర్లక్ష్యంగా, ఎలాంటి అప్రమత్తత లేకుండా బస్సును ముందుకు పోనిచ్చాడు. ఈ అనూహ్య పరిణామానికి వృద్ధుడు కనకయ్య తేరుకునేలో పే, బస్సు చక్రాలు ఆయన కాళ్లపై నుంచి వెళ్లాయి. ఈ ప్రమాదంలో కనకయ్య తీవ్రంగా గాయపడి విలవిలలాడారు. ఆయన భార్య రోదనలు చూసి చుట్టుపక్కల ఉన్న ప్రయాణికులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యా రు. డ్రైవర్ నిర్లక్ష్య వైఖరిపై ప్రయా ణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడు కనకయ్యను అత్యవసర చికిత్స నిమిత్తం సమీపం లోని ఆసుప త్రికి తరలించారు. ప్రస్తు తం ఆయనకు వైద్యులు చికిత్స అంది స్తున్నారు. బస్టాండ్‌లలో డ్రైవర్ల బాధ్య తారహిత్య ధోరణి పై ప్రయాణికులు మండిపడుతు న్నారు.

## మందమర్రి సింగరేణి జీఎం కార్యాలయంలో ఈ-వేస్ట్ డిస్పోజల్ కార్యక్రమం..



**మంచిర్యాల /మందమర్రి / అక్టోబర్ 09 (ఉదయం ప్రతినిధి)**

సింగరేణి సంస్థవ్యాప్తంగా అక్టోబర్ 2 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఈ-వేస్ట్ సేకరణ, డిస్పోజల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని, నిరుపయోగ ఎలక్ట్రానిక్ పరికరాలను ప్రత్యేక సేకరణ డబ్బాలో వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, వైర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా శాస్త్రీయ పద్ధతిలో తొలగించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యాలయాలు, గనులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఈ-వేస్ట్ వల్ల కలిగే కాలుష్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం జి.ఎల్. ప్రసాద్, డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, ఏరియా ఈ అండ్ ఎం ఏజీఎం బాలాజీ భగవతీ జా, ఏజీఎం (ఎఫ్ అండ్ ఏ) ఆర్.వి.ఎస్.ఆర్.కే. ప్రసాద్, డీజీఎం (సర్వే) బుఖ్యా దేశాయి, ఐటీ డిప్యూటీ మేనేజర్ రవి, పర్చేస్ అధికారి బాబు, ఏరియా అటవీ శాఖ అధికారి నవీన్ తదితరులు, జీఎం కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలలో విద్యార్థులకు మెరుగైన వైద్య విద్యను అందించాలి: కలెక్టర్



**నిర్మల్ జిల్లా (ఉదయం ప్రతినిధి)9 అక్టోబర్ 2026**

ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పన, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులకు అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చినప్పుడే వారి సామర్థ్యాలు పెరుగుతాయని, అలాగే వారు మంచి వైద్యులుగా తీర్చిదిద్దబడతారని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. వైద్య కళాశాలలోని విద్యార్థుల సంఖ్య, వారి విద్యా సంబంధిత విషయాలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు.

## హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువతలో అవగాహన పెంపునకు బైక్ ర్యాలీ

**హెచ్ఐవీ నివారణకు అవగాహనే ప్రధాన ఆయుధం**

**అదనపు కలెక్టర్ విక్టర్**



**కామారెడ్డి, అక్టోబర్ 9 (ఉదయం ప్రతినిధి):**

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువతలో విస్తృత అవగాహన కల్పించి, వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు శుక్రవారం కామారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి నిర్వహించిన హెచ్ఐవీ, ఎయిడ్స్ అవగాహన బైక్ ర్యాలీని అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్. వై గిరితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా యువతకు సరైన అవగాహన ఉండాలని అన్నారు. వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించి, నివారణ మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతలో చైతన్యం పెంపొందించాలని సూచించారు. హెచ్ఐవీ నివారణకు వైద్యారోగ్య శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ బైక్ ర్యాలీ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ప్రారంభమై నూతన బస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రైల్వే స్టేషన్, సిరిసిల్ల రోడ్డు మీదుగా రామారెడ్డి చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం తిరిగి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం వద్ద ముగిసింది. ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వై.ఎన్. గిరి మాట్లాడుతూ, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. వ్యాధి పట్ల వివక్ష చూపకుండా, బాధితులకు గౌరవం, సహకారం అందించాలని సూచించారు. నివారణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, యువత ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.హెచ్ఐవీ రహిత జిల్లాగా కామారెడ్డిని తీర్చిదిద్దేందుకు కృషి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జె. వెంకటి మాట్లాడుతూ, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో హెచ్ఐవీ నివారణ, అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యారోగ్య శాఖ ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు.ఇప్పటికే జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై మరింత చైతన్యం కల్పించేందుకు రానున్న రోజుల్లోనూ విస్తృతంగా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. హెచ్ఐవీ నివారణపై సరైన అవగాహన కల్పిస్తూ, కామారెడ్డిని హెచ్ఐవీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, డాక్టర్ వెంకట్ స్వామి, డాక్టర్ రోహిత్, డాక్టర్ సాయి ఈశ్వరి, డాక్టర్ స్నేహ, డాక్టర్ అంచల్, జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి సుధాకర్, ఉప జిల్లా విస్తరణ, మాధ్యమ అధికారి వేణుగోపాల్, ఓఎస్‌డీ చలపతి, ఈసీ స్వామి, రమేష్, కార్యాలయ పర్యవేక్షకుడు అమ్రీష్, కార్యాలయ సిబ్బంది, హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది, రాజీవ్‌నగర్, ఇస్లాంపురా సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## జిల్లా ఎస్పీని కలిసిన వారియర్స్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 9(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌ని వారియర్స్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ లయన్ డాక్టర్ శాంత ఆంజనేయులు ఆర్మీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీతో ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ద్వారా పేద,ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు పోలీస్ కానిస్టేబుల్, ఎస్ ఎస్ జి డి, అగ్నివీర్ ఆర్మీ తదితర ఉద్యోగాల కోసం ఉచిత కోచింగ్ అందిస్తున్న విషయాన్ని ఎస్పీ కి వివరించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సరైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించి,వారు దేశానికి సేవ చేసే అవకాశాలను సాధించేలా అకాడమీ చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి చర్చించినట్లు ఆయన తెలిపారు. వారియర్స్ డిఫెన్స్ అకాడమీ గురించి తెలుసుకొని, విలువైన సమయాన్ని కేటాయించి, మా సేవా కార్యక్రమాల గురించి చర్చించడానికి అవకాశం కల్పించిన నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కి వారియర్స్ డిఫెన్స్ అకాడమీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. మీ లక్ష్యం - పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించడం... యువతలో క్రమశిక్షణ, పట్టుదల పెంపొందించడం... దేశ సేవకు అర్హులైన యువతను తీర్చిదిద్దడం కోసం చేస్తున్న సేవలను ఎస్పీ డాక్టర్ వినీత్ కొనియాడుతూ వారిని అభినందించారు.

## సెయింట్ ఆంథోనీస్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

**సంగారెడ్డి వుదయం :**



సెయింట్ ఆంథోనీస్ డిగ్రీ కళాశాల ఫర్ ఉమెన్, సంగారెడ్డిలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మ సంబరాలను విద్యార్థినులు, అధ్యాపకులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కళాశాల ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకున్నారు.ఈ వేడుకల్లో కళాశాలలోని వివిధ సంవత్సరాలకు చెందిన విద్యార్థినులు తమ తమ గ్రూపులుగా ఏర్పడి, రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను రూపొందించారు.ప్రకృతి అందాలను ప్రతిబింబించే విధంగా వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ చేరి చప్పట్లతో, ఉత్సాహభరితమైన ఆటపాటలతో వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, సమూహ నృత్యాలతో కళాశాల ప్రాంగణమంతా పండుగ శోభ సంతరించుకుంది.ఈ కార్యక్రమానికి కళాశాల యాజమాన్యం, డైరెక్టర్, అకడమిక్ కౌన్సిలర్, ప్రిన్సిపాల్ హాజరై విద్యార్థినులను ప్రోత్సహించారు. పండుగల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ఎంతో ముఖ్యమని వారు పేర్కొన్నారు. విద్యార్థినులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనడం అభినందనీయమని తెలిపారు.బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, పూల వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది. నవరాత్రి వేళ నిర్వహించే ఈ పండుగ ఆధ్యాత్మిక విశ్వాసాన్ని, ఐక్యతను, సామూహిక ఆనందాన్ని ప్రతిబింబిస్తుంది. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి పట్ల గౌరవం వంటి విలువలను కూడా ఈ పండుగ చాటిచెబుతుంది.ఈ వేడుకలతో విద్యార్థినుల్లో తెలంగాణ సంస్కృతిపై అవగాహన పెరగడంతో పాటు, ఐకమత్యం, సాంస్కృతిక చైతన్యం మరింత బలపడింది. కళాశాల ప్రాంగణం బతుకమ్మ సంబరాలతో సందడిగా మారింది.

## గద్వాలలో ధరల మంట
## అధికారుల నిఘా ఏది?



- **కరువు భయంతో నిత్యావసరాల ధరల బాదుడు.. రూ.1,800కు 24 కిలోల సన్నబియ్యం ప్యాకెట్? దుకాణాలు, గోదాములపై తనిఖీలకు ప్రజల డిమాండ్**

**గద్వాల, అక్టోబర్ 09 (వుదయం బ్యూరో)**

కరువు భయాలను సామాన్యుడి జేబుకు చిల్లులు పెడుతున్నాయా? గద్వాల పట్టణంలో నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలపై వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సన్నబియ్యం 24 కిలోల ప్యాకెట్ సుమారు రూ.1,800 వరకు విక్రయిస్తున్నారని చెబుతున్నారు. బియ్యం, పప్పులు, వంట నూనెలు, జొన్నలు, రాగులు, గోధుమల ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోందని వాపోతున్నారు. కరువు అంచనాలను ఆసరాగా చేసుకొని ఎవరైనా సరుకులను అధికంగా నిల్వ ఉంచుతున్నారా? మార్కెట్లో ధరల పెరుగుదలకు కారణాలేమిటి? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. గద్వాల పట్టణంలోని హోల్‌సేల్, రిటైల్ దుకాణాలు, గోదాములపై పౌరసరఫరాలు, విజిలెన్స్, తూనికలు కొలతల శాఖ అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అధిక ధరలకు విక్రయాలు, అక్రమ నిల్వలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ధరల పెరుగుదలపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మార్కెట్‌ను సందర్శించాలి. నిత్యావసర సరుకులు అందుబాటు ధరల్లో లభించేలా చర్యలు తీసుకొని సామాన్యులకు ఉపశమనం కల్పించాలని గద్వాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సిద్దిపేట సిరిసిల్ల రైల్వే లైన్ పనులను వేగవంతం చేయాలి

- **జిల్లా కలెక్టర్ కె. హైమావతి**

**సిద్దిపేట, అక్టోబర్ 9 (వుదయం బ్యూరో)**



సిద్దిపేట నుండి సిరిసిల్ల వరకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైల్వే లైన్ పనులను వేగవంతం చేసేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎన్. నవ్య శ్రీ (IRSE)తో కలిసి రైల్వే, రెవెన్యూ, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నకోడూరు మండలం మాచాపూర్, గంగాపూర్, విఠలాపూర్, నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ మరియు బ్రిడ్జిల నిర్మాణ సమస్యలపై క్షుణ్ణంగా చర్చించారు. పెండింగ్ ప్రాంతాలను అన్ని శాఖల అధికారులు కలిసి జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నివేదిక ఇవ్వాలని, బ్రిడ్జిలు నిర్మించే ప్రదేశాల్లో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా డైవర్షన్ బీటీ రోడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పనుల వల్ల స్థానిక రైతులకు,ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బ్రిడ్జి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని, పనులు పూర్తయ్యే వరకు స్థానిక శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో సదానందం, రైల్వేస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మూర్తి, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో చేనేత కార్మికులను ఆదుకునేందుకు
## అన్ని విధాలుగా సహకరిస్తాం



- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**
- **అమరచింతలోని హ్యాండ్లూమ్ వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ సందర్శించి చేనేత మగ్గంపై స్వయంగా చీర నేసిన జిల్లా కలెక్టర్**

**వనపర్తి అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో చేనేత రంగ అభివృద్ధికి, చేనేత కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలుగా సహకరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.శుక్రవారం అమరచింత మండల పరిధిలోని చేనేత హ్యాండ్లూమ్ వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ చీరలు తయారు చేసే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం మగ్గంపై కూర్చొని చీర నేసే విధానాన్ని ప్రయత్నించి చూశారు. అక్కడి చేనేత కార్మికులతో మాట్లాడి చీరల తయారీ ప్రక్రియ, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాల గురించి తెలుసుకున్నారు. అమరచింత చీరల ప్రత్యేకతను, చేనేత రంగానికి సంబంధించిన ఇతర వివరాలను పరిశ్రమల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా చేనేత కార్మికులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చేనేత కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణాలు పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించి, సులభంగా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, చేనేత యూనిట్‌లో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందించేలా కృషి చేస్తామని తెలిపారు. చేనేత కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణాలు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేస్తామని పేర్కొన్నారు. అమరచింత చేనేత ప్రొడ్యూసర్ కంపెనీ యూనిట్‌లో ఎండ వేడిమి నుంచి కార్మికులకు ఉపశమనం కల్పించేందుకు సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసే దిశగా అవకాశాలను పరిగణలోకి తీసుకోవాలని పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులను ఆదేశించారు. చేనేత రంగాన్ని ప్రోత్సహిస్తూ, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. చేనేత శాఖ ఏడి ఇందిర, ఇక్కడ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహాలయ అమావాస్య ప్రాముఖ్యతను వివరించిన వేద పండితులు

**వుదయం న్యూస్ శివ్వంపేట అక్టోబర్ 09....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల వేద పండితులు మహర్షి గురుదేవులు శాస్తుల వామనశర్మ మహాలయ అమావాస్య విశిష్టతను ఇలా వివరించారు.భారతీయ సనాతన సంస్కృతిలో మహాలయ అమావాస్య ఒక పరమ పవిత్రమైన జీవన వారధి. భౌతిక దేహాన్ని విడిచి వెళ్లినప్పటికీ మన గుండెల్లో సజీవంగా నిలిచే పూర్వీకులకు మనం సమర్పించే నిజమైన భక్తి నివాళి ఇది. తిల తర్పణాలు కేవలం ఆచారాలు మాత్రమే కాదు; అవి మన మూలాలను, మన మూల పురుషులను మర్చిపోకుండా గుర్తుచేసే సాంస్కృతిక సంకల్పాలు. ఈ రోజున చేసే అన్నదానం, జలదానం పితృదేవతల ఆత్మలకు శాంతిని చేకూర్చడమే కాకుండా మన జీవితాలలో పితృ దోషాలను తొలగించి సకల శుభాలను ప్రసాదిస్తాయి. మహాలయ అమావాస్య పితృ ఋణాన్ని తీర్చుకుంటూనే, జగన్మాత ఆరాధనలైన శరన్నవరాత్రుల వెలుగులను మన ఇళ్లలోకి ఆహ్వానించాలనే మహోన్నత సందేశాన్ని అందిస్తుంది. పూర్వీకుల పాదపద్మాలకు శిరస్సు వంచి నమస్కరిస్తూ ముందుకు సాగుదాం. సర్వ పితృదేవతలకు ప్రణామాలు అర్పిస్తూ, లోక సమస్తా సుఖినోభవంతు అని ప్రార్థిద్దాం అని వివరించారు.

## పిల్లలమర్రిని ఆధునిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

- **రూ.2.5 కోట్లతో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనుల పరిశీలన.. సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష**

**మహబూబ్‌నగర్**



మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన పిల్లలమర్రిని అన్ని ఆధునిక సౌకర్యాలతో ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ పిల్లలమర్రిని సందర్శించి పర్యాటక, అటవీ, మత్స్య, విద్య, పురావస్తు శాఖల ఆధ్వర్యంలో రూ.2.5 కోట్ల తో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, చేపట్టాల్సిన పనులపై పలు సూచనలు చేశారు

పర్యటనలో భాగంగా ముందుగా పర్యాటక ప్రాంతంలోని ప్రవేశ ద్వారం, టికెట్ కౌంటర్, మరుగుదొడ్లు, ప్రహరీ తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, పర్యాటక ప్రాంతం ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం సైన్స్ మ్యూజియాన్ని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియం తరహాలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. చిల్డ్రన్స్ పార్కును కూడా ఆకర్షణీయంగా, రంగురంగుల ఆట పరికరాలతో ఆధునికీకరించాలని ఆదేశించారు. పాతబడిన ఆట పరికరాలను తొలగించి, కొత్త పరికరాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన బడ్జెట్ అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పురావస్తు శాఖ ఆధ్వర్యంలోని ప్రదర్శనశాలను సందర్శించిన కలెక్టర్, ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు చారిత్రక ప్రాధాన్యత కలిగిన వస్తువులు, విగ్రహాలను పరిశీలించారు.వాటి చారిత్రక నేపథ్యం, ప్రాధాన్యత తెలిసేలా సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పాత భవనాల స్థితిగతులను పరిశీలించి, పై కప్పు పెచ్చులు ఊడుతున్న వాటిని గమనించిన కలెక్టర్ వాటిని మరమ్మతులు లేదా పునరుద్ధరణ చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. సైన్స్ మ్యూజియం పరిసరాల్లో చెత్తా చెదారం గడ్డి లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిల్లలమర్రి ప్రసిద్ధ మర్రిచెట్టు పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రాంగణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పచ్చదనం పెంపొందించేలా ల్యాండ్‌స్కేపింగ్ చేపట్టాలని సూచించారు. సందర్శకులకు తాగునీరు, చెత్తబుట్టలు వంటి సదుపాయాలు కల్పించాలని, గడ్డి, మొక్కలు పచ్చగా ఉండేలా క్రమం తప్పకుండా నీటిని అందించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. కేఫ్‌టేరియా ప్రాంతంలోనూ సందర్శకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జింకల పార్కును సందర్శించిన కలెక్టర్ అక్కడ ఉన్న జింకల సంఖ్య, వాటికి అందిస్తున్న ఆహారం, తాగునీరు, సంరక్షణ చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 85 జింకలు ఉన్నట్లు అధికారులు వివరించారు. జింకల సంరక్షణ, వాటి ప్రాధాన్యతపై అటవీశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

మత్స్యశాఖ ఆధ్వర్యంలోని ఆక్వేరియాన్ని పరిశీలించిన కలెక్టర్, సుమారు 27 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాన్ని ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ, సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల సమన్వయంతో సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టాలని, ఆధునిక ఆక్వేరియంలు, 3డీ గ్రాఫిక్స్, ఆకర్షణీయమైన పెయింటింగ్స్‌తో పాటు సందర్శకులను ఆకట్టుకునేలా ప్రదర్శనలను అభివృద్ధి చేయాలని తెలిపారు. ఈ పనులకు అవసరమైన నిధుల కోసం మత్స్యశాఖ కమిషనర్ ద్వారా ప్రతిపాదనలు సమర్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆక్వేరియం, జంతు ప్రదర్శన ప్రాంతాల్లో వివిధ రకాల జలచరాలు, పాములు, ఇతర జీవుల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించేలా సమాచార సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాటి జీవన విధానం, ప్రత్యేకతలు, పర్యావరణంలో వాటి పాత్రను వివరించే సమాచారాన్ని స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

పిల్లలమర్రిలోని అన్ని పర్యాటక ఆకర్షణలను సమగ్రంగా అభివృద్ధి చేసి, సందర్శకులకు మెరుగైన అనుభూతి కలిగించేలా శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. అవసరమైన పనులకు సంబంధించి అంచనాలు, బడ్జెట్ ప్రతిపాదనలు, కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, డి.ఆర్.ఓ ఎ. నిర్మల, డి.ఎఫ్.ఓ ఎం.నవీన్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి జె.రాజశేఖర్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి రాధా రోహిణి, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి, విద్యాశాఖ నుండి ఎ.ఎం.ఓ డి.శ్రీనివాస్, అటవీశాఖ అధికారులు, పర్యాటక శాఖ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



- **ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి పాటిల్**

**నాగర్ కర్నూల్, అక్టోబరు 9 (వుదయం ప్రతినిధి):**

డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి.పాటిల్ సూచించారు.

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో అక్టోబర్ నెలను సైబర్ అవగాహన నెలగా నిర్వహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్ ను ఎస్పీ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆగండి, ఆలోచించండి, అడుగు వేయండి అనే మూడంచెల సూత్రాన్ని పాటించాలన్నారు. ఇంటి వద్ద నుంచే సులభంగా డబ్బు సంపాదించవచ్చని, రేటింగ్స్ ఇస్తే పార్ట్ టైమ్ ఉద్యోగాలు ఇస్తామంటూ వచ్చే వాట్సాప్, టెలిగ్రామ్ మెసేజ్ లను నమ్మవద్దని హెచ్చరించారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలంటూ వచ్చే నకిలీ ట్రేడింగ్ యాప్ లు, క్రిప్టో కరెన్సీ స్కీమ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, బ్యాంక్ వివరాలు, ఓటీపీ, వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని కోరారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్ నంబర్ కు లేదా http://cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని సూచించారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్ ఎస్ఐ గిరి మనోహర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై శ్రీనివాస్, సైబర్ క్రైమ్ టీం సభ్యులు తేజశ్రీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై
## ప్రత్యేక శ్రద్ధ వహించాలి — జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి)**



వసతి గృహాల్లో విద్యార్థినుల ఆరోగ్యం, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

పెబ్బేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని బీసీ బాలికల వసతి గృహంలో బుధవారం రాత్రి విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం వసతి గృహాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, తాగునీరు, వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలపై సంబంధిత అధికారులు, విద్యార్థినులను విచారించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారులు స్పందిస్తూ మొత్తం 22 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు, వారందరినీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, వసతి గృహంలో బుధవారం రాత్రి చికెన్ తో భోజనం చేసిన అనంతరం కొందరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. ఈ ఘటనకు ఆహారం కలుషితం కావడం కారణమై ఉండవచ్చని తెలిపారు. అనారోగ్యానికి గురైన విద్యార్థినులకు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.వసతి గృహంలో తాగునీటి శుద్ధి యంత్రానికి సంబంధించిన ఫిల్టర్‌ను వెంటనే మార్చించాలని, పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రతను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థినులకు భోజనం వడ్డించే ముందు సంబంధిత అధికారులు తప్పనిసరిగా ఆహారాన్ని రుచి చూసి, నాణ్యతపై పూర్తి నమ్మకం కలిగిన తర్వాతే వడ్డించాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహాల్లో విద్యార్థినుల ఆరోగ్యం, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు సురక్షితమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.బీసీ సంక్షేమ శాఖ అధికారిని ప్రమీల, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఎన్‌హెచ్-65 విస్తరణ పనులు వేగవంతం చేయాలి



- **ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలి: ఎస్పీ పరితోష్ పంకజ్**

**సంగారెడ్డి వుదయం :**

సంగారెడ్డి చౌరస్తా నుంచి మదీనగూడ వరకు జాతీయ రహదారి 65పై కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ పరిశీలించారు. పనుల పురోగతిపై ఆర్అండ్‌బీ ఇంజినీర్లు, సంబంధిత కాంట్రాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో జరుగుతున్న జాప్యానికి గల కారణాలను తెలుసుకున్న ఎస్పీ.. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పనుల ఆలస్యం కారణంగా ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**

రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయడంతో పాటు సూచిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా, సురక్షిత ప్రయాణానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో జిన్నారం డీఎస్పీ ప్రభాకర్, ఇస్నాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ రావు, ఆర్అండ్‌బీ ఇంజినీర్లు, సంబంధిత కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## సింగాటం ప్రాథమిక పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



**గజ్వేల్, అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి)**

సింగాటం ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర పండుగైన బతుకమ్మ వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ మహిళలు కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలోని వివిధ రకాల పూలను సేకరించి పాఠశాల ప్రాంగణానికి తీసుకువచ్చారు. ఉపాధ్యాయురాలు యశోద కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి మాతృమూర్తులు మరియు గ్రామ మహిళలు కలిసి అందంగా బతుకమ్మలను పేర్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో సాంప్రదాయ బతుకమ్మ పాటలతో ఆడుతూ, పాడుతూ ఉత్సాహంగా గడిపారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలోనైనా భగవంతునికి పూలతో పూజలు చేస్తారని, కానీ ఒక్క మన తెలంగాణలోనే ప్రకృతి ప్రసాదించిన పూలనే దైవంగా భావించి పూజించే గొప్ప సంస్కృతి ఉందన్నారు. ఈ పండుగ సందర్భంగా ఇంటి ఆడపడుచులంతా ఒకచోటకు చేరి తొమ్మిది రోజుల పాటు సంబరాలు జరుపుకుంటారని తెలిపారు. మన తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు సగర్వంగా అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు కుకునూరి శేఖర్, యశోద కృష్ణ, వసంత, రవీనా, గ్రామ మహిళలు నిర్మల, ప్రమీల, కవిత, బాల్ నర్సమ్మలతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదేండ్ల పండుగకు తరలిరావాలి

- **పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలి**
- **మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్..**

**హుస్నాబాద్/ వుదయం (అక్టోబర్ 09)**



హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటు, రాబోయే పార్టీ కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ మాట్లాడుతూ, సిద్దిపేట జిల్లా ఆవిర్భవించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించే "పదేండ్ల పండుగ" కార్యక్రమానికి ఈ నెల 11వ తేదీన హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట హుస్నాబాద్ పట్టణంలోని,నాయకులు కార్యకర్తలు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

అలాగే హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటించి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తానని తెలిపారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ప్రతి గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షుల ఎన్నికలు నిర్వహించడంతో పాటు, గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తానని వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తల సమక్షంలోనే గ్రామ శాఖల కమిటీల ఏర్పాటు ప్రక్రియను చేపడతానని తెలిపారు. పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తూ, గ్రామ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను చురుకుగా కొనసాగించాలని సూచించారు.ఈ సమావేశంలో హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పత్తి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిసిఐ కొనుగోళ్లు చేపట్టాలి

**జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్.**
**•కపాస్ కిసాన్' యాప్‌లో నమోదు చేసుకుని మద్దతు ధర పొందొచ్చు**
**•ఈ ఏడాది పత్తి మద్దతు ధర క్వింటాకు రూ. 8,667/-**



**మహబూబాబాద్.అక్టోబర్, 09. వుదయం జిల్లా ప్రతినిధి):** కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టే పత్తి కొనుగోళ్ల ప్రక్రియపై శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ చాంబర్ లో జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ అధ్యక్షతన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే కొనుగోలు సీజన్‌లో పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, జిన్నింగ్ మిల్లు యజమానులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. రైతులు తాము పండించిన పత్తిని దళారులకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు. ఈ సంవత్సరానికి గాను ప్రభుత్వం పత్తికి క్వింటాకు 8,667 రూపాయలుగా మద్దతు ధరను నిర్ణయించిందని తెలిపారు. పత్తి రైతులు తప్పనిసరిగా కపాస్ కిసాన్ యాప్ ద్వారా ముందస్తుగా డిజిటల్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని, తద్వారా సిసిఐ కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి రద్దీ లేకుండా మద్దతు ధర పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు మరియు జిన్నింగ్ మిల్లుల వద్ద విద్యుత్ సరఫరా, తూకాల్లో పారదర్శకత, అగ్నిప్రమాద నివారణ చర్యలు పక్కాగా ఉండాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ స్థాయిలో రైతులను చైతన్యపరిచి, కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేయించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, డిఎస్పీ తిరుపతిరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, జిల్లా రవాణాశాఖ అధికారి శంకర్, ఇతర జిల్లా అధికారులు, జిన్నింగ్ మిల్ యజమానులు, కాటన్ పర్చేస్ ఆఫీసర్లు మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ-సర్వే పారదర్శకంగా పూర్తి చేయాలి



**కామారెడ్డిపల్లిలో రీ-సర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్, ఆర్డీఓ.**

**పరకాల, అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి):** హనుమకొండ జిల్లా కామారెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి డి.ఎస్. వెంకన్న శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియ, గ్రామ సరిహద్దులు, భూములకు సంబంధించిన వివరాలు, ఇప్పటివరకు పూర్తయిన సర్వే పనుల పురోగతిపై సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రీసర్వే సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, సర్వే ప్రక్రియపై రైతులకు ముందస్తు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. సర్వే పనులను పారదర్శకంగా, సమన్వయంతో నిర్వహించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రీసర్వే విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతులు రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బందికి సహకరించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల మండల తహసీల్దార్ టి. విజయలక్ష్మి, మండల సర్వేయర్ విజయ్ కుమార్, అదనపు గిర్దావర్ ఖయ్యూం, గ్రామ పాలన అధికారి లావణ్య, సర్వే సిబ్బంది, పాల్గొన్నారు.

# పూజకు అంకితమైన పూలు..




**వరంగల్ టౌన్,అక్టోబర్9 (వుదయం విలేకరి):** పూజకు అంకితమైన పూలు... ప్రకృతి నుంచి వచ్చే పూలను దైవంగా కొలిచే బతుకమ్మ తెలంగాణలోని అత్యంత వైభవంగా ప్రపంచ దేశాలలో ఎలుగెత్తి చాటిన మన సంస్కృతి సంప్రదాయాన్ని పెంపొందించడం లో భాగంగా ఆడపడుచులు చేసే నృత్య భంగిమలు వివిధ రకాల పాటలు గానం చేస్తూ ఆచార వ్యవహారాలకు ఏ విధమైన ఆటంకం కలగకుండా పాటిస్తూ తెలంగాణ ఆడపడుచులు ప్రత్యేక శైలిలో ఉన్నారు. బతుకమ్మ గొప్పతనం పూలు పేర్చడంలోనే కాకుండా వివిధ భంగిమలలో వారి వారి స్థాయిని బట్టి వారికున్న వసతులను బట్టి బతుకమ్మను పేర్చి వారిలో ఉన్నటువంటి ప్రేమ అభిమానం అనురాగాన్ని తెలియజేస్తూ ఆనంద పరవశం పొందుతారు.అలాగే చూపరులకు ఆనందం కలిగేటట్టుగా చేస్తారు. ఇందులోని గొప్పతనం ఏ విగ్రహారాధన కాకుండా కేవలం తంగేడు పువ్వు, బంతి, చామంతి ,మురికి నీటిలో వికసించే తామర పువ్వును పెట్టి ఒక ఆకారాన్ని సృష్టించి ఆనందంతో పరవశించి నృత్యం చేస్తారు. అయితే ఇక్కడ గమనించవలసింది బీద ధనిక అనే భావన లేకుండా అందరూ మహిళలు మూకుమ్మడిగా బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు నృత్యాలు చేస్తూ మన సంస్కృతిని సంప్రదాయాన్ని తెలియజేస్తూ ఒకే కుటుంబ సంప్రదాయాన్ని పాటిస్తారు. ఈ సంప్రదాయాన్ని భావితరాల వారికి అందించవలసిన బాధ్యత మన మహిళలపై అలాగే ప్రభుత్వం వారిపై వివిధ స్వచ్ఛంద సంస్థలపై, ప్రతి ఒక్కరు . కలిసికట్టుగా పెంపొందించడం మన బాధ్యత..



**డాక్టర్ ఏ రాజేంద్రప్రసాద్**
**భారతి చారిటబుల్ ట్రస్ట్**
**మేనేజింగ్ ట్రస్టి**
**రామన్నపేట, వరంగల్.**

# రోల్లకల్ గ్రామంలో విబి గ్రామ్ - గ్రామ్ జి పథకం ద్వారా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మాణం

**గ్రామ సర్పంచ్ లునవత్ దేవి మంగ్య నాయక్**




**పర్వతగిరి , అక్టోబర్ 9 ( వుదయం ప్రతినిధి ):** పర్వతగిరి మండలం రోలకల్లు గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామస్తుల సౌలభ్యం పరిశుభ్రత కోసం విబి గ్రామ్ గ్రామ్ జి పథకం ద్వారా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత (Soak Pit) నిర్మాణం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ లునవత్ దేవి మంగ్య నాయక్ తెలిపారు.ఈ మేరకు గ్రామ ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

నిధుల వివరాలు :

ఈ పథకం ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వ పరంగా మొత్తం

* ఇంకుడు గుంత నిర్మాణానికి మొత్తం ₹6,500/ మంజూరు చేయబడుతుంది. ఇందులో వేతన భాగం ₹800/ మరియు మెటీరియల్ భాగం₹5700/ చొప్పున నిధులు కేటాయించబడతాయి.

కావున, తమ ఇంటి వద్ద ఇంకా ఇంకుడు గుంత నిర్మించుకోని గ్రామ ప్రజలు తమ వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలియజేయగలరు. అర్హత ఉన్న వారి వివరాలను పరిశీలించి, మంజూరు కోసం సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుంది. గ్రామ ప్రజలు ఇప్పటివరకు తమ ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకొని వారు ముందుకు రావాలని సర్పంచ్ కోరారు ఆసక్తిగల అర్హులైన గ్రామ ప్రజలు తమ వివరాలను గ్రామపంచాయతీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అందిన దరఖాస్తులను పరిశీలించి తొందరగా మంజూరు కోసం సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని తెలిపారు

గ్రామ పరిశుభ్రత కాపాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసు కోవాలని అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని గ్రామపంచాయతీ తరపున గ్రామ సర్పంచ్ లునవత్ దేవి మంగ్య నాయక్ కోరారు.

# లిటిల్ ఫ్లవర్ స్కూల్లో అంబరానంటిన బతుకమ్మ సంబరాలు



**తొర్రూరు అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి):** తొర్రూరు లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ లో ముందస్తు బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాల కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో కెల్లా అతిపెద్ద పండుగ బతుకమ్మ అని, మన తెలంగాణలోనే గర్వించదగిన ఆచార సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన పర్వదినమే బతుకమ్మ అని, విద్యార్థులు ప్రకృతిలోని రకరకాల పూలను తీసుకు వచ్చి, త్రికోణాకారంలో బతుకమ్మను పేర్చి, గొబ్బెమ్మను తయారుచేసి, పసుపు, కుంకుమ, అర్చనలతో గౌరీదేవికి పూజా విధానం చేసి, నైవేద్యం సమర్పిస్తారని, మన తెలంగాణలోని ఆడపడుచులను పిలుచుకొని నూతన వస్త్రాలను సమర్పించడం వలన ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లుతామని చరిత్రకారుల ప్రతీక అని, కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు,ఉపాధ్యాయ బృందము నృత్యాలతో, కోలాటాలతో, ఆటపాటలతో చిన్న పెద్ద తేడా లేకుండా హంగు ఆర్భాటలతో, అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలను జరుపుకుంటామని వివరించారు. అశ్వయుజ పెత్రామాస్య రోజు ఎంగిలి పూల బతుకమ్మని, రెండవ రోజు అటుకుల బతుకమ్మ అని, మూడవ రోజున ముద్దపప్పు బతుకమ్మని, నాలుగవ రోజున నాన బియ్యం బతుకమ్మ అని, ఐదవ రోజును అట్ల బతుకమ్మని, ఆరవ రోజున అలిగిన బతుకమ్మ అని, ఏడవ రోజున వేపకాయల బతుకమ్మని, ఎనిమిది రోజున వెన్నెముద్దల బతుకమ్మ అని, తొమ్మిదవ రోజున సద్దుల బతుకమ్మ అని, రకరకాల పిండివంటలతో నైవేద్యాలను సమర్పిస్తారని తెలిపారు.

# మున్సిపాలిటీలో కో-ఆప్షన్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

**ఎనిమిది నెలలైనా పూర్తికాని ప్రక్రియపై తొమ్మిది మంది కౌన్సిలర్ల అభ్యంతరం**
**ఆర్డీవో,మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత**



**తొర్రూరు అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి):** మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియను తక్షణమే నిర్వహించాలని కోరుతూ తొమ్మిది మంది వార్డు కౌన్సిలర్లు సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తయి సుమారు ఎనిమిది నెలలు గడిచినా కోఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంటనే ప్రక్రియను ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక నిబంధనలను రూపొందించిందని కౌన్సిలర్లు తమ వినతి పత్రంలో పేర్కొన్నారు. అయినప్పటికీ, తొర్రూరు మున్సిపాలిటీలో ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో సంబంధిత అధికారులు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో), మున్సిపల్ కమిషనర్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం, 2019తో పాటు 2020 మార్చి 16న జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నెం.57, జి.ఓ.ఎం.ఎస్. నెం.58 ప్రకారం కోఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని వారు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడం, వాటిని పరిశీలించడం, ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేయడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు.కోఆప్షన్ ఎన్నికల నిర్వహణలో మరింత జాప్యం జరగకుండా అధికారులు స్పందించి, ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కర్నె నాగరాజు, భూసాని ఉప్పలయ్య, జయమ్మ, చకిలేల అలివేలు, దారావత్ పద్మ, తూర్పాటి రవి,పేర్ల జంపా, మాడుగుల భవానీలత, కిన్నెర కవిత, అల్లం శ్యామల పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటు నమోదుకు 22వ వార్డులో ప్రత్యేక కార్యక్రమం

**అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం ఇంగిలి వీరేష్ రావు.**



**పరకాల, అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి):** పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని వార్డు కంటెస్టెడ్ కౌన్సిలర్ ఇంగిలి వీరేష్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని అర్హులైన పట్టభద్రుల ఇళ్లకు నేరుగా వెళ్లి వారి వివరాలను సేకరించి, ఆన్‌లైన్ ద్వారా ఓటు నమోదు ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా ఇంగిలి వీరేష్ రావు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపు మేరకు వార్డులోని ప్రతి అర్హుడైన పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టభద్రుల ఓటు ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడాలని కోరారు. ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోని అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పంచగిరి శ్రీనివాస్, నాయకులు తూముల విజయ్, శివప్రసాద్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలి



**మున్సిపాలిటీ పరిధిలో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి**
**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.డి. యాకూబ్**
**మున్సిపల్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా**

**తొర్రూరు అక్టోబర్ 9 ( వుదయం ప్రతినిధి):** అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఎలాంటి రాజకీయ జోక్యం, పక్షపాతం లేకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని మున్సిపాలిటీ పరిధిలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం తొర్రూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.డి. యాకూబ్ మాట్లాడుతూ, నిరుపేదలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అధికారులు అర్హులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న ఉపాధి హామీ పథకం తరహాలో మున్సిపాలిటీ పరిధిలోని పేదలు, వ్యవసాయ కార్మికులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో కూలీ పనులు దొరకక అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వారికి ఉపాధి భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పేదల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీలో పారదర్శకత పాటించాలని, ఉపాధి హామీ చట్టం అమలు కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని యెడల పేదలను కార్మికులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జమ్మల శ్రీను మార్క సాంబయ్య ,ఎండి అమీర్ వ్యవసాయ , బోరస్వామి, తిమ్మిటి రవి, ఎండి షమీనా శ్రీలత నాగమణి రాధాకృష్ణ కృష్ణవేణి రైతు సంఘం అధ్యక్షులు కొత్త వెంకట్రెడ్డి కార్యదర్శి మట్టపల్లి కుమార్ కౌశల్ లక్ష్మయ్య సౌజన్య పల్లె పద్మ పాల్గొన్నారు.

# చెగువేరా స్ఫూర్తితో యువత పోరాటాల్లో ముందుండాలి

**పివైఎల్ మండల ప్రధాన కార్యదర్శి ప్రభాకర్**



**కొత్తగూడ అక్టోబర్ 09 (వుదయం ప్రతినిధి ):** క్యూబా విప్లవకారుడు కామ్రేడ్ చెగువేరాస్ఫూర్తితో యువత సామాజిక మార్పు కోసం జరిగే పోరాటాల్లో ముందుండాలని పివైఎల్ మండల ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక పాలడుగుల కృష్ణ స్మారక భవనం లో చెగువేరా వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విప్లవ స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అన్యాయం, అసమానతలు, దోపిడీకి వ్యతిరేకంగా చెగువేరా సాగించిన పోరాటం ప్రపంచవ్యాప్తంగా యువతకు స్ఫూర్తిదాయకమని ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజల హక్కుల సాధన కోసం యువత చైతన్యవంతమై, సమాజంలో నెలకొన్న సమస్యలపై ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు.ప్రస్తుత పరిస్థితుల్లో నిరుద్యోగం, పేదరికం, సామాజిక అసమానతలు యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని, వీటి పరిష్కారం కోసం యువత సంఘటితమై ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెగువేరా ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమం లో నాయకులు పుల్లన్న, రాజమల్లు, నిర్మల, వెంకటేష్, వెంకన్న,సారయ్య, అర్జున్, వెంకన్న పాల్గొన్నారు.

# కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ కు వినతి



**తొర్రూరు అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి):** నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వెలికట్ట గ్రామపంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ పురుషోత్తం కు గ్రామ వార్డు సభ్యులు శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ వెలికట్ట శివారులోని పాలకేంద్రం సమీపంలో ఉన్న 167 సర్వేనెంబర్ స్థలం కోర్టు తగాదాలో ఉండగా... దానికి నిబంధనలకు విరుద్ధంగా వార్డు సభ్యుల అంగీకారం లేకుండా ఏకపక్షంగా అనుమతి ఇచ్చాడన్నారు.ఇటీవల వార్డు సభ్యుల సమావేశం జరగగా సదరు వివాద స్థలం విషయంలో సంతకాలు పెట్టాలని ఒత్తిడి తెచ్చాడన్నారు.7 గురు వార్డు సభ్యులు ఆ ప్రతిపాదనను తిరస్కరించి సంతకాలు చేయలేదన్నారు. మొత్తం 10 మంది వార్డు సభ్యులు ఉండగా 7 మంది సభ్యులు తీర్మానంపై సంతకాలు చేయలేదన్నారు. సమావేశానికి హాజరుకాని సభ్యుణ్ణి పంచాయతీ కార్యాలయం బయట కలిసి సంతకం చేయాలని ఒత్తిడి చేశారన్నారు.

ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణి, డిపిఓ కు విన్నవించుకున్నామన్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ వెలికట్ట కార్యదర్శి శ్రీకాంత్ ను కాపాడుతున్నాడన్నారు.కావున కార్యదర్శి శ్రీకాంత్ పై చర్య తీసుకొని మా గ్రామానికి అనుభవం ఉన్న కార్యదర్శులు నియమించాలని కోరారు.ఈ విషయంలో అధికారులు స్పందించి అనుభవం ఉన్న మరో కార్యదర్శిని గ్రామానికి కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వడ్లకొండ ఎల్లమ్మ,యాసరపు సోమయ్య,కొమ్ము శారద, వీరమనేని రమేష్,భోగ సుజాత కమలాకర్, మరిపెద్ది సుభద్ర,అల్లంనేని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

**మృతదేహంపై పూలమాల వేసిన మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్, మాజీ ఎంపీపీ, మాజీ ఏఎంసి చైర్మన్**



**ఖానాపురం, అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి):** మండలంలోని వేపచెట్టుతండా గ్రామపంచాయతీ పరిధిలోని కోమిటిపల్లితండాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ బానోతు వెంకటరావు(52)అనారోగ్యంతో మృతి చెందగా మృతదేహాన్ని మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్‌రావు, మాజీ ఏఎంసి చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ మృతదేహాన్ని సందర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు తెజావత్ రెడ్డి నాయక్ నాయకులు భూక్య వెంకన్న, గుగులోతు బాలునాయక్, గొంది నాగేశ్వరరావు, బాదావతు బాలకిషన్, షేక్ మౌలానా, మూడు దంజినాయక్, లావుడియా రమేష్, లకావత్ ప్రవీణ్, బిక్షపతి, బాలాజీ, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూరు, రంగాపురం గ్రామాలలో పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమం

**క్లస్టర్ ఇన్చార్జి దాసరి రమేష్, ఆబోతు అశోక్**



**ఖానాపురం, అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి):** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టభద్రుల ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా ఖానాపురం క్లస్టర్ పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొత్తూరు, రంగాపురం గ్రామాల్లోని పట్టభద్రులను గుర్తించి ఓటు నమోదు చేస్తున్నట్లు క్లస్టర్ ఇన్చార్జిలు దాసరి రమేష్, ఆబోతు అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ఉన్న అర్హులైన పట్టభద్రులు తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆయా గ్రామాల పట్టభద్రులకు ఇన్చార్జిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు జాటోత్ రమేష్, బంధారపు శ్రీనివాస్, నాయకులు భూస అశోక్, సొంటి లక్ష్మణ్, జాటోత్ బాలు పట్టభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి పట్టం.. బ్లూమింగ్ బడ్స్‌లో బతుకమ్మ సంబరాలు



**రాయపర్తి అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వరంగల్ జిల్లా రాయపర్తిలోని బ్లూమింగ్ బడ్స్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. దీంతో పాఠశాల ఆవరణ పూల పండుగ శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చిన్నతనం నుంచే విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఐకమత్యాన్ని పెంపొందించడంతో పాటు మన మూలాలు, సంప్రదాయాల పట్ల గౌరవభావాన్ని పెంచుతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఎనగందుల సంతోష్,ఉపాధ్యాయులు రాజురెడ్డి, శ్రీవాణి, చైతన్య, సుమలత, శైలజ, రజిత, మమత, శ్రావ్య, సిరివల్లిక, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెలికట్ట భూముల సమస్యపై బాధితుల ధర్నా



**తొర్రూరు అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి):** తొర్రూరు మండలం వెలికట్ట గ్రామంలో భూముల సమస్యపై బాధితులు ఆందోళనకు దిగారు. గ్రామంలోని సర్వే నంబర్ 58లో ఉన్న సుమారు 250 నుంచి 260 ఎకరాల భూమిని ప్రభుత్వం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ, సుమారు 224 మంది బాధితులు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మంగళపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూముల రికార్డులను పరిశీలించి, అర్హమైన భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ధర్నాతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది

# అంగన్వాడి కేంద్రంలో బతుకమ్మ సంబరాలు

**పూల పండుగతో చిన్నారుల కోలాహలం.. తెలంగాణ సంప్రదాయాలకు ప్రాధాన్యం**



**రాయపర్తి అక్టోబర్ 9 (వుదయం ప్రతినిధి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని రాయపర్తి మండలం కాట్రపల్లి అంగన్వాడి 2 కేంద్రంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా నిర్వహించారు.పూలతో బతుకమ్మలను అలంకరించి, పండుగ విశిష్టతను వివరిస్తూ చిన్నారుల్లో ఆనందోత్సాహాలను నింపారు.ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను, తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని చిన్నారులకు తెలియజేశారు.మన సంప్రదాయాలను గౌరవిస్తూ, భావితరాలకు వాటి విశిష్టతను అందించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. పూల పండుగ నేపథ్యంలో అంగన్వాడి కేంద్రంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాపాక పద్మ, సూపర్వైజర్ మాధవి లత, అంగన్వాడి టీచర్ యాకుబి, ఆయా చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# హాస్పిటల్ లో మాజీ ఎంపీపీ వల్లందాసు రంగయ్య మనవడు ఆరోగ్య నిలకడ

**మాజీ పర్వతగిరి సొసైటీ చైర్మన్ మనోజ్ కుమార్ గౌడ్**



**పర్వతగిరి , అక్టోబర్ 9 ( వుదయం ప్రతినిధి ):** పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ వల్లందాస్ రంగయ్య మనవడు ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని మాజీ చైర్మన్ ఎం. మనోజ్ కుమార్ గౌడ్ చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను సంప్రదించి తెలుసుకున్నారు.

చిన్నారి ఆరోగ్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చిన్నారి ఆరోగ్యం ప్రస్తుతం బాగుందని, వైద్యుల పర్యవేక్షణలో చిన్నారి త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే చిన్నారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు.

# చక్కని ఆరోగ్యం

## ఉదయం అల్పాహారంలో ఇవి తింటున్నారా?



కొన్ని రోజుల్లో ఎంతో ఉత్సాహంగా అనిపిస్తే.. మరికొన్ని రోజుల్లో అలసట, నీరసం వెంటాడుతుంటాయి. ఏ పని చేయాలన్నా ఆసక్తి ఉండదు. ఇలా ఎందుకు జరుగుతుందో చాలాసార్లు అర్థం కాదు. దీనికి వాతావరణాన్ని కారణంగా కొందరు భావిస్తారు. అయితే ఉదయం మనం తీసుకునే అల్పాహారం మన జీవక్రియపై ప్రభావం చూపుతుందని పోషకాహార నిపుణురాలు అంజలి ముఖర్జీ చెబుతున్నారు. పాన్‌కేక్‌లు, పాలతో తృణధాన్యాలు, ఇడ్లీ, దోశ, ఉప్మా, పోహా లేదా పండ్ల రసం వంటి అల్పాహారం రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతాయని ఆమె వివరించారు. ఇలాంటి అల్పాహారం తీసుకున్నప్పుడు రక్తంలో చక్కెర పెరిగి, ఆ తర్వాత ఒక్కసారిగా పడిపోతుందని ఆమె తెలిపారు. ఇలాంటి అల్పాహారం తిన్న వెంటనే కొంతసేపు కడుపు నిండినట్లు అనిపించినప్పటికీ, త్వరగానే మళ్లీ ఆకలి వేస్తుందని చెప్పారు. ఉదయం అల్పాహారంలో ఎక్కువ ప్రొటీన్ తీసుకోవడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతి కలుగుతుందని, ఆహారంపై వచ్చే కోరికలను నియంత్రించడంలో సహాయపడుతుందని ఆమె సూచించారు. అల్పాహారంలో గుడ్డు భుర్జీ, టోఫు భుర్జీ, పనీర్ భుర్జీ, శనగపిండి చీలా వంటి సులభమైన ఆహారాలను ఆమె సూచించారు. ప్రొటీన్ అధికంగా ఉండే అల్పాహారం కండర ద్రవ్యరాశిని కాపాడుకోవడంలో, ఆహారంపై వచ్చే కోరికలను నియంత్రించడంలో, జీవక్రియకు మద్దతు ఇవ్వడంలో సహాయపడుతుందని ఆమె పేర్కొన్నారు. రోజును ప్రొటీన్‌తో ప్రారంభించాలని, జీవక్రియ అందుకు కృతజ్ఞతలు చెబుతుందని ఆమె అన్నారు. అంతకు ముందు ఇచ్చిన వివరణల్లోనూ రోజంతా ఉండే అలసటను తగ్గించుకోవడానికి రోజువారీ ఆహారం, జీవనశైలిలో కొన్ని సులభమైన మార్పులు చేసుకోవాలని అంజలి ముఖర్జీ సూచించారు. పాలకూర, కాలే, మెంతికూర వంటి ఆకుకూరలతోపాటు బెర్రీలు, సిట్రస్ పండ్లు వంటి రంగురంగుల పండ్లను ఆహారంలో చేర్చుకోవాలని ఆమె సూచించారు. రోజును పండ్లతో ప్రారంభించి, ఆ తర్వాత ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని ఆమె సూచించారు. రోజును పండ్లతో ప్రారంభించాలని, పండ్లు తిన్న గంట తర్వాత కూడా ఆకలిగా ఉంటే ఒకటి లేదా రెండు గుడ్లు తీసుకోవచ్చని, కావాలనుకుంటే గుడ్డులోని తెల్లసొన మాత్రమే తీసుకోవాలని అన్నారు. అయితే మొత్తం గుడ్డు కూడా మంచిదేనని, ఆ తర్వాత టోస్ట్‌తోపాటు టమాటా, క్యారెట్, బీట్‌రూట్ రసం లేదా బూడిద గుమ్మడికాయ రసం తీసుకోవచ్చని సూచించారు. శాకాహారులు ఉదయం సుమారు 100 గ్రాముల పనీర్‌ను ఉప్పు, మిరియాల పొడి వేసి పెనంపై కాల్చుకుని తినవచ్చని, లేదా పనీర్ పరాఠా, పనీర్ భుర్జీ తీసుకోవచ్చని ఆమె సూచించారు. దీంతోపాటు ఒక గ్లాస్ కూరగాయల రసం తీసుకోవచ్చని తెలిపారు. పోషక అవసరాలను తీర్చడంతోపాటు శక్తి స్థాయిలను ఎక్కువగా ఉంచే అల్పాహారమే సరైన అల్పాహారం అని ఆమె వివరించారు.

## వారాల తరబడి దగ్గు తగ్గడం లేదా? ఈ వ్యాధులకు సంకేతం కావచ్చు!



మారుతున్న వాతావరణం, అలర్జీల వల్ల వ్యాపించే దగ్గును చాలామంది తేలిగ్గా తీసుకుంటారు. కానీ, వారాల తరబడి ఇదే తీరుగా ఉంటే అది శ్వాసకోశ సమస్యలకు దారి తీస్తుంది. లక్షణాలు ఒకేలా అనిపించినప్పటికీ, వ్యాధి తీవ్రత వేర్వేరుగా ఉండొచ్చు. సరైన కారణాన్ని గుర్తించకుండా అంచనాలతో సొంత వైద్యం చేసుకోవడం వల్ల ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఊపిరితిత్తులు, శ్వాసనాళాల సమస్యల వల్ల మాత్రమే కాకుండా, శరీరంలోని ఇతర భాగాల్లో తలెత్తే అనారోగ్యాల వల్ల కూడా దగ్గు రావచ్చు. ఆ రకాలేమిటో తెలుసుకుందాం.. ఆస్తమా: దగ్గుతో పాటు పిల్లికూతలు, ఛాతీలో బిగుతుగా ఉండటం, ఆయాసం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. రాత్రి వేళల్లో, నిర్దిష్ట పరిస్థితుల్లో ఈ సమస్య మరింత ఎకువవుతుంది. సీవోపీడీ: నిరంతరం తగ్గని దగ్గు, కఫం పడటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది సీవోపీడీకి సంకేతం. ముఖ్యంగా పొగతాగే అలవాటు ఉన్నవారిలో, కాలుష్యానికి గురయ్యేవారిలో ఇది ఎకువగా కనిపిస్తుంది. యాసిడ్ రిఫ్లక్స్: కడుపులోని యాసిడ్ తిరోగమనం చెంది అన్నవాహిక ద్వారా గొంతులోకి చేరినప్పుడు కూడా దగ్గు వస్తుంది. చాలామందికి గుండెల్లో మంట లేకపోయినా ఈ రకమైన దగ్గు రావచ్చు.

పోస్ట్–నాసల్ డ్రిప్: ముకు లేదా సైనస్ భాగాల నుంచి శ్లేష్మం గొంతులోకి కారడం వల్ల కూడా నిరంతరం దగ్గు వస్తుంటుంది.

లక్షణాలు ఒకేలా ఉన్నంత మాత్రాన వ్యాధి ఒకటే కావాలని లేదు. పదేపదే దగ్గు వస్తుంటే దానిని సాధారణ అలెర్జీ లేదా ఇన్ఫెక్షన్‌గా భావించి, డాక్టర్ సలహా లేకుండా మెడికల్ షాపుల్లో దొరికే మందులు వాడటం సరైన పద్ధతి కాదు. దీనివల్ల అసలైన జబ్బును ప్రారంభంలోనే గుర్తించే అవకాశం కోల్పోతారు. వైద్యులు రోగి దగ్గు తీవ్రత, అది ఎంతకాలంగా ఉందో పరిశీలిస్తారు. అలాగే ధూమపానం, కాలుష్యానికి గురికావడం వంటి అంశాలను, ఇతర అనారోగ్య చరిత్రను సమీక్షించిన తర్వాతే ఎక్స్–రే, సిటి సాన్ లేదా లంగ్స్ పంక్షన్ టెస్టులు అవసరమో లేదో నిర్ధారిస్తారు. బ్లడ్ షుగర్: ఒబేసిటీ ఉన్నా, కుటుంబసభ్యుల్లో ఎవరికైనా రక్తంలో గ్లూకోజ్ స్థాయి ఎక్కువగా ఉన్నా, వయసు పెరిగేకొద్దీ మధుమేహానికి దగ్గర అవుతున్నట్టే. మధుమేహ కుటుంబ చరిత్ర ఉన్నవారు.. 30 ఏళ్ల నుంచే తరచూ పరీక్షలు చేయించుకోవాలి.

బ్లడ్ ప్రెషర్ (బీపీ): దేహంలో ప్రవహించే రక్తం.. నాళాలపై కలిగించే ఒత్తిడిని 'రక్త పీడనం' అంటారు. ఈ పీడన స్థాయి మన ఆరోగ్యాన్ని సూచిస్తుంది. బీపీ పెరగడం వల్ల గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది. 18 ఏళ్లు పైబడిన వాళ్లు తరచూ బీపీ పరీక్షించుకోవాలి.

## జుట్టు రాలేందుకు కేవలం పోషకాహార లోపమే కారణమా..

దువ్వెనపై, దిండు మీద లేదా స్నానం చేసినప్పుడు సాధారణం కంటే ఎక్కువగా జుట్టు కనిపించడం ఆందోళన కలిగిస్తుంది. కొంతమేర జుట్టు రాలడం సహజమే అయినప్పటికీ, అకస్మాత్తుగా లేదా ఎక్కువగా జుట్టు రాలడం వెనుక వివిధ కారణాలు ఉంటాయి. జన్యుపరమైన కారణాలు, హార్మోన్లలో మార్పులు, ఒత్తిడి, అనారోగ్యం, కొన్ని మందులు, పోషకాల లోపం వంటి అంశాలు జుట్టు రాలడానికి కారణం అవుతాయి. శరీరానికి అవసరమైన పోషకాలు తగినంతగా అందకపోతే జుట్టు కుదుళ్ల సాధారణ పెరుగుదల చక్రం ప్రభావితమవుతుంది. ముఖ్యంగా ఇనుము, విటమిన్ డి, విటమిన్ బి12, ఫోలేట్, జింక్ లోపాలతో పాటు ఆహారంలో తగినంత ప్రొటీన్ లేకపోవడం కూడా జుట్టు రాలడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అయితే జుట్టు రాలడం ఒక్కటే ఏదైనా పోషక లోపం ఉందని నిర్ధారించదు. ఇనుము లోపం జుట్టు ఎక్కువగా రాలుతున్నప్పుడు పరిశీలించే ముఖ్యమైన పోషక సంబంధిత కారణాల్లో ఒకటి. శరీరమంతా ఆక్సిజన్‌ను తీసుకెళ్లే హిమోగ్లోబిన్ తయారీలో ఇనుము కీలక పాత్ర పోషిస్తుంది. శరీరంలో ఇనుము నిల్వలు తగ్గడం కొందరిలో జుట్టు రాలడాన్ని పెంచుతుంది. అధికంగా రుతుస్రావం అయ్యేవారు, ఆహారం ద్వారా తగినంత ఇనుము తీసుకోనివారు, కొన్ని అనారోగ్య పరిస్థితులు ఉన్నవారు ఇనుము లోపానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. విటమిన్ డి కూడా జుట్టు ఆరోగ్యంతో సంబంధం కలిగి ఉంటుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అలాగే విటమిన్ బి12 కణాల సాధారణ పనితీరు, ఎర్ర రక్తకణాల తయారీకి అవసరం. ముఖ్యంగా జంతు ఆహారాలను పూర్తిగా మానేసినవారిలో బి12 లోపం వచ్చే అవకాశం ఉంటుంది. ఫోలేట్ కణ విభజన, డీఎన్ఏ తయారీలో కీలకమైన పోషకం. ఆకుకూరలు, పప్పులు, బీన్స్ వంటి ఫోలేట్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా దాని అవసరాన్ని తీర్చుకోవచ్చు.

జింక్ కూడా రోగనిరోధక వ్యవస్థ పనితీరు, ప్రొటీన్ తయారీ, కణ విభజన వంటి అనేక ప్రక్రియల్లో కీలక పాత్ర పోషిస్తుంది. తీవ్రమైన జింక్ లోపం జుట్టు రాలడం, జుట్టు నాణ్యతలో మార్పులతో సంబంధం కలిగి ఉంటుంది. అయితే వైద్యుల సలహా లేకుండా అధిక మోతాదులో జింక్ ట్యాబ్లెట్లను తీసుకోవడం మంచిది కాదు. జుట్టు ప్రధానంగా కెరాటిన్ అనే నిర్మాణాత్మక ప్రొటీన్‌తో తయారవుతుంది కాబట్టి, ఆహారంలో తగినంత ప్రొటీన్ లేకపోవడం కూడా జుట్టు పెరుగుదలపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా కఠినమైన ఆహార నియమాలను పాటించడం లేదా వేగంగా బరువు తగ్గే సమయంలో ఈ సమస్య తలెత్తే అవకాశం ఉంటుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునేవారు ఆహారాన్ని అతిగా పరిమితం చేయకుండా, శరీరానికి అవసరమైన ప్రొటీన్‌తోపాటు ఇతర పోషకాలు కూడా తగినంతగా అందేలా చూసుకోవాలి. జుట్టు రాలుతోందని వెంటనే అనేక రకాల పోషకాహార ట్యాబ్లెట్లను తీసుకోవడం సరైన పద్ధతి కాదు. శరీరంలో లోపం నిర్ధారణ కాకుండా సప్లిమెంట్లు తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉండదు. కొన్ని పోషకాలను అధికంగా తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రావడంతోపాటు కొన్ని సందర్భాల్లో జుట్టు రాలడం మరింత పెరిగే అవకాశం కూడా ఉంటుంది. అకస్మాత్తుగా లేదా వేగంగా జుట్టు రాలడం, జుట్టు పలుచబడడం, పాపిడి వెడల్పు పెరగడం, కొన్ని ప్రాంతాల్లో బట్టతల మచ్చలు కనిపించడం, తలపై దురద, పొట్టు లేదా వాపు, తీవ్రమైన అనారోగ్యం లేదా వేగంగా బరువు తగ్గిన తర్వాత జుట్టు రాలడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి. ఒత్తిడి, ఇటీవలి అనారోగ్యం, హార్మోన్ల మార్పులు, థైరాయిడ్ సమస్యలు, కొన్ని మందులు, జన్యుపరమైన కారణాలు, తల చర్మ సమస్యలు కూడా జుట్టు రాలడానికి కారణం అవుతాయి. అందువల్ల కారణాన్ని గుర్తించకుండా సప్లిమెంట్లపై ఆధారపడకుండా, సమతుల ఆహారం తీసుకోవడం, అవసరమైతే వైద్యుల సూచనతో పరీక్షలు చేయించుకోవడం ముఖ్యమని నిపుణులు తెలియజేస్తున్నారు.



## మహిళల్లో పెరుగుతున్న గుండె పోటు ముప్పు..



గుండెపోటు అంటే సాధారణంగా ఛాతిలో తీవ్రమైన నొప్పి, బరువు లేదా ఒత్తిడి వంటి లక్షణాలే గుర్తుకు వస్తాయి. అయితే మహిళల్లో గుండెపోటు లక్షణాలు చాలాసార్లు స్వల్పంగా లేదా సాధారణ లక్షణాలకు భిన్నంగా కనిపించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గతంలో మహిళలకు గుండెపోటు వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుందని భావించినప్పటికీ, ప్రస్తుతం యువతుల్లోనూ గుండెపోటు కేసులు నమోదవుతున్నాయి. అందువల్ల మహిళలు తమ శరీరంలో కనిపించే అసాధారణ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండడం అవసరం. మహిళల్లో గుండె సంబంధిత సమస్యల లక్షణాలు ఇతరులతో పోలిస్తే తక్కువ తీవ్రతతో కనిపిస్తాయి. ఛాతిలో అసౌకర్యం లేదా నొప్పి, బరువుగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. మహిళల్లో గుండె జబ్బుల ప్రమాదం సాధారణంగా మెనోపాజ్‌కు ముందు తక్కువగా ఉండి, ఆ తర్వాత క్రమంగా పెరుగుతుంది. అయితే మధుమేహం, అధిక రక్తపోటు, అధిక బరువు వంటి ఇతర ప్రమాద కారకాలు ఉన్నప్పుడు గుండె జబ్బుల ముప్పు మరింత పెరుగుతుంది. కాబట్టి ఇలాంటి సమస్యలు ఉన్న మహిళలు గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

గుండెపోటుకు ముందు ఛాతిలో నొప్పి లేదా బరువుగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి సమయంలో ఆలస్యం చేయకుండా సమీపంలోని అత్యవసర వైద్య విభాగానికి వెళ్లాలి. అక్కడ గుండెకు ఏమైనా నష్టం జరిగిందా తెలుసుకోవడానికి ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహిస్తారు. ముఖ్యంగా ట్రోపోనిన్ పరీక్ష కీలకమైనది. గుండె కండరాలకు రక్త సరఫరా తగ్గి కణాలు దెబ్బతిన్నప్పుడు ట్రోపోనిన్ అనే ప్రొటీన్ రక్తంలోకి విడుదలవుతుంది. రక్తంలో దీని స్థాయి పెరిగినట్లు తేలితే గుండె కండరాలు దెబ్బతింటున్నట్లు గుర్తించి, అవసరమైన చికిత్సను వెంటనే ప్రారంభిస్తారు. గుండె పరిస్థితిని అంచనా వేయడానికి ఛాతీ ఎక్స్‌రే, ఎకోకార్డియోగ్రఫీ వంటి ఇతర పరీక్షలు కూడా ఉపయోగపడతాయి. ఛాతీ ఎక్స్‌రే ద్వారా గుండె పరిమాణం పెరిగిందా, ఊపిరితిత్తుల్లో ద్రవం చేరిందా వంటి విషయాలను తెలుసుకునే వీలు ఉంది. ఎకో పరీక్షలో గుండె గదుల నిర్మాణం, గుండె ఎంత సమర్థంగా రక్తాన్ని పంప్ చేస్తోంది, గుండెలోని నాలుగు కవాటాల్లో ఏవైనా లీకేజీ లేదా ఇతర సమస్యలు ఉన్నాయా వంటి అంశాలను పరిశీలిస్తారు. ముఖ్యంగా మహిళల్లో గుండెపోటు లక్షణాలు స్పష్టంగా కనిపించవు. కాబట్టి ఛాతిలో అసౌకర్యం లేదా ఇతర అనుమానాస్పద లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు.

## రోజూ నెయ్యి తినడం గుండెకు చెడు చేస్తుందా..?

వేడివేడి అన్నంలో నెయ్యి (Ghee).. పప్పులో నెయ్యి.. రోటీ (Roti) పై నెయ్యి.. ఇలా మన దేశంలో నెయ్యికి ఉన్న ప్రత్యేకతే వేరు. పెద్దలు నెయ్యి ఆరోగ్యానికి చాలా మంచిదని చెబుతుంటారు. పసిపిల్లలకు నెయ్యి పెడితే బలమంటారు. రుచికి కూడా తిరుగుండదు. అయితే నెయ్యి అతిగా తింటే గుండె ఆరోగ్యం (Heart Health) పై ప్రభావం పడుతుందా..? నెయ్యి గుండెకు మేలు చేస్తుందా చెడు చేస్తుందా..? వైద్య నిపుణులు ఏమంటున్నారు..? ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం..? నెయ్యిలో శాచురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. 100 గ్రాముల నెయ్యిలో దాదాపు 883 కిలోకేలరీలు ఉంటాయి. కాబట్టి నెయ్యిని మితంగా తీసుకుంటే సమస్య లేదు. అతిగా తీసుకుంటేనే కొవ్వు పేరుకుంటుంది. కాబట్టి నెయ్యిని తరచూ తినడంతో సమస్య ఉండదు. నెయ్యిని ఎంత మోతాదులో తీసుకుంటున్నామన్నదే అసలు సమస్య. పప్పుకు ఓ చెంచా.. అన్నానికి మరో చెంచా.. రోటీకి ఇంకో చెంచా.. ఇలా రోజంతా తెలియకుండానే నెయ్యి పరిమాణం పెరిగిపోవచ్చు. అదే అలవాటు కొనసాగితే శరీరంలోకి అవసరానికి మించిన కొవ్వు చేరుతుంది.



శాచురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువగా తీసుకోవడంవల్ల రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. కొలెస్ట్రాల్ ఎక్కువ కాలం అధికంగా ఉంటే రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయే ప్రమాదం ఉంటుంది. ఇది గుండె జబ్బుల ముప్పును పెంచుతుంది. కాబట్టి రోజూ నెయ్యి తినే అలవాటు మంచిదే అయినా.. మోతాదుకు మించకుండా చూసుకోవడం ఉత్తమమని నిపుణులు అంటున్నారు. ఆరోగ్యంగా ఉన్న పెద్దవాళ్లు రోజుకు ఒకటి నుంచి రెండు టీస్పూన్ల నెయ్యిని తీసుకోవచ్చు.

అయితే నెయ్యితోపాటు వంట నూనెలు, వెన్న వంటి అన్ని కొవ్వుల పరిమాణాన్ని కూడా లెక్కలోకి తీసుకోవాలి. ఇప్పటికే గుండె జబ్బులు, మధుమేహం లేదా అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు నెయ్యి విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. వారి ఆహారంలో కొవ్వుల పరిమాణాన్ని వైద్యుడు లేదా పోషకాహార నిపుణుడి సూచన మేరకు నిర్ణయించుకోవడం మంచిది. కాబట్టి నెయ్యిని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. వంటలో సుమారుగా కాకుండా చెంచాతో కొలత చూసుకుని వాడటం అలవాటు చేసుకోవాలి. వంట చివర్లో కొద్దిగా నెయ్యి వేసినా మంచి రుచి, వాసన వస్తాయి.

## సిజేరియన్ తర్వాత..!



ఈ రోజుల్లో సిజేరియన్ డెలివరీలు సర్వసాధారణమైపోయాయి. అయితే సిజేరియన్ తర్వాత కోలుకోవడానికి చాలా సమయం పడుతుందని, ఆ తర్వాత కూడా దీర్ఘకాలంలో పలు సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయని కొంతమంది భావిస్తుంటారు. కానీ ప్రసవం తర్వాత కొన్ని జాగ్రత్తలు పాటిస్తే సిజేరియన్ నొప్పుల నుంచి త్వరగా కోలుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

సిజేరియన్ తర్వాత తల్లులు ఎంత విశ్రాంతి తీసుకుంటే అంత త్వరగా కోలుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. కుట్లపై ఒత్తిడి పడకుండా అవి త్వరగా మానిపోవడానికి ఇది దోహదం చేస్తుందట. అయితే కొత్తగా తల్లైన వారికి రోజులో చాలా సమయం పాపాయితోనే సరిపోతుంది. వారికి పాలివ్వడం, డైపర్లు/దుస్తులు మార్చడం, వారిని నిద్రపుచ్చడం, వారు నిద్రపోయినప్పుడు ఇతర పనులు చేసుకోవడం.. ఇలా రోజంతా బిజీబిజీగా గడిచిపోతుంది. ఇక విశ్రాంతికి టైమెక్కడ? అని చాలామంది తల్లులు ఆందోళన చెందుతుంటారు. ఇది ఇటు బాలింతలకు, అటు శిశువుకు.. ఇద్దరికీ మంచిది కాదు. కాబట్టి తల్లైన తొలినాళ్లలో నిద్రలేమిని, ఒత్తిడిని జయించాలంటే ఇతర పనులు పక్కన పెట్టి పాపాయి నిద్రపోయినప్పుడే తల్లులూ నిద్రకు ఉపక్రమించాలని నిపుణులు సూచిస్తున్నారు.

పాలిచ్చే ప్రక్రియ కొత్తగా తల్లైన మహిళలకు ఎంతో ప్రయోజనకరం అంటున్నారు నిపుణులు. ప్రసవానంతరం పెరిగిన బరువు తగ్గడానికి, వెంటనే మళ్లీ గర్భం ధరించకుండా ఉండడానికి.. ఇలా ఎలా చూసినా బాలింతలకు ఎంతో మేలు చేస్తుంది. అయితే పిల్లలకు పాలిచ్చే క్రమంలో తల్లులు కూర్చునే పొజిషన్ కూడా ఇక్కడ కీలకమే అంటున్నారు నిపుణులు. ఇందులో భాగంగా ముందుకి, వెనక్కి వంగిపోకుండా నిటారుగా కూర్చొని చిన్నారికి పాలివ్వాల్సి ఉంటుంది. ఇలా చేయడం వల్ల సిజేరియన్ కారణంగా దీర్ఘకాలంలో నడుంనొప్పి రాకుండా జాగ్రత్తపడచ్చట. ఈ క్రమంలో మీకు, మీ చిన్నారికి సౌకర్యవంతంగా ఉండడం కోసం నిపుణుల సలహా మేరకు ఫీడింగ్ పిల్లోను కూడా వాడచ్చట.

సిజేరియన్ తర్వాత ఇది తినకూడదు, అది తాగకూడదు.. అన్న నియమనిబంధనలు ఇప్పటికీ చాలా ఇళ్లలో ఉంటుంటాయి.

అయితే పాలిచ్చే తల్లులకు ఎలాంటి పథ్యాలు అవసరం లేదని డాక్టర్లు చెబుతున్నారు. గర్భిణిగా ఉన్న సమయంలో సంపూర్ణ పోషకాలు లభించే పదార్థాలన్నీ ఎలాగైతే తీసుకుంటారో ప్రసవానంతరం కూడా వైద్యుల సలహాతో అలాగే తీసుకోవాలని, తద్వారా సిజేరియన్ నొప్పుల నుంచి సైతం త్వరగా కోలుకోవచ్చని సూచిస్తున్నారు.

## ఐటీ స్టాక్స్ నడిపించాయ్.. సెన్సెక్స్ 879 పాయింట్లు పైకి

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. రెండు రోజులుగా వరుస నష్టాలు చవిచూసిన సూచీలు.. శుక్రవారం కోలుకున్నాయి. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో పాటు, టీసీఎస్ సహా ఇతర ఐటీ స్టాక్స్ రాణించడం కలిసొచ్చింది. మధ్యంతర ఎన్నికల తర్వాతే ఇరాన్‌పై దాడులు ఉంటాయని డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం, అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గడమూ సానుకూల ప్రభావం చూపాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 800 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 22,500 మార్కు ఎగువన ముగిసింది.

# బిజినెస్

# 6జీ, ఏఐ రంగాల్లో గ్లోబల్ లీడర్‌గా భారత్!

టెలికాం మరియు డిజిటల్ రంగంలో సరిహద్దుల్లేని పురోగతి ధ్యేయంగా ప్రతిష్టాత్మక 'ఇండియా మొబైల్ కాంగ్రెస్ (IMC) 2026' 10వ ఎడిషన్ శుక్రవారం దేశ రాజధానిలో ఘనంగా ప్రారంభమైంది. 'స్కేల్ వితౌట్ బౌండరీస్' అనే ప్రధాన నినాదంతో జరుగుతున్న ఈ మూడు రోజుల సదస్సును భారత ప్రధాని నరేంద్ర మోదీ అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్నాలజీ, పరిశోధనలు, పెట్టుబడులను మానవాళి సేవ కోసం అనుసంధానించడంలో ఐఎంసీ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. భారత్ నేడు కేవలం టెక్నాలజీని వాడుకునే దేశం నుంచి ప్రపంచానికే సాంకేతికతను అందించే (గ్లోబల్ క్రియేటర్) స్థాయికి ఎదిగిందని ప్రధాని స్పష్టం చేశారు.సదస్సు ప్రారంభ సెషన్‌లో కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ.. యూపీఐ, ఆధార్, డిజిలాకర్ వంటి వ్యవస్థలు సరసమైన కనెక్టివిటీకి నిదర్శనాలని పేర్కొన్నారు. నేడు దేశంలో మొబైల్ ఫోన్లు బ్యాంకు బ్రాంచ్‌లుగా, టెలికాం నెట్‌వర్క్‌లు దేశ ఆర్థిక రహదారులుగా మారాయని తెలిపారు. భౌగోళిక పరిస్థితులు లేదా ఆదాయ వ్యత్యాసాలు ఎవరి అవకాశాలను దెబ్బతీయకుండా చూడటమే తమ లక్ష్యమని చెప్పారు.కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ల్యాండ్‌మార్క్ సదస్సుకు 100కు పైగా దేశాల నుంచి దాదాపు 1.5 లక్షల మంది ప్రతినిధులు హాజరవుతున్నారు. ఈ సదస్సులో 6జీ టెస్ట్‌బెడ్స్, డైరెక్ట్–టు–డివైస్ శాటిలైట్ కనెక్టివిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ల మోనిటైజేషన్‌పై పరిశ్రమల దిగ్గజాలు కీలక చర్చలు జరుపుతున్నారు.



## అమెరికాకు మనం అక్కర్లేదు.. తిరిగొచ్చేయండి: శ్రీధర్ వెంబు



టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ వంటి సంస్థలను పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ (PERM) నుంచి సస్పెండ్ చేస్తూ ట్రంప్ సర్కారు తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఉపాధి ఆధారిత గ్రీన్‌కార్డు పొందడంలో హెచ్–1బీ వర్కర్లకు దోహదపడే ఈ పర్మ్ ప్రోగ్రామ్ నుంచి ఈ కంపెనీలను సస్పెండ్ చేయడంతో.. విదేశీ ఉద్యోగులకు కంపెనీలు శాశ్వత నివాసం స్పాన్సర్ చేయడం కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాకు మన అవసరం లేదని, అక్కడి భారతీయులు తిరిగి స్వదేశానికి వచ్చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'అమెరికా సాంకేతిక ప్రగతిలో భారతీయులు కీలక పాత్ర పోషించారు. అయితే, ఇప్పుడు అక్కడ ఒక పెద్ద వర్గానికి ఇక భారతీయుల అవసరం లేదనిపిస్తోంది. వీసాపై ఉంటూ ఇన్నాళ్లూ కష్టపడి నిర్మించుకున్న జీవితాన్ని వదిలిరావడం ఒక విధంగా బాధాకరమైన విషయం. అయినా ఇదే సరికొత్త భవిష్యత్‌కు నాంది కావాలి. 'వెనక్కి రండి.. భారత్‌ను నిర్మిద్దాం'' అని శ్రీధర్ వెంబు భారతీయులకు పిలుపునిచ్చారు. విదేశీ ఉద్యోగులకు శాశ్వత నివాస హోదా (గ్రీన్‌కార్డ్) కల్పించేందుకు ఉద్దేశించిన PERM వ్యవస్థను కొన్ని కంపెనీలు దుర్వినియోగం చేశాయని ఆరోపిస్తూ అమెరికా కార్మిక శాఖ 8 కంపెనీలపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ సస్పెన్షన్ అమల్లో ఉన్నంత కాలం ఆయా కంపెనీల నుంచి కొత్త దరఖాస్తులను స్వీకరించబోమని, పెండింగ్‌లో ఉన్నవాటిని కూడా నిలిపివేస్తున్నామని ట్రంప్ సర్కారు స్పష్టం చేసింది. దీనివల్ల ప్రస్తుతం హెచ్ 1–బీ వీసాలు రద్దు కానప్పటికీ.. శాశ్వత నివాసం ఏర్పరుచుకోవాలని కలలు కనేవారికి ఇది గట్టి ఎదురుదెబ్బ కానుంది.

## ఆర్థిక లక్ష్యాలకు 'వైవర్ ఆఫ్ ప్రీమియం' రక్షణ!

సాధారణంగా ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆర్థిక ప్రణాళికలు వేసుకుంటారు. ఉద్యోగం క్రమంగా సాగుతుందని, జీతాలు వస్తూనే ఉంటాయని, తద్వారా పిల్లల చదువులు లేదా రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు కొనసాగించవచ్చని భావిస్తారు. కానీ, జీవితం ఎప్పుడూ ఒకేలా సాగదు. ఒకే వ్యక్తి సంపాదనపై ఆధారపడిన కుటుంబంలో, ఆ వ్యక్తి అకాల మరణం చెందితే కేవలం ఆదాయం కోల్పోవడమే కాకుండా, వారు అనుకున్న దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలు కూడా ప్రమాదంలో పడతాయి.దీనిపై పాలసీబజార్.కామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వివేక్ జైన్ మాట్లాడుతూ.. "కుటుంబంలో సంపాదించే ఏకైక వ్యక్తి అకస్మాత్తుగా మరణిస్తే, వారు నిర్దేశించుకున్న పెద్ద పెద్ద ఆర్థిక లక్ష్యాలు అర్ధాంతరంగా ఆగిపోతాయి. ఉదాహరణకు 20 ఏళ్లలో రూ. 1 కోటి కార్పస్ (నిధి) సమకూర్చుకోవాలని పెట్టుబడి ప్రారంభించి, కొన్నేళ్లకే ప్రీమియంలు ఆగిపోతే ఆ లక్ష్యం నెరవేరదు. ఇలాంటి చోటే 'వైవర్ ఆఫ్ ప్రీమియం' (WOP) కీలక పాత్ర పోషిస్తుంది. పాలసీదారుడు మరణించినా, మిగిలిన భవిష్యత్తు ప్రీమియంలను ఇన్సూరెన్స్ కంపెనీయే చెల్లించి, ఆ పెట్టుబడి లక్ష్యాన్ని అనుకున్నట్లుగా పూర్తి చేస్తుంది" అని వివరించారు.రాజేష్ ఉదాహరణతో పరిశీలిస్తే..మహారాష్ట్రకు చెందిన 35 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాజేష్ తన బిడ్డ ఉన్నత చదువుల కోసం నెలకు రూ. 10,000 చొప్పున 20 ఏళ్ల పాటు సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (SIP) ద్వారా పెట్టుబడి పెట్టడం ప్రారంభించాడు. 15% వార్షిక వృద్ధి రేటు (CAGR) లెక్కన 20 ఏళ్లలో దాదాపు రూ. 1 కోటి నిధిని సమకూర్చడం అతని లక్ష్యం.అయితే, ఒకవేళ కేవలం ఒక సంవత్సరం పెట్టుబడి (రూ.1.2 లక్షలు) పెట్టిన తర్వాత రాజేష్ అకస్మాత్తుగా మరణిస్తే ఏం జరుగుతుందో చూద్దాం: సాధారణ యూలిప్ (WOP లేకపోతే): రాజేష్ కుటుంబానికి కేవలం రూ.12 లక్షల లైఫ్ కవర్ (డెత్ బెనిఫిట్) అందించి పాలసీని క్లోజ్ చేస్తారు. ఆ తర్వాత కుటుంబం సొంతంగా పెట్టుబడి పెట్టలేకపోతే, పిల్లల చదువుల కోసం కేవలం ఆ రూ.12 లక్షలు మాత్రమే మిగులుతాయి. దీనివల్ల అసలు లక్ష్యమైన రూ. 1 కోటికి ఆ కుటుంబం చాలా దూరంగా ఉండిపోతుంది. WOP ఫీచర్ ఉన్న యూలిప్ ద్వారా లభించే ప్రయోజనాలు:1. తక్షణ లంప్‌సమ్ మొత్తం: పాలసీదారుడు మరణించిన వెంటనే వార్షిక ప్రీమియంకు 10 రెట్లు (అంటే రూ. 12 లక్షలు) తక్షణ కుటుంబ ఖర్చుల కోసం అందిస్తారు. 2. రెగ్యులర్ ఆదాయం: కుటుంబ రోజువారీ అవసరాల కోసం మిగిలిన 19 ఏళ్ల పాటు ప్రతి ఏటా రూ. 1.2 లక్షల చొప్పున (మొత్తం రూ. 22.8 లక్షలు) రెగ్యులర్ ఇన్‌కమ్ లభిస్తుంది. 3. ఆగని పెట్టుబడి (మెచ్యూరిటీ బెనిఫిట్): అన్నింటికంటే ముఖ్యంగా, మిగిలిన అన్ని ప్రీమియంలను రాజేష్ తరఫున ఇన్సూరెన్స్ కంపెనీయే చెల్లిస్తుంది. దీనివల్ల మార్కెట్లో ఆ పెట్టుబడి అలాగే కొనసాగి, 20 ఏళ్ల టెర్మ్ ముగిసేసరికి బిడ్డ పీజీ చదువుల నాటికి అనుకున్న రూ. 1 కోటి కార్పస్ పూర్తిగా చేతికి అందుతుంది. ఆర్థిక కొనసాగింపునకు ఏకైక మార్గం:చివరగా చెప్పాలంటే, ఆర్థిక ప్రణాళిక అంటే కేవలం ఒక నిధిని సృష్టించడం మాత్రమే కాదు... ఏవైనా ఊహించని అవాంతరాలు ఎదురైనా ఆ ప్లాన్ మధ్యలో ముక్కలు కాకుండా చూసుకోవడం.

# ఐటీ కంపెనీలకు అమెరికా షాక్..
# ఆ రెండింటినీ కలిపిచూడొద్దన్న నాస్కామ్

హెచ్–1బీ వీసా ఉద్యోగులకు గ్రీన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కంపెనీలను అనుమతించే 'పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ (పర్మ్)' నుంచి సస్పెండ్ చేస్తూ టీసీఎస్, ఇన్ఫోసిస్ సహా 8 కంపెనీలకు ట్రంప్ సర్కార్ షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై నాస్కామ్ (Nasscom) స్పందించింది. ఇమిగ్రేషన్ (శాశ్వత నివాసం), నైపుణ్యం కలిగిన ఉద్యోగుల బదిలీని వేర్వేరుగా చూడాలని.. రెండూ భిన్నమైన విషయాలని వెల్లడించింది. 'పర్మ్ కార్యక్రమం కింద కొత్త దరఖాస్తులను దాఖలు చేసే వీలులేకుండా.. అమెరికాలో పనిచేస్తున్న భారత ఐటీ కంపెనీలు సహా మరికొన్నింటిపై సస్పెన్షన్ విధించింది. ఈ నిర్ణయంతో అమెరికాలో పనిచేసేందుకు వీలున్న అవకాశాలపై ప్రభావం పడుతుంది. అయితే ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. వలసలు, నైపుణ్యం కలిగిన ఉద్యోగుల బదిలీ రెండు వేర్వేరు విషయాలు. వాటిని ఒకే కోణంలో చూడొద్దు. ఇదే విషయాన్ని మేం ఎప్పటినుంచో చెబుతూ వస్తున్నాం. అమెరికాలో స్వల్పకాలిక నైపుణ్యాల కొరతను తీర్చడంలో హెచ్–1బీ వీసా కార్యక్రమం (H–1B visa) కీలక పాత్ర పోషిస్తోంది. భవిష్యత్తులో కూడా స్వల్పకాలంలో ప్రతిభావంతుల కొరత తీర్చేలా ఇది కొనసాగుతుంది.




మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ సహా.. 8 ఐటీ కంపెనీలకు ట్రంప్ షాక్ అయితే.. కొన్నేళ్లుగా భారత టెక్ కంపెనీలు హెచ్–1బీ వీసా (Visa) పై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించుకుంటున్నాయి. అదే సమయంలో స్థానికంగా నియామకాలు చేపడుతున్నాయి. స్థానికంగా ఉద్యోగాలు సృష్టిస్తున్నాయి. ఈ కారణంగా పర్మ్ ప్రక్రియతో హెచ్–1బీ వీసాల నుంచి శాశ్వత నివాసానికి మారే ఉద్యోగుల సంఖ్య పరిమితంగానే ఉంది. భారత టెక్ కంపెనీలు 80కిపైగా దేశాల్లో స్థానిక చట్టాలకు కట్టుబడి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. యూఎస్‌లో కూడా ఈ పరిస్థితిని నిబంధనల ప్రకారం ఎదుర్కొంటాయని విశ్వసిస్తున్నాం'' అని నాస్కామ్ పేర్కొంది.

# క్రీడలు

## 500 ఛేదన చూస్తామేమో!



పరిమిత ఓవర్ల క్రికెట్లో ఇప్పుడు భారీ స్కోర్లు నమోదవుతుండటం చూస్తూనే ఉన్నాం. బ్యాటర్లు తొలి బంతి నుంచే సిక్సర్లు బాదడానికే మొగ్గు చూపుతుండటం ఆస్వాదిస్తున్నాం. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో వన్డేల్లో 500 పైచిలుకు లక్ష్య ఛేదనలను చూస్తామేమోనని వెస్టిండీస్ మాజీ క్రికెటర్ డ్వేన్ బ్రావో అభిప్రాయపడ్డాడు. క్రికెట్లో బ్యాటర్ల ఆధిపత్యం పెరుగుతున్న తరుణంలో అందుకు అనుగుణంగా బౌలర్లు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని బ్రావో సూచించాడు. వెస్టిండీస్‌కే చెందిన మరో మాజీ క్రికెటర్ క్రిస్ గేల్‌తో చర్చిస్తూ అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు. ''ఈ రోజుల్లో బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నారు. బంతిని తెలివిగా వేయకపోతే శిక్షించేందుకు బ్యాటర్లు సిద్ధంగా ఉన్నారు. వారిని కట్టడి చేసేందుకు బౌలర్లు వినూత్నంగా ఆలోచించకపోతే కష్టం'' అని బ్రావో పేర్కొన్నాడు. గేల్ మాట్లాడుతూ.. ''ఆట మారిపోయింది. కొత్త తరం ఆటగాళ్లు భయం లేకుండా ఆడుతున్నారు. తొలి బంతి నుంచే బాదుడు మొదలుపెడుతున్నారు.

## కోహ్లీ ఇప్పటి ఫామ్.. అత్యంత ప్రమాదకరం: ఏబీడీ ఆసక్తికర వ్యాఖ్యలు





టీమ్ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఆడుతున్నది ఒక్క ఫార్మాటే. దానికి కూడా త్వరలోనే వీడ్కోలు పలికేస్తాడంటూ ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ.. ఇటీవల శతకంతో రిటైర్మెంట్ వార్తలకు చెక్ పెట్టాడు కింగ్. ఈ మధ్య భీకర ఫామ్‌తో దూసుకుపోతున్న కోహ్లీపై తన స్నేహితుడు, దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజం ఏబీ డివిలియర్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. విరాట్ ప్రస్తుత ఫామ్ అత్యంత ప్రమాదకరమని అన్నాడు. అతడిలో ఎవరికీ తెలియని మరో కోణం ఉందన్నాడు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోహ్లీ గురించి ఏబీడీ మాట్లాడాడు. 2016 నాటితో పోలిస్తే ఇప్పుడు విరాట్‌లో వచ్చిన మార్పులను ప్రస్తావించాడు. ఆ విషయాలను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ తమ వెబ్‌సైట్‌లో పంచుకుంది. ''నాకు తెలిసి కోహ్లీ ఇప్పుడు గతంలో కంటే చాలా మెరుగ్గా ఆడుతున్నాడు. ఎందుకంటే అతడు ఇప్పుడు స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఉన్నాడు. గతేడాది జరిగిన ఐసీసీ ఛాంపియన్స్‌ట్రోఫీ తర్వాత నుంచే ఈ మార్పు నేను గమనిస్తున్నా. విరాట్‌లో ప్రజలకు, అభిమానులకు తెలియని మరో కోణం ఉంది. ఇప్పుడా కోణం మరింతగా బయటకు వస్తోంది. మైదానంలో తన అత్యుత్తమ టాలెంట్‌ను ప్రదర్శించి.. ప్రపంచవ్యాప్తంగా అభిమానులను మరింత అలరించాలనే విషయం అతడికి అర్థమైంది. అది చివరిసారి కావొచ్చు..! మరో రెండేళ్లు లేదంటే ఐదేళ్లు కావొచ్చు..!'' అని ఏబీడీ వ్యాఖ్యానించాడు.

''అతడు ఎంతకాలం ఆడుతాడో నాకు తెలియదు. కానీ, ఇప్పుడు మరింత ప్రమాదకారిగా మారాడన్నది మాత్రం అర్థమైంది. విరాట్ దూకుడుగా ఆడితే అతడిని అడ్డుకోవడం అసాధ్యం. ఇదిలాగే కొనసాగితే.. 2027 వరల్డ్ కప్‌లో టీమ్ఇండియాపై అతడు భారీ ప్రభావమే చూపించగలడు. విరాట్‌తో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం యువ ఆటగాళ్లకు అత్యుత్తమ అవకాశం. అతడి నుంచి వారు ఎంతో నేర్చుకోవచ్చు'' అని డివిలియర్స్ వివరించాడు.

## పదేళ్ల తర్వాత రీఎంట్రీ.. డకౌట్‌తో ఆసీస్ ఓపెనర్ చెత్త రికార్డు




దాదాపు పదేళ్ల తర్వాత జాతీయ జట్టులోకి పునరాగమనం చేసిన ఆస్ట్రేలియా ఓపెనర్ నిక్ మాడిసన్ ఓ చెత్త రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో 33 బంతులు ఆడిన మాడిసన్ పరుగుల ఖాతా కూడా తెరవలేదు. అత్యధిక బంతులు ఎదుర్కొని డకౌట్ అయిన ఆసీస్ ఓపెనర్‌గా నిలిచాడు. 21వ శతాబ్దంలోనే అత్యంత చెత్త రికార్డును నమోదు చేశాడు. 2016లో దక్షిణాఫ్రికాపైనే అరంగేట్రం చేసిన అతడు.. అదే ఏడాది పాకిస్థాన్‌తో తన చివరి టెస్టును ఆడాడు. అప్పట్నుంచి అతడికి అవకాశాలే రాలేదు. ఇప్పుడు పునరాగమనం కూడా సఫారీ జట్టుపైనే కావడం గమనార్హం. ఇప్పటి వరకు నాలుగు టెస్టుల్లో 27 పరుగులు మాత్రమే చేశాడు. టెస్టు చరిత్రలో తొలిసారి ఆస్ట్రేలియా ఓ టెస్టులో 30+ వయసు కలిగిన ప్లేయర్లతో బరిలోకి దిగింది. నాథన్ లయన్ (38) అందరికంటే ఎక్కువ వయస్కుడు కావడం గమనార్హం. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా (SA vs AUS) బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ నిర్ణయం పెద్ద తప్పు అని ఆసీస్ బ్యాటింగ్‌ను చూస్తే అర్థమవుతోంది. టాప్ ఆర్డర్ విఫలం కావడంతో వందలోపే కీలకమైన నాలుగు వికెట్లను చేజార్చుకుంది. ఓపెనర్లు నిక్ మాడిసన్ (0) డకౌట్ కాగా.. ట్రావిస్ హెడ్ (9) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. మార్నస్ లబుషేన్ (37), స్టీవ్ స్మిత్ (25) ఆదుకొనేందుకు ప్రయత్నించినా స్వల్ప వ్యవధిలో వారిద్దరూ పెవిలియన్‌కు చేరారు.

## జైస్వాల్ కొత్తగా వికెట్‌కీపింగ్..

టీమ్ఇండియా బ్యాటర్ యశస్వి జైస్వాల్ వికెట్‌కీపింగ్ కూడా సాధన చేస్తున్నాడని ముంబయి కెప్టెన్ సిద్దేశ్ లాడ్ చెప్పాడు. ''యశస్వి వికెట్‌కీపింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. అతడు ముంబయి లేదా భారత జట్టు తరఫున వికెట్‌కీపింగ్ చేయాలనుకుంటున్నాడు. అదే ఇప్పుడు అతడి లక్ష్యమని నాకు అనిపిస్తోంది. అయితే దీనిపై నాకు ఇంకా స్పష్టత రాలేదు'' అని లాడ్ విలేకర్లతో చెప్పాడు. 24 ఏళ్ల జైస్వాల్.. లెగ్‌స్పిన్ కూడా ప్రాక్టీస్ చేస్తున్నాడని అతడు తెలిపాడు. 2026–27 రంజీ సీజన్ నేపథ్యంలో ముంబయి ప్రాక్టీస్ మ్యాచ్ సందర్భంగా జైస్వాల్ దాదాపు 10 ఓవర్ల పాటు వికెట్‌కీపింగ్ చేశాడు. దానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.




## బుమ్రాను వద్దనుకుంది.. నా మాట వినుంటే ఐదు కప్పులు ఆర్సీబీవే: పార్థివ్

ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండు సార్లు విజేతగా నిలిచింది. కానీ, తన సలహాను పాటించి ఉంటే ఇప్పటికే ఐదు కప్పులను సొంతం చేసుకొని ఉండేదని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ పార్థివ్ పటేల్ వ్యాఖ్యానించాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పార్థివ్ 2014 వేలం సమయంలో ఏం జరిగిందో వెల్లడించాడు. జస్‌ప్రీత్ బుమ్రాను తీసుకొనే అవకాశం వద్దనుకొని భారీ మూల్యం చెల్లించుకున్నట్లు పేర్కొన్నాడు. '2014 మెగా వేలంలో నన్ను తొలి రోజే లంచ్ బ్రేక్‌కు ముందే జట్టులోకి తీసుకున్నారు. ఆర్సీబీ నుంచి నాకు మెసేజ్ వచ్చింది. అప్పుడు మేనేజ్‌మెంట్ దృష్టికి ఓ విషయం తీసుకొచ్చా. ఓ అద్భుతమైన ప్లేయర్ ఉన్నాడు. అతడిని తీసుకొనేందుకు చూడండి అని చెప్పా. అయితే, వారికి నేను చెప్పిన విధానం సరిగా అనిపించలేదేమో.. బుమ్రాలాంటి బౌలర్ ఏం చేస్తారు? అన్నట్లుగా వారి సమాధానం ఉంది. ఇదే విషయాన్ని నేను ఓ బ్రాడ్‌కాస్ట్‌లో మాట్లాడా. అయితే, నేను అలా మాట్లాడి ఉండాల్సింది కాదు. ఆ తర్వాత 'ఎక్స్'లోనూ స్పందించా. నేను అలా చేసి ఉండకూడదు. ఆ దశలో బుమ్రాను కొనుగోలు చేయడం సరైన నిర్ణయం అవుతుందని ఆర్సీబీ భావించలేదు. నా వ్యాఖ్యలు వైరల్ కావడంతో.. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు కొందరు తమకు నచ్చిన విధంగా అపార్థాలను అంటగట్టారు'' అని పార్థివ్ తెలిపాడు.



# ఫౌజీ అప్పుడొస్తే.. మరి స్పిరిట్ ఎప్పుడు?





వుదయం సినిమా: ప్రస్తుతం ప్రభాస్ ఫౌజీ షూటింగ్ లో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. ఆ సినిమా కోసం ఆయన ఇంకా దాదాపు 25 రోజుల పాటు షూటింగ్ లో పాల్గొనాల్సి ఉందట.రెబల్ స్టార్ ప్రభాస్ లైనప్ లో ఇప్పుడు భారీ సినిమాలు ఉన్న విషయం తెలిసిందే. అందులో ఒకటి హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఫౌజీ కాగా.. మరొకటి సందీప్ రెడ్డి వంగా రూపొందిస్తున్న స్పిరిట్. ఆ రెండు సినిమాలపై ఫ్యాన్స్ లో ఓ రేంజ్ లో అంచనాలు ఉన్నాయి. అయితే వీటి రిలీజ్ డేట్స్ విషయంలో ఇప్పుడు ఇంట్రెస్టింగ్ డిబేట్ నడుస్తోంది. ఫౌజీ ముందుగా వస్తుందా, స్పిరిట్ అనుకున్న సమయానికి థియేటర్లలోకి వస్తుందా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.ప్రస్తుతం ప్రభాస్ ఫౌజీ షూటింగ్ లో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది. ఆ సినిమా కోసం ఆయన ఇంకా దాదాపు 25 రోజుల పాటు షూటింగ్ లో పాల్గొనాల్సి ఉందట. డిసెంబర్ మొదటి వారానికి తన షూటింగ్ పార్ట్ ను పూర్తి చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఆ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో ఇమాన్వి హీరోయిన్ గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఆ సినిమాపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది.ప్రభాస్ పుట్టిన రోజైన అక్టోబర్ 23న టీజర్ విడుదల కానుందనే ప్రచారం అభిమానుల్లో జోష్ పెంచుతోంది.

## వుదయం సినిమా MOVIE TIME!

# ఆ సూపర్ ఛాన్స్ వదులుకుంటే మాత్రం...



వుదయం సినిమా: దానికి తోడు రెడ్ జెయింట్ మూవీస్ కు కోలీవుడ్ ఇండస్ట్రీలో మంచి పేరు ఉంది. పెద్ద హీరోల సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో ఆ బ్యానర్ మెయిన్ గా వ్యవహరిస్తుంటుంది.కొన్ని సినిమాలు హిట్ అయితే నిర్మాతలకు లాభాలు వస్తాయి. కానీ కొన్ని సినిమాల పేర్లు వినగానే బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సందడి ఉంటుందో అంచనా వేయొచ్చు. ఇప్పుడు స్టార్ హీరోలు రజినీకాంత్, కమల్ హాసన్ కలిసి నటించనున్న మల్టీస్టారర్ కూడా ఆ లిస్ట్ లోకి వస్తుంది. దాదాపు 50 ఏళ్ల తర్వాత ఆ ఇద్దరూ ఒకే మూవీలో కనిపిస్తుండడంతో ఆ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఆ ప్రాజెక్టును ముందుకు రెడ్ జెయింట్ మూవీస్ గ్రాండ్ గా ప్రొడ్యూస్ చేస్తున్నట్లు అనౌన్స్ చేసింది. అయితే ఇప్పుడు ఆ సినిమా నిర్మాణ బాధ్యతలు కమల్ హాసన్ కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ చేతికి వెళ్లవచ్చనే ప్రచారం జరుగుతోంది.

# 'భోగి' మ్యూజికల్ జర్నీ ప్రారంభం..



వుదయం సినిమా: చార్మింగ్ స్టార్ శర్వా 'భోగి' చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామాను శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తుండగా, లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా ప్రమోషన్స్ ఇటీవల విడుదలైన టీజర్‌తో ప్రారంభమయ్యాయి. టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. 'భోగి' మ్యూజికల్ ప్రమోషన్స్ తాజాగా 'ఏగిలివారంగ' పాట విడుదలతో ప్రారంభమయ్యాయి. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించే ఈ జానపద గీతం సినిమా నేపథ్యాన్ని అద్భుతంగా పరిచయం చేస్తోంది. మట్టి వాసనతో కూడిన జానపద పాటలను రూపొందించడంలో తన ప్రత్యేకతను చాటుకున్న భీమ్స్ సిసిరోలియో ఈ పాటకు అందమైన బాణీని అందించారు. విభిన్నమైన సంగీత ప్రయోగాలతో సాగిన ఈ పాట అందరినీ ఆకట్టుకుంది.1960ల కాలంలో మహారాష్ట్ర–ఆదిలాబాద్ సరిహద్దులోని బొగ్గుల గుట్ట గ్రామం నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. అప్పటి పల్లె జీవనాన్ని సహజంగా ఆవిష్కరిస్తూ, ఆ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, కులవృత్తులు, గ్రామస్థుల జీవితాలపై పెత్తనం చెలాయించిన స్థానిక భూస్వాముల ప్రభావాన్ని ఈ పాటలో చూపించారు. ఆస్కార్ అవార్డు విజేత చంద్రబోస్ తెలంగాణ సహజమైన మాండలికంలో రాసిన సాహిత్యం ఈ వాస్తవాలను కళ్లకు కట్టినట్లు ఆవిష్కరిస్తుంది. గ్రామంలోని సామాజిక వ్యవస్థ, ప్రజల నిత్యజీవిత అనుభవాలను ఎలాంటి ఆర్భాటాలు లేకుండా, సహజంగా, వాస్తవికంగా తన సాహిత్యంలో ప్రతిబింబించారు.నల్గొండ గద్దర్ నర్సన్న తన వాయిస్ తో పాటకు ప్రాణం పోశారు. తన ప్రత్యేకమైన పల్లె గొంతుతో పాటకు మరింత సహజత్వాన్ని తీసుకొచ్చారు. ఆయనతో పాటు నర్సిరెడ్డి, కందుకూరి శంకర్ బాబు, రిలారే గోపాల్ పాటకు మరింత పల్లె పరిమళాన్ని అద్దారు.పాటలోని సంగీతం, సాహిత్యంలోని గొప్పదనానికి విజువల్స్ కూడా చక్కగా తోడయ్యాయి. అప్పటి గ్రామీణ వాతావరణాన్ని, పల్లె జీవనశైలిని సహజంగా రీ క్రియేట్ చేశారు. శర్వా, అనుపమ పరమేశ్వరన్ తమ పల్లెటూరి పాత్రల్లో ఎంతో సహజంగా కనిపిస్తూ, సినిమా నేపథ్యానికి చక్కగా సరిపోయారు. గ్రామాన్ని, అక్కడి ప్రజల జీవన విధానాన్ని చూపించడంలో తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ పాటకు మరింత లోతును తీసుకొచ్చింది.దర్శకుడు సంపత్ నంది తన స్టోరీ టెల్లింగ్ తో అద్భుతంగాఆకట్టుకున్నారు. ఆ ప్రాంత సంప్రదాయాలు, సామాజిక వాస్తవాలు, ప్రత్యేకమైన జీవనశైలిని ఎంతో సహజంగా తెరపై ఆవిష్కరించారు.

# 'సీన్' మ్యూజికల్ జర్నీ షురూ



వుదయం సినిమా: హీరో సూర్య, మలయాళ బ్లాక్‌బస్టర్ 'ఆవేశం' ఫేమ్ దర్శకుడు జిత్తు మాధవన్‌తో కలసి యాక్షన్–కామెడీ ఎంటర్‌టైనర్ 'సీన్' చేస్తున్నారు. నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆనంద్ రాజ్, లాల్, రాజ్ ప్రియన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జ్యోతిక, సూర్య జాగరం స్టూడియోస్, 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జయశ్రీ దామోదరన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మేకర్స్ టైటిల్ టీజర్‌ను విడుదల చేసి సినిమాలోని క్విర్కీ, ఎంటర్‌టైనింగ్ ప్రపంచాన్ని పరిచయం చేశారు.ఇప్పుడు మ్యూజికల్ జర్నీని ఫస్ట్ సింగిల్ 'అమ్మో ఇది ఎవర్రా'తో ప్రారంభించారు. సుశిన్ శ్యామ్ కంపోజ్ చేసిన ఈ పాట ఫుట్‌ట్యాపింగ్ బీట్స్, వెంటనే ఆకట్టుకునే రిథమ్‌తో అదిరిపోయే ఎనర్జీని అందిస్తోంది. పాటలోని వైబ్రెంట్ మూడ్‌కు తగ్గట్టుగా ఈ అప్‌బీట్ కంపోజిషన్ ఆకట్టుకుంది. రాకేందు మౌళి అందించిన లిరిక్స్ నజ్రియా నజీమ్ పాత్రలోని అగ్రెసివ్, ఎనర్జిటిక్ నేచర్‌ను ప్రజెంట్ చ్సునాయి. సింగర్ వినాయక్ తన లైవ్లీ, ఎనర్జిటిక్ వోకల్స్‌తో పాటకు మరింత ఎనర్జీతీసుకొచ్చారు.వీడియో గేమ్ కాన్సెప్ట్ చుట్టూ ఈ పాటను క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. కొరియోగ్రాఫర్ రాజ్ ప్రియన్ ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ యూనిక్ ఐడియా పాటకు ప్లేఫుల్ టచ్‌ను తీసుకొచ్చింది. ఫన్, క్విర్కీ ఎలిమెంట్స్‌తో పాటను ఆస... క్తికరంగా ప్రెజెంట్ చేశారు. ముఖ్యంగా నజ్రియా నజీమ్ పాటంతా ఫుల్ ఎనర్జీ, ఉత్సాహంతో కనిపించారు. 'అమ్మో ఇది ఎవర్రా' పాట అదిరిపోయేలా ఉండటంతో 'సీన్' మ్యూజికల్ ప్రమోషన్స్‌కు ఇది మంచి ఆరంభంగా నిలిచింది.వినీత్ అగస్టిన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సుశిన్ శ్యామ్ సంగీతం సమకూరుస్తున్నారు. అజ్మల్ సాబు ఎడిటింగ్, అశ్విని కాలే ప్రొడక్షన్ డిజైన్.'సీన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 నవంబర్ 6న దీపావళి కానుకగా థియేటర్లలో విడుదల కానుంది.

# 'సినీ ఇండస్ట్రీలో మాఫియా రాజ్యమేలుతోంది..



వుదయం సినిమా: తెలుగు సినీ పరిశ్రమలో చిన్న సినిమాల పరిస్థితిపై హీరో, మూవీ మేకర్ షిరాజ్ మెహదీ సంచలన ఆరోపణలు చేశారు. ఇండస్ట్రీలో మాఫియా తరహా వ్యవస్థ నడుస్తోందని, చిన్న నిర్మాతలు, దర్శకులు అడుగడుగునా మోసం, దోపిడీ, వివక్షను ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. తాను నిర్మించి, హీరోగా నటించిన 'ఓ అందాల రాక్షసీ' చిత్రానికి థియేటర్లు కేటాయించడంలో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు బెదిరింపులు వస్తున్నాయని, అయినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని షిరాజ్ మెహదీ స్పష్టం చేశారు.హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో షిరాజ్ మెహదీ మాట్లాడుతూ.. ...న సినిమాను మంచి సాంకేతిక నిపుణు...తో, ఎంతో కష్టపడి నిర్మించామని తెలిపారు. సరైన స్థాయిలో థియేటర్లు లభించి సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తే రికార్డులు సృష్టించే సత్తా తన చిత్రానికి ఉందని ధీమా వ్యక్తం చేశారు. 'చిన్న సినిమాలను తొక్కిపెడుతున్నారు'సినిమా విడుదలకు థియేటర్లు దొరకడం చిన్న నిర్మాతలకు అతిపెద్ద సమస్యగా మారిందని షిరాజ్ మెహదీ ఆరోపించారు. పెద్ద సినిమాలకు ప్రాధాన్యత ఇస్తూ చిన్న చిత్రాలను పక్కన పెడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే 40కి పైగా ప్రెస్‌మీట్లు, 50కి పైగా ఇంటర్వ్యూలు ఇచ్చినట్లు తెలిపారు. 'క్యూబ్, యూఎఫ్ఓ పేరుతో దోపిడీ'డిజిటల్ ప్రొజెక్షన్, ఇతర విడుదల ప్రక్రియల పేరుతో చిన్న నిర్మాతలపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని షిరాజ్ ఆరోపించారు. క్యూబ్, యూఎఫ్ఓ వంటి డిజిటల్ ప్రొవైడర్లపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు.వారానికి సుమారు రూ.2,000లో పూర్తయ్యే పనికి ఒక్కో థియేటర్ నుంచి రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానం వల్ల ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్న నిర్మాతలు మరింత నష్టపోతున్నారని అన్నారు.

# "ప్రేమనే ఊరిలో.." సినిమా గ్రాండ్ థాంక్స్ మీట్

వుదయం సినిమా: మనోజ్ కుమార్ దర్శకత్వంలో మహారత్న ప్రొడక్షన్స్, ఎస్.కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా నిర్మించిన సినిమా 'ప్రేమనే ఊరిలో'. ఈ చిత్రంలో శ్రీ రామ్, రామికా శివ, తపస్విని పూణచ్చ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో సూపర్ హిట్ టాక్ తో సక్సెస్ ఫుల్ గా ప్రదర్శితమవుతోంది.



ఈ నేపథ్యంలో 'ప్రేమనే ఊరిలో' సినిమా గ్రాండ్ సక్సెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైలాగ్ కింగ్ సాయికుమార్ అతిథిగా పాల్గొన్నారు.డైలాగ్ కింగ్ సాయికుమార్ మాట్లాడుతూ – "ప్రేమనే ఊరిలో.." ఆల్రెడీ ప్రూవ్డ్ ఫిలిం. ఇప్పటికే మంచి విజయం సాధించింది. ఇది ప్రతి ఒక్కరూ ప్రేమించే సినిమా, ఎక్స్‌పీరియన్స్ చేసే సినిమా. మన సినిమా. మన మట్టి సినిమా. మన ఊరి సినిమా. నేను త్వరలోనే ఈ సినిమాను థియేటర్స్ లో మీతో పాటే కలిసి చూస్తాను. ఈ సినిమాను మీరంతా తప్పకుండా ఆదరిస్తారని తెలుసు. ఈ చిత్రంలో ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలు ఉన్నాయి. ఒక చెట్టు గురించి కూడా మంచి మెసేజ్ ఇచ్చారు. ఆర్టిస్టులంతా బ్యూటిఫుల్ పర్ ఫార్మెన్స్ లు ఇచ్చారు. కథలో మంచి ఎమోషన్ ఉంది. రైతు గొప్పదనం గురించి చెప్పారు. ఒక్కటని కాదు మనల్ని ఆకట్టుకునే ఎన్నో అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. ఈ సినిమా మనందరినీ కదిలిస్తుంది. మన ప్రేక్షకులంతా థియేటర్స్ కు వచ్చి చూసి ఆదరించాలని కోరుకుంటున్నా. ఈ సినిమాను మీరంతా పెద్ద బ్లాక్ బస్టర్ చేయాలి. అన్నారు.హీరో శ్రీరామ్ మాట్లాడుతూ – మా "ప్రేమనే ఊరిలో.." సినిమాకు సాయికుమార్ గారు లాంటి పెద్దల ఆశీర్వాదాలు దక్కడం చాలా సంతోషంగా ఉంది. ఆయన మా గురించి చెప్పిన ప్రతి మాటను మనసులో చిరకాలం దాచుకుంటాం. సాయికుమార్ గారి లాంటి గొప్ప ఆరిసుల స్తూరి మాపె

# ఫ్యామిలీ ఎంటర్ టైనర్ "క్రేజీ కల్యాణం"

వుదయం సినిమా: మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ కథతో "క్రేజీ కల్యాణం" సినిమాను నిర్మించాం. మా సినిమాను ఈ నెల 30న రిలీజ్ చేయాలని అనుకున్నాం. అయితే వెంకటేష్ గారి ఆదర్శ కుటుంబం సినిమా రిలీజ్ పోస్ట్ పోన్ కావడంతో మా టీమ్ అందరూ పండుగకు రిలీజ్ చేయండి అని సూచించారు. మా సినిమా కూడా మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ కాబట్టి పండుగకు బాగుంటుంది రిలీజ్ చేస్తే అని భావించి ఈ నెల 16నే రిలీజ్ కు తీసుకొస్తున్నాం. – మా మూవీ కంటెంట్ మీద మాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ స్క్రిప్ట్ ఎవరు విన్నా ఇష్టపడ్డారు. అనుపమ, నరేష్ గారు, తరుణ్ భాస్కర్, అఖిల్ ..ఇలా అందరూ కథ చాలా బాగుందని చెప్పారు. మాకు స్క్రిప్ట్ మీద ఉన్న నమ్మకం, వాళ్లు ఇచ్చిన రెస్పాన్స్ తో మరింత కాన్ఫిడెన్స్ పెరిగింది. ఈ నెల 16న రిలీజ్ కాబట్టి అనుపమ, నరేష్ గారు, తరుణ్ భాస్కర్..ఇలా ప్రతి ఆర్టిస్ట్ బ్యాలెన్స్ షూట్ కోసం సపోర్ట్ చేస్తున్నారు. వాళ్లందరికీ సినిమా మీద గట్టి నమ్మకం ఉంది. మిగిలిన వర్క్ కంప్లీట్ చేసి రిలీజ్ కు తీసుకొస్తాం. – నేను యాడ్ బిజినెస్ లో ఉన్నాను. ప్రభుత్వ యాడ్స్, డాక్యుమెంటరీస్, ఇతర కంపెనీల యాడ్స్ చేస్తుంటాను. డైరెక్టర్ బద్రప్ప నాతో చాలా ఏళ్లుగా ట్రావెల్ చేస్తున్నారు. నాకు సినిమా ఇండస్ట్రీ అంటే ఇష్టం, ఆయనకు కూడా ప్యాషన్. కథల గురించి మా మధ్య డిస్కషన్స్ జరుగుతుండేవి. ఆ క్రమంలో ఈ కథ బద్రప్ప చెప్పగానే చాలా బాగుంటుం...



ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి

# డిసెంబర్ 4న 'అలియాస్ రుక్మిణి'

వుదయం సినిమా: బ్లాక్‌బస్టర్ సక్సెస్ 'కోర్ట్ – స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' తర్వాత న్యాచురల్ స్టార్ నాని యునానిమస్ ప్రొడక్షన్స్ మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో రాబోతోంది. 'అలియాస్ రుక్మిణి' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నితిన్ హీరోగా నటిస్తుండగా, 'దండోరా' ఫేమ్ మురళీ కాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్న 'అలియాస్ రుక్మిణి' ఒక విలక్షణమైన కథనంతో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రాన్ని పూర్తి చేయడానికి కేవలం ఒక షెడ్యూల్ మాత్రమే మిగిలి ఉంది.శరవేగంగా షూటింగ్ జరుగుతుండటంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మేకర్స్ సినిమా ప్రపంచవ్యాప్త థియేట్రికల్ రిలీజ్‌కు డిసెంబర్ 4వ తేదీని ఖరారు చేశారు.రిలీజ్ డేట్ పోస్టర్‌లో నితిన్ ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తిగా కనిపిస్తున్నారు. చెక్స్ షర్ట్, ఫార్మల్ ట్రౌజర్స్, కళ్లద్దాలు ధరించి, భుజానికి బ్యాగ్ తగిలించుకుని కోర్టు ప్రాంగణంలో జనాల మధ్య నిలబడి ఉన్నారు. వెనుకవైపు న్యాయవాదులు. పోలీసులు కనిపిస్తు... త... పాటు ఏదో కొత్త ప... స్థితిని ఎదుర్కొంటున్న వ్యక్తిలా కనిపించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరోవైపు హీరోయిన్ సిల్హౌట్ కథలోని మిస్టరీని మరింత పెంచుతోంది.కృష్ణ అనే కథానాయకుడు సాధారణమైన, ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతుంటాడు. అయితే కొన్ని నిజాలను బయటపెట్టకుండా ఉండటమే మంచిదనే పరిస్థితులు ఎదురవుతుంటాయి. అలాంటి సమయంలో అతడి జీవితంలోకి ప్రేమ ప్రవేశిస్తుంది. అనుకోకుండా బయటపడిన ఓ రహస్యం అతను నమ్మిన ప్రతిదాన్నీ తలకిందులు చేసే పరిస్థితి ఏర్పడుతుం... ప్రేమ, దాగి ఉన్న నిజాల చుట్టూ సాగే ఈ కథ.. సమాజం అంగీకరించే విషయాలకు, ప్రశ్నించాలనుకునే అంశాలక... మధ్య ఉన్న సన్నని గీతను ఆవిష్కరించనుంది.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.